ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 11.11.2025 | సంపుటి : 12 | సంచిక : 111 | పేజీలు : 12 | వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




# జయ జయహే.. అందెశ్రీ
# అమర్ రహే..



## అస్వస్థతతో కన్నుమూసిన తెలంగాణ సాహితీ శిఖరం

**నేడు అధికారం లాంఛనాలతో అంత్యక్రియలు • ప్రగాఢ సంతాపం తెలిపిన సీఎం రేవంత్, మోదీ**





*తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలింది. ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ ఆకస్మిక మృతి కలిచివేసింది. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణను రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు. తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర సాధనలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచింది ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర గీతం కొత్త స్వరాలతో రూపకల్పన చేసుకున్నాం. స్వరాష్ట్ర సాధనలో, జాతిని జాగృతం చేయడంలో ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిఉంటుంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి*

హైదరాబాద్(జనంసాక్షి): మనిషిన్నవాడు మాయమై పోయాడు. మానవ్వం ఉన్న చోటుకు తిరిగి రాకుండా పోయారు. పల్లె అన్నీ నేర్పిందన్న ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ కన్నుమూశారు. 64 ఏండ్ల అందెశ్రీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం రాత్రి లాలాగూడలోని తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ' పాటను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గేయంగా గుర్తించింది. 1961, జూలై 18న ఉమ్మడి వరంగల్ జిల్లా మద్దూరు



కవి అందెశ్రీ పార్థివ దేహం

మండలం రేబర్తిలో అంటే ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఉన్న రేబర్తిలో అందెశ్రీ జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లన్న. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. 'మాయమై పోతున్నడమ్మ మనిషన్నవాడు' అనే పాటతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అశు కవిత్వం చెప్పడంలో దిట్ట అయిన అందెశ్రీ..

మిగతా 2లో..



# ఢిల్లీలో భారీ పేలుడు

## ఎర్రకోట సమీపంలోని కారులో విస్ఫోటనం
## ఘటనలో 10 మంది మృతి... 24 మందికి గాయాలు

- ఘటనతో దేశ రాజధానిలో హైఅలర్ట్
- ఆత్మాహుతి దాడిగా పోలీసులు అనుమానం
- పేలుడు ఘటనపై ప్రధాని మోదీ ఆరా
- సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తాం: అమిత్ షా
- అత్యంత హృదయ విదారకం: రాహుల్
- ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు సంభవించింది. ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద పార్కింగ్ స్థలంలో నిలిపి ఉంచిన ఓ కారులో పేలుడు సంభవించింది. 10 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది. 24 మందికి గాయాలు కాగా.. క్షతగాత్రులను స్థానిక ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించారు. సాయంత్రం 6.55 గంటలకు పేలుడు జరిగిందది ప్రమాదం అనంతరం ఏడు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. పేలుడు నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం సహా క్లూస్ టీమ్ ఘటనా స్థలికి చేరుకున్నాయి. ప్రమాదం అనంతరం స్థానికంగా భీతావహ వాతావరణం

మిగతా 2లో..



## ఉగ్రమూకల ఆటకట్టు

- భారీ ఉగ్రకుట్ర భగ్నం
- ఎనిమిది మంది అరెస్టు
- 2900 కిలోల పేలుడు సామగ్రి స్వాధీనం

2లో..

జనవరి 1లోగా..

# అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాల్సిందే..



**లేకుంటే కంపెనీలను మూసుకోవాల్సిందే..**

**దగ్గుమందు మరణాలతో తయారీ కంపెనీలకు కేంద్రం అల్టిమేటమ్**

న్యూఢిల్లీ(జనంసాక్షి):జనవరి ఒకటి నాటికి అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాలని ఔషధ తయారీ సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఔషధ తయారీసంస్థలు.. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలకు అనుగుణంగా కఠినమైన నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నట్లు నిర్ధరించుకోవాలి. 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్‌లో 20 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు వల్ల ఆయా రాష్ట్రల్లో పలువురు చిన్నారులు మృతి చెందిన ఘటన కలకలం సృష్టించిన నేపథ్యంలో సోమవారం ఔషధ తయారీదారులకు కేంద్ర ప్రభుత్వం అల్టిమేటం ఇచ్చింది. లేకపోతే కంపెనీలు మూసుకోవాల్సిందేనని హెచ్చరించింది. ఈ మేరకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆదేశాలు జారీచేసింది. జనవరి ఒకటి నాటికి ఔషధ తయారీసంస్థలు గ్లోబల్ గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్ కు అనుగుణంగా ఉండాలని

మిగతా 2లో..

## మధ్యాహ్న భోజనం తిని 17 మంది విద్యార్థులకు అస్వస్థత

**కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఘటన**

2లో..




# నేడు జూబ్లీహిల్స్ 'ఉప'పోరు

- డ్రోన్లతో నిఘా వ్యవస్థ
- పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి
- ఎన్నికల కేంద్రాలకు తరలిన సిబ్బంది

హైదరాబాద్(జనంసాక్షి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 4 లక్షల 1,365 మంది ఓటర్లు ఉన్నారు. 58 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఎన్నికల కోసం 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నాలుగు ఈవీఎంలను ఏర్పాటు చేశారు. కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియం నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలింపు ప్రక్రియ మొదలైంది. సిబ్బందికి ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రిని అధికారులు పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం కల్లా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు తరలించనున్నారు. 3 వేల మంది పోలింగ్ సిబ్బంది, 2 వేల మంది పోలీసులతో కలిపి మొత్తం 5 వేల మంది పోలీసులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల విధుల్లో ఉన్నారు. మొత్తం 407 పోలింగ్ కేంద్రాల్లో 226 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. ఈసారి డ్రోన్ల ద్వారా పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ జరుగనుంది. 103 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి.లయ్యాయి. సమస్యత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో భద్రత కట్టుదిట్టం చేయనున్నారు. 45 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 230 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశారు. ఎంసీసీ నిబంధనలు అతిక్రమించిన 27 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా.. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉపఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపినాథ్ భార్య మాగంటి సునీత బరిలో ఉండగా.. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పోటీలో ఉన్నారు. మూడు ప్రధాన పార్టీల నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎలాగైన ఉప ఎన్నికలో గెలవాలని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తీవ్రంగా కృషి చేశాయి. మరి జూబ్లీహిల్స్ ప్రజలు ఎవరికి పట్టం కట్టనున్నారో చూడాలి.

## రెండో దశ పోలింగ్‌కు బీహార్ సిద్ధం

**122 స్థానాలు..**
**3.7 కోట్లమంది ఓటర్లు..**

పాట్నా(జనంసాక్షి): రెండో దశ పోలింగ్‌కు బిహార్ సిద్ధమైంది. మొత్తం 122 అసెంబ్లీ స్థానాల్లో 1,302 మంది అభ్యర్థుల భవితవ్యం మంగళవారం ఈవీఎంలలో నిక్షిప్తం కానుంది. నీతీశ్ సర్కారులోని పలువురు మంత్రులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సంక్లిష్టమైన బిహార్ సామాజిక వ్యవస్థలోని వివిధ వర్గాల మద్దతును నిలుపుకొనేందుకు పాలక ఎన్డీయే, ప్రతిపక్ష 'ఇండియా'

మిగతా 9లో..



దేశంలో విద్యారంగ పితామహుడు

# అబుల్ కలాం ఆజాద్

**ఆయన జయంతి రోజును జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నాం: ముఖ్యమంత్రి రేవంత్**



హైదరాబాద్(జనంసాక్షి):స్వతంత్ర భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి దేశ విద్యా రంగానికి పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్ కే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. దేశ తొలి విద్యా శాఖ మంత్రి శ్రీ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా విద్యారంగ ప్రగతికి ఆజాద్ చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా, వయోజన అక్షరాస్యత, సార్వత్రిక ప్రాథమిక విద్య, 14 సంవత్సరాల్లోపు బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్య, వృత్తి శిక్షణ తో పాటు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఏర్పాటు వంటి విభిన్న విధానాలతో దేశంలో విద్యారంగ అభివృద్ధికి ఆజాద్ ఎంతగానో కృషి చేశారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ఆయన జయంతి రోజును జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. మౌలానా ఆజాద్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగానే గ్రామీణ, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేశామని,

మిగతా 2లో..

శంషాబాద్ విమానాశ్రయం తరహాలో

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

- రూ.715 కోట్లతో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు
- స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఏర్పాటు
- రైల్వేస్టేషన్ కోసమే ప్రత్యేకంగా 2 సబ్‌స్టేషన్ల నిర్మాణం
- ప్రత్యేకంగా 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు ఏర్పాటు
- ఆధునీకరణ పనులను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):శంషాబాద్ విమానాశ్రయం మాదిరిగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దుతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో అధునాతనంగా రూపుదిద్దుకోబోఓతోందని అన్నారు. వచ్చే ఏడాది డిసెంబర్‌లోగా ఆధునీకరణ పూర్తవుతుందని అన్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం.. మీడియాతో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను మెట్రో మార్గంతో అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. రూ.715 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు సాగుతున్నాయి. స్టేషన్‌ను 1.65 లక్షల చ.మీ మేర కొత్తగా నిర్మిస్తున్నాం. ఈ స్టేషన్‌కు నిత్యం 1.97లక్షల ప్రయాణికులు వస్తుంటారు. 2.70లక్షల మంది ప్రయాణికుల అవసరాలకు తగినట్లు నిర్మిస్తున్నాం. నడుస్తున్న రైళ్లు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పనులు చేయాల్సి వస్తోంది. ఈ స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఉంటాయి. రైల్వే స్టేషన్ కోసమే ప్రత్యేకంగా 2 సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోందని కిషన్ రెడ్డి తెలిపారు. 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు కూడా ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే ఏడాది డిసెంబర్‌లోపు ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆధునిక సికింద్రాబాద్ స్టేషన్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాంఅని కిషన్‌రెడ్డి

మిగతా 2లో..

# డీప్‌ఫేక్ ప్రభావంతో న్యాయవ్యవస్థకూ ముప్పే



- సీజేఐ ఆందోళన
- అప్రమత్తంగా ఉండాలని న్యాయవాదులకు హెచ్చరిక

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఆధునిక సాంకేతిక యుగంలో చాలా మంది డీప్‌ఫేక్ సమస్యలను ఎదుర్కొంటు న్నారు. వాయిస్ క్లోనింగ్, డీప్‌ఫేక్, చాట్‌బాట్ ఫిషింగ్ వంటి టూల్స్, యాప్స్‌ను ఉపయోగించి దీని ద్వారా సైబర్ నేరగాళ్లు తేలికగా మోసాలకు పాల్పడుతున్నారు. ఈ డీప్‌ఫేక్ ఫొటోలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ సైతం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏఐ దుర్వినియోగం న్యాయవ్యవస్థపై కూడా పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎందరో న్యాయమూర్తులు, న్యాయవాదుల మార్ఫింగ్ చిత్రాలు కూడా తమ దృష్టికి వచ్చినట్లు

మిగతా 2లో..

ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం..

## మళ్లీ సుప్రీంకు బీఆర్ఎస్

- తెలంగాణ స్పీకర్‌పై సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్
- గడువులోగా గడ్డం ప్రసాద్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న భారాస

2లో..

మళ్లీ ఊపందుకున్న

# ఊహాగానాలు

- కర్ణాటకలో సీఎం మార్పు?..
- సిద్ధరామయ్యకు నో అపాయిట్మెంట్

ఢిల్లీ(జనంసాక్షి): కర్ణాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి మార్పుపై ఊహాగానాలు మళ్లీ ఊపందుకు న్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఢిల్లీకి వెళ్లి పార్టీ అధిష్టానంతో భేటీ కావాలని ప్రయత్నించినా, కాంగ్రెస్ సీనియర్ నేతలు అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలన పూర్తి చేసుకుంటుండగా.. నవంబర్‌లో సీఎం మార్పు జరిగే అవకాశాలపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ గత కొన్ని

మిగతా 2లో..





## గ్రూప్-2 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**నేటి నుంచి తెలుగువర్సిటీలో ప్రక్రియ**


హైదరాబాద్(జనంసాక్షి):గ్రూప్-3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను టీజీపీఎస్సీ పరిశీలించనుంది. మంగళవారం నుంచి హైదరాబాద్ నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనుంది. ఈ ప్రక్రియ నవంబర్ 26 వరకు కొనసాగనుంది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరిశీలన జరుగనుందని టీజీపీఎస్సీ వెల్లడించింది. ధ్రువపత్రాల

మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org
మంగళవారం 11.11.2025

# జయ జయహే .. అందెశ్రీ అమర్ రహే..





ప్రజాకవి, ప్రకృతి కవిగా ప్రసిద్ధి చెందారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తన పాటలతో ప్రజలను ఉత్తేజితులను చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'తోపాటు ఎన్నో పాటలు రాశారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 2006లో గంగ సినిమాకు నంది పురస్కారం అందుకున్నారు. 2014లో అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కరం, లోక్‌నాయక్ పురస్కారం అందుకున్నారు.

**ఆస్పత్రికి తీసుకుని వచ్చేసరికే మృతి..**

కవి అందెశ్రీ రణపై గాంధీ వైద్యులు వివరణ ఇచ్చారు. అస్వస్థతకు గురైన ప్రముఖ కవి, రచయిత అందెశ్రీని సోమవారం ఉదయం 7.20 గంటలకు గాంధీ ఆసుపత్రికి తీసుకువచ్చారని వైద్యుడు సునీల్ కుమార్ తెలిపారు. అప్పటికే ఆయన గుండెపోటుతో చనిపోయారని చెప్పారు. 'మా దగ్గరికి వచ్చేటప్పటికే ఆయన చనిపోయి 5 లేదా 6 గంటలు అయినట్లు ఉంది. అందెశ్రీకి 15 సంవత్సరాలుగా రక్తపోటు ఉంది. దీనికి సంబంధించిన మందులను నెలరోజులుగా ఆయన వాడటం లేదని తెలిసింది. 3 రోజులుగా ఆయాసంతో బాధపడుతున్నారు. రాత్రి భోజనం చేశాక మామూలుగానే పడుకున్నారు. ఉదయం వెళ్లి చూస్తే కిందపడి ఉన్నారని కుటుంబ సభ్యులు చెప్పారని సునీల్ కుమార్ తెలిపారు.

**సిఎం రేవంత్ తీవ్ర సంతాపం**

అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి .రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణను రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర సాధనలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందని గుర్తు చేశారు. అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర గీతం కొత్త స్వరాలతో రూపకల్పన చేసుకున్నామని, అందెశ్రీతో కలిసి పంచుకున్న ఆలోచనలు, ఆయనతో తనకున్న అనుబంధాన్ని సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందంటూ... ఆయన మరణం పట్ల ముఖ్యమంత్రి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. స్వరాష్ట్ర సాధనలో, జాతిని జాగృతం చేయడంలో ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. ప్రముఖ కవి, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీకి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలని ముఖ్యమంత్రి అధికా రులను ఆదేశించారు. వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని చీఫ్ సెక్రెటరీకి ఆదేశాలు జారీ చేశారు.

పూడ్చలేని లోటు... : మోదీ

తెలంగాణ రాష్ట్ర ఐకానిక్ గీతం "జయ జయ హే తెలంగాణ" రచయిత, ప్రఖ్యాత కవి అందె శ్రీ ఆకస్మిక మరణంపై ప్రధానమంత్ర నరేంద్ర మోదీ సంతాపం వెలిబుచ్చారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో ఒక సందేశాన్ని పోస్ట్ చేశారు."అందెశ్రీ మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు. ఆయన ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి. ఒక గొప్ప కవి, మేధావి అయిన ఆయన, ప్రజల పోరాటాలకు , ఆకాంక్షలకు ,అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారు. ఆయన పదాలకు హృదయాలను కదిలించే శక్తి, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను ఏకం చేసే శక్తి,ప్రజల సాంఘిక హృదయస్పందనకి రూపం ఇచ్చే శక్తి ఉన్నాయి. ఆయన సామాజిక స్పృహను, సాహితీ సౌందర్యంతో మిళితం చేసిన విధానం అద్వితీయం. వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఓం శాంతి.' అంటూ ట్వీట్ చేశారు.కాగా సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని నివాసంలో అనారోగ్యానికి గురైన అందెశ్రీని కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. తెలంగాణకు ఇది విచారకరమైన రోజు అంటూ పలువురు సాహిత్య, సంగీత అభిమానులు సంతాపం తెలిపారు. శక్తివంతమైన మాటల ద్వారా తెలంగాణకు ఆత్మీయ స్వరాన్ని అందించిన కవి అందెశ్రీ మరణం పట్లపై పలువురురాజకీయ ప్రముఖులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన రచనలు తరతరాలుగా స్ఫూర్తినిస్తాయంటూ అందెశ్రీ కుటుంబానికి, అభిమానులకు హృదయపూర్వక సంతాపం తెలిపారు.

మంత్రుల సంతాపం

ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ ఆకస్మిక మృతిపై తెలంగాణ మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ కీలక పాత్ర పోషించారని వారు కొనియాడారు. ఈ మేరకు మంత్రులు ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రముఖ ప్రజాగాయకుడు అందెశ్రీ అకాల మరణంపై తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అందెశ్రీ హఠాన్మరణంపై మంత్రి సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజానికి, సాహితీ లోకానికి ఇది ఎప్పటికీ పూడ్చలేని లోటని పేర్కొన్నారు. మలిదశ ఉద్యమ కెరటమై, రాష్ట్ర సాధన ఆకాంక్షను కోట్లాది ప్రజల గుండెల్లో బలంగా నిలిపిన చారిత్రక గీతాన్ని అందించిన మహనీయుడు అందెశ్రీ అని కొనియాడారు. ఆయన కలం నుంచి జాలువారిన ప్రతి పదం, తెలంగాణ చరిత్రకు నిలువెత్తు సాక్ష్యమని తెలిపారు. ఆయన సాహితీ సంపద, ముఖ్యంగా జయ జయహే తెలంగాణ గీతం ఉన్నంత వరకు అందెశ్రీ మన గుండెల్లో చిరస్మరణీయులుగా నిలిచిపోతారని కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రముఖ ప్రజాగాయకుడు అందెశ్రీ అకాల మరణంపై తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావంలో ఆయన రచనలు, గానం కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణను రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.ప్రముఖ కవి రచయిత, తెలంగాణ రాష్ట్ర గీతం సృష్టికర్త అందెశ్రీ మరణంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మృతిపై తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మల్లు భట్టి విక్రమార్క ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మృతిపై తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర దిగ్బాం÷-రతి వ్యక్తం చేశారు. తనకు అత్యంత ఆప్తుడని.. ఆయన అకాల మరణం వ్యక్తిగతంగా తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. 'జయ జయహే తెలంగాణ' అని ముక్కోటి గొంతుకైన అందెశ్రీ స్వరాష్ట్ర సాధనలో, జాతిని జాగృతం చేయడంలో వారి కృషి చిరస్థాయిగా నిలిచి ఉంటుందని ప్రశంసించారు. ఆయన మరణం యావత్ తెలంగాణ సమాజానికి తీరని లోటని అన్నారు. తీవ్ర విషాదంలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ ఆకస్మిక మృతిపై మంత్రి వాకిటి శ్రీహరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ మరణం తెలంగాణ సాహిత్య లోకానికి తీరని లోటని తెలిపారు. అందెశ్రీ పాటతో తెలంగాణ చరిత్ర, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని నొక్కి చెబుతూ ఉద్యమాన్ని తీవ్రతరం చేశారని గుర్తుచేశారు.

**అందెశ్రీ కి నివాళి అర్పించిన డిజిపి**

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ బి.శివధర్ రెడ్డి ప్రముఖ కవి దివంగత శ్రీ అందెశ్రీ భౌతికకాయాన్ని లాలాగూడ ప్రాంతంలోని జిహెచ్‌ఎంసి మైదానంలో సోమవారం రాత్రి సందర్శించి నివాళి అర్పించారు. వారి కుటుంబానికి సానుభూతిని తెలిపారు. అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ జననీ జయకేతనం%ౌ%' గేయం తెలంగాణ పాడుకొనే జాతి గీతంగా అందరి హృదయాలలో నిలిచిపోయిందని, తెలంగాణ ఉద్యమానికి ఇంధనంగా, చోదకశక్తిగా నిలిచిన గేయాలలో ప్రముఖస్థానం వహించిందని డిజిపి అభిప్రాయపడ్డారు.

**కిషన్ రెడ్డి నివాళి**

ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మరణం తెలంగాణ సమాజానికి, సాహితీ లోకానికి తీరని లోటని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అందెశ్రీతో పాల్గొనే అవకాశం తనకు వచ్చిందని గుర్తుచేశారు. తనతో పాటు పోరుయాత్రలో చాలా సభల్లో ఆయన పాల్గొనేవారని చెప్పుకొచ్చారు. చాలాసార్లు తమ ఇంటికి వచ్చి సమకాలీన అంశాలు, రాజకీయాల పై చర్చించామని గుర్తుచేశారు. అలాగే అందెశ్రీ తనకు సలహాలు కూడా ఇచ్చేవారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అందెశ్రీ నివాసానికి కిషన్‌రెడ్డి వెళ్లి ఆయన పార్థీవదేహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అందెశ్రీతో తనకు ఉన్న అనుభవాలను గుర్తు చేసుకున్నారు. 'మాయమైపోతున్నడమ్మ మనిషన్న వాడు, జయ జయహే తెలంగాణ' వంటి అద్భుతమైన పాటలను తెలంగాణ ఉద్యమ సమయంలో రాశారని పేర్కొన్నారు. ఆయన పాటలతో లక్షలాది మందిలో స్ఫూర్తి రగిలించారని తెలిపారు. అందెశ్రీ మృతిని తెలంగాణ సమాజం, కవులు, కళాకారులు జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పుకొచ్చారు. అనేక విషయాలను ముక్కుసూటిగా చెప్పే గొప్ప వ్యక్తిత్వం అందెశ్రీదని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నదులపై పరిశోధన చేసి పుస్తకం రాయాలనే సంకల్పంతో ఆయన అనేక పరిశోధనలు చేశారని వివరించారు. దురదృష్టవశాత్తూ ఆ పుస్తకం పూర్తి కాకుండానే వారు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంటే అందెశ్రీకి ఎంతో అభిమానం ఉందని తెలిపారు. చాలా పేదరికం నుంచి, గ్రామీణ ప్రాంతాల నుంచి ఆయన వచ్చారని వివరించారు. గ్రామీణ ప్రాంతాల సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసి, ప్రజల హృదయాలను గెలుచుకున్నారని కొనియాడారు. సమాజంలో మార్పు రావాలని, ప్రజల్లో చైతన్యం కలిగించాలని ప్రతి క్షణం అందెశ్రీ ఆలోచించేవారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మృతిపట్ల సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన అకాల మరణం బాధాకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అందెశ్రీ అకాల మరణం పట్ల మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సంతాపం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' రచయిత మృతి చాలా బాధాకరమన్నారు. తెలంగాణ సాహితీ లోకానికి, రాష్ట్రానికి తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. అందెశ్రీ అకాల మరణం పట్ల మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణంపై ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కవిగా మహోన్నతమైన పాత్రను నిర్వర్తించారు.

**అందెశ్రీ మృతికి జగన్ సంతాపం**

ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అందెశ్రీ మరణంపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది విషాదకరమైన విషయం అన్న ఆయన, తెలంగాణ మాండలిక సాహిత్యంలో అందెశ్రీ తన ప్రత్యేకత చాటారని అన్నారు. అతి సామాన్య కుటుంబంలో జన్మించి, గొర్రెల కాపరిగా జీవన ప్రస్థానాన్ని ప్రారంభించి, భవన నిర్మాణ కార్మికుడిగా కూడా పని చేసిన అందెశ్రీ ఎలాంటి పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారని కొనియాడారు. అందెశ్రీ మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటు అని అభివర్ణించిన వైఎస్ జగన్ అందెశ్రీ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు.ప్రముఖ తెలుగు సాహితీవేత్త, గేయ రచయిత అందెశ్రీ మరణం బాధాకరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' రచించి తెలంగాణ చరిత్రలో ఆయన చిరస్మరణీయంగా నిలిచారని కొనియాడారు. అందెశ్రీ మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపారు.

# ఉగ్రమూకల ఆటకట్టు



న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉగ్రనిరోధక చర్యల్లో జమ్మూకశ్మీర్ పోలీసులు భారీ విజయం సాధించారు. హరియాణా పోలీసులతో కలిసి నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ ఉగ్ర మాడ్యూల్ గుట్టురట్టు చేశారు. నిషేధిత జైషే మహమ్మద్, అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్ ఉగ్రసంస్థలతో సంబంధం ఉన్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఇందులో ముగ్గురు వైద్యులూ ఉన్నారు. ఈ క్రమంలోనే పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్ పోలీసు ప్రతినిధి వెల్లడించిన వివరాల ప్రకారం.."అక్టోబరు 19న శ్రీనగర్‌లోని బన్‌పొరా నౌగామ్ ప్రాంతంలో పోలీసులు, భద్రతాబలగాలను లక్ష్యంగా చేసుకుని.. జైషే మహమ్మద్ పోస్టర్లు వెలిశాయి. ఈ వ్యవహారంపై ఉపా చట్టంతోపాటు ఆయా చట్టాల కింద కేసు నమోదు చేశాం. దర్యాప్తులో భాగంగా.. ఉగ్రవాద భావజాలం కలిగిన విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌తో కూడిన ఓ ఉగ్రవ్యవస్థ వెలుగుచూసింది. ఈ బృందానికి పాకిస్థాన్, ఇతర దేశాల నుంచి పనిచేస్తున్న హ్యాండ్లర్లతో సంబంధాలున్నాయి.సామాజిక, ధార్మిక కార్యక్రమాల ముసుగులో అవసరమైన నిధులు సేకరించారు. వ్యక్తుల్లో తీవ్రవాద భావజాలాన్ని ప్రేరేపించి ఉగ్రసంస్థల్లో చేర్పించడం, లాజిస్టిక్స్ ఏర్పాటు, ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు ఐఈడీల తయారీకి అవసరమైన పదార్థాల సేకరణలో పాల్గొన్నట్లు గుర్తించాం. ఈ కార్యకలాపాల సమన్వయం కోసం నిందితులు ఎన్‌క్రిప్టెడ్ ఛానెళ్లను ఉపయోగించారు" అని పోలీసు ప్రతినిధి వెల్లడించారు.

# హైదరాబాద్‌కు అమెరికా కంపెనీ

## నగరంలో సొనాటైప్ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ ప్రారంభం

హైదరాబాద్:(జనంసాక్షి):ప్రపంచ ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ సప్లై చైన్ సెక్యూరిటీ కంపెనీ సోనాటైప్ హైదరాబాద్‌లో తన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ ను ప్రారంభించింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఐటీ, ఇండస్ట్రీస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్ హాజరయ్యారు. అమెరికా వెలుపల సంస్థ స్థాపించిన ఇది మొదటి రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ కూడా. హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో 200కుపైగా దీప్‌టెక్ ఇంజనీర్లు, ప్రోడక్ట్ లీడర్లు, కృత్రిమ మేధస్సు నిపుణులు పనిచేస్తారు. వీరు సురక్షిత సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్, ఏఐ ఆధారిత సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సాంకేతిక ఆవిష్కరణలకు తోడ్పడనున్నారు. కంపెనీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫార్చ్యూన్ కంపెనీలలో 70% సంస్థలకు సేవలు అందిస్తోంది. 15 మిలియన్లకు పైగా సాఫ్ట్‌వేర్ డెవలపర్ కమ్యూనిటీకి ఇది మద్దతు ఇస్తోంది. ఈ సందర్భంగా కంపెనీ గ్లోబల్ లీడర్‌షిప్ హైదరాబాద్‌లో తమ జీసీసీ ప్రారంభించడం పట్ల ఆనందం వ్యక్తం చేసింది. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, "హైదరాబాద్ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లో సోనాటైప్ చేరడం మాకు ఆనందంగా ఉంది. సైబర్ సెక్యూరిటీ రంగంలో ఆవిష్కరణలకు హైదరాబాద్ నుంచి వారు చేస్తున్న కృషి విలువైనదిగా నిలుస్తుంది" అన్నారు.2024లో హైదరాబాద్ 70 జీసీసీలను ఆకర్షించింది. ఈ క్రమంలో ఈ ఏడాది చివరి నాటికి మరిన్నింటిని నగరంలో స్థాపించబడతాయని, దేశవ్యాప్తంగా ఏర్పడుతున్న కొత్త జీసీసీలలో 30-35% హైదరాబాద్‌లోనే వస్తాయని అంచనా. ఏఐ,లాట్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో నైపుణ్యమైన మానవ వనరులు, సదుపాయాలు, రియల్ ఎస్టేట్, ఆవిష్కరణ వాతావరణం ఇవన్నీ హైదరా బాద్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్న కీలక అంశాలుగా మారాయి.




## దేశంలో విద్యారంగ పితామహుడు అబుల్ కలాం ఆజాద్

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ఉపాధ్యాయులు, లెకర్చర్ల నియామకంతో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పాటుపడుతున్నామని సీఎం తెలిపారు. జాతీయోద్యమంలో పాల్గొనడంతో పాటు అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించారని సీఎం కొనియాడారు.

## డీప్‌ఫేక్ ప్రభావంతో న్యాయవ్యవస్థకూ ముప్పే

తెలిపారు. ఏఐ దుర్వినియోగం విషయంలో న్యాయవాదులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాధారణ ఏఐకి, జెన్ ఏఐకి మధ్య చాలా వ్యత్యాసముందని..జెన్ ఏఐని న్యాయవ్యవస్థలోకి వస్తే అది ఉనికిలో లేని చట్టాలను కూడా రూపొందిస్తుందని న్యాయవాది కార్తికేయ రావల్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

## గ్రూప్-2 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

పరిశీలనకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు 2 జిరాక్స్ సెట్లు కూడా తమతోపాటు తీసుకురావాల్సి ఉంటుంది. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్ల జాబితాను టీజీపీఎస్సీ ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఉంచింది. వెరిఫికేషన్‌కు ఏ రోజు, ఏ షెడ్యూల్‌లో హాజరు కావాలనే పూర్తి వివరాలను అందుబాటులో ఉంచినట్లు కమిషన్ కార్యదర్శి ప్రియాంక వెల్లడించారు. అభ్యర్థులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం హాజరు కావాలని సూచించారు.

## ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఫిరాయింపు ఎమ్మెల్యే అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ముగిసినా, ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ ఈ పిటిషన్ దాఖలు చే సింది. ఈ పిటిషన్‌ను త్వరగా విచారణకు స్వీకరించాలని అభ్యర్థించింది.

# మళ్లీ ఊపందుకున్న ఊహాగానాలు

నెలలుగా అధిష్టానంతో సంప్రదింపులు జరుపుతున్నారు.తాజా పరిణామాల్లో, సిద్ధరామయ్య ఢిల్లీకి వెళ్లినా, పార్టీ పెద్దలు అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం చర్చనీయాంశమైంది. అయినా కూడా, సిద్ధరామయ్య ఢిల్లీలో జరిగిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం, కర్ణాటకలో జరిగిన ఓ సభలో సిద్ధరామయ్య మాట్లాడుతూ, తన ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం ఉందని, రాబోయే రెండున్నరేళ్లూ తామే అధికారంలో ఉంటామని, తదుపరి ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌దే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, సిద్ధరామయ్య శిబిరానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు ఢిల్లీలో సమావేశమయ్యారు. ఆయన సోదరుడు, కొప్పల్ ఎంపీ రాజశేఖర్ హిట్నాల్ తన నివాసంలో విందు ఏర్పాటు చేశారు. ఇది పేరుకే విందు అయినా.. అంతర్గతంగా సిద్ధరామయ్య బల ప్రదర్శనగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# ఢిల్లీలో భారీ పేలుడు



నెలకొంది. పేలుడు ధాటికి చుట్టుపక్కనే ఉన్న పలు కార్లు, ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. కారులో ఉంచిన పేలుడు పదార్థాలను దూరం నుంచి ఎవరైనా రిమోట్ కంట్రోల్ సాయంతో పేల్చి ఉంటారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ప్రతి సోమవారం ఢిల్లీలోని పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లకు సెలవు కావడంతో ప్రమాదం తీవ్రత తక్కువగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**పెద్ద శబ్దం వినిపించింది: ప్రత్యక్ష సాక్షి**

"ఈ పేలుడు జరిగినప్పుడు నేను గురుద్వారా వద్ద ఉన్నాను. భారీ శబ్దం వినిపించింది. అదేంటో మాకు అర్థంకాలేదు. అంత పెద్దగా వినిపించింది. ఆ వాహనానికి సమీపంలో ఉన్న మరికొన్ని వాహనాలూ పూర్తిగా దగ్ధమయ్యాయి" అని ఓ ప్రత్యక్ష సాక్షి వెల్లడించారు.

**అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తాం: అమిత్ షా**

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. "సాయంత్రం ప్రాంతంలో ఎర్రకోట సమీపంలోని సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఓ కారులో పేలుడు సంభవించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఘటనలో కొంతమంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు పాదచారులు గాయపడ్డారు. కొన్ని వాహనాలు దెబ్బతిన్నాయి. సమాచారం అందిన 10 నిమిషాల్లోనే ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్, స్పెషల్ బ్రాంచ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించాలని ఆదేశించాం. ఢిల్లీ సీపీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌ఛార్జ్‌తో మాట్లాడాను. వారు ప్రస్తుతం ఘటనా స్థలంలో పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తాం. వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతాం" అని అమిత్ షా తెలిపారు.అంతకుముందు ఈ ఘటనపై అమిత్ షా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారు. పేలుడు ఘటన వివరాలను ఆయనకు కమిషనర్ వివ రించారు. ఈ ఘటనకు సంబంధించి ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌ను కేంద్ర హోంమంత్రి ఆరా తీస్తున్నారు.

**సిగ్నల్ వద్ద కారు ఆగుతుండగా.. ఒక్కసారిగా పేలుడు**

ఎర్రకోట మెట్రోస్టేషన్ సమీపంలో జరిగిన పేలుడు ఘటనపై ఢిల్లీ నగర పోలీస్ కమిషనర్ కీలక వివరాలను వెల్లడించారు. సాయంత్రం 6.52గంటల సమయంలో ఈ పేలుడు జరిగినట్లు వెల్లడించారు. ఎర్రకోట సమీపంలో నిదానంగా వచ్చి రెడ్‌లైట్ వద్ద కారు ఆగిందని, ఆగి ఆగుతుండగానే ఒక్కసారిగా పేలుడు జరిగిందని వివరించారు. ఈ పేలుడు ధాటికి సమీపంలోని వాహనాలు ధ్వంసమయ్యాయన్నారు. ఈ ఘటనలో పలువురు మృతి చెందగా.. మరికొంత మంది గాయపడినట్లు సీపీ చెప్పారు.

**పేలుడు ఘటనపై ప్రధాని మోదీ ఆరా**

ఎర్రకోట సమీపంలో చోటుచేసుకున్న పేలుడు ఘటనపై ప్రధాని మోదీ ఆరా తీశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ ఘటనలో మృతులకు సంతాపం తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు అధికారులు సహాయ సహకారాలు అందిస్తున్నారనీ.. హోంమంత్రి అమిత్ షా, ఇతర అధికారులతో పరిస్థితిని తాను సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు, పేలుడు ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఢిల్లీ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారు. పేలుడు ఘటన వివరాలను అమిత్ షాకు కమిషనర్ వివరించారు.

**అత్యంత హృదయ విదారకం..: రాహుల్**

కారు పేలుడు ఘటన అత్యంత హృదయ విదారమైనదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ ఘటనను తనను తీవ్ర ఆందోళన గురిచేసిందన్నారు. ఈ ఘటనలో చాలా మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారన్న వార్తలు తీవ్ర బాధాకరమని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ దుఃఖ సమయంలో మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. .

**సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి**

ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ అమానుష ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

**కుట్ర కోణంపై దర్యాప్తు చేయాలి: ఆప్**

మరోవైపు, ఈ దుర్ఘటనపై ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ అధినేత అర్వింద్ కేజ్రీవాల్ స్పందించారు. పేలుడు జరిగి కొందరు మృతిచెందినట్లు వస్తున్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇది చాలా బాధాకరమంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ పేలుడు ఎలా జరిగిందో, దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనేదానిపై పోలీసులు, ప్రభుత్వం వెంటనే దర్యాప్తు చేయాలని కోరారు.

## శంషాబాద్ విమానాశ్రయం తరహాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పునర్నిర్మిస్తున్నట్లు కిషన్ రెడ్డి ప్రకటించారు. దక్షిణ భారత దేశంలోనే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని ఆయన పేర్కొంటూ.. అమృత్ భారత్ పథకం కింద రూ. 714 కోట్లతో ఈ స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నామని, ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం 1,97,000 మంది ప్రయాణికులు రోజువారీగా ఈ స్టేషన్‌కు వస్తున్నారని, ప్రతి గంటకు సుమారు 23 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ.. పనుల వేగం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నూతన నిర్మాణాలలో భాగంగా సౌత్ మెయిన్ బిల్డింగ్, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, ట్రావెలర్‌తో కూడిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు.

## జనవరి 1లోగా అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాల్సిందే..

స్పష్టం చేసింది. ఈ తేదీలో ఎలాంటి పొడిగింపులు ఉండవని తేల్చిచెప్పింది. భారత్‌లో తయారైన కొన్ని దగ్గుమందుల వల్ల స్వదేశంతో పాటు విదేశాల్లో పిల్లల మరణాలు సంభవించిన సంగతి తెలిసిందే. భారత్ నుంచి ఎగుమతి అయిన ఈ మందుల వల్ల గాంబియా, ఉజ్బెకిస్థాన్, కామెరూన్ వంటి దేశాల్లో చిన్నారులు మృతి చెందిన ఘటనలు వెలుగుచూశాయి. ప్రభుత్వ నిబంధనల అమలులో నిర్లక్ష్యం, పాత తయారీ విధానాలు అనుసరిస్తోందంటూ భారత్‌పై అంతర్జాతీయంగా ఒత్తిడి వస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం తీవ్రంగా స్పందించింది. ఈ దగ్గు మందును తమిళనాడు లోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా.. సిరప్‌లో 48.6 శాతం అత్యంత విషపూరితమైన డైఇథైలిన్ ÷-లగైకాల్ ఉందని తేలినట్లు విచారణాధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. దగ్గుమందు తయారీ విషయంలో సరైన పర్యవేక్షణ లేదని, సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో విషపూరితమైన సిరప్ మార్కెట్లోకి ప్రవేశించిందని, ఆ నిర్లక్ష్యం పిల్లల మరణాలకు దారితీసిందని దర్యాప్తులో భాగంగా గుర్తించారు. సరైన తయారీ పద్ధతులు అవలంబించడం లేదని, 300కు పైగా ఉల్లంఘనలను రికార్డు చేసినట్లు చెప్పారు. శ్రేసన్ ఫార్మా అనుమతులను తమిళనాడు ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే.

## మధ్యాహ్న భోజనం తిని 17 మంది విద్యార్థులకు అస్వస్థత

**జమ్మికుంట(జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న 17 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు చికిత్స కోసం వారిని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. మధ్యాహ్న భోజనంలో గుడ్లు వాసన వచ్చాయని, అన్నంలో పురుగులు ఉన్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు.

# అందెశ్రీ మృతితో రేబర్తిలో విషాదఛాయలు

- తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్న గ్రామస్థులు




**సిద్దిపేట, నవంబర్10 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రజా కవి, గాయకుడు డాక్టర్ అందెశ్రీ గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. అందెశ్రీ((64)) మృతితో ఆయన స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రేబర్తి గ్రామానికి చెందిన అందె బొడ్డయ్య, ఎల్లమ్మ దంపతులకు ముగ్గురు సంతానం ఇద్దరు కుమారులు, ఒక కూతురు, వీరిలో ఒకరు అందె ఎల్లయ్య. చిన్ననాటి నుండి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు. తన తండ్రి బుడ్డయ్య గ్రామానికి చెందిన జక్కిరెడ్డి మల్లారెడ్డికి పశువుల కాపరిగా జీతం ఉంచాడు. అక్కడ నుండి అదే గ్రామానికి చెందిన ఎండీ మునీర్ వద్ద కూడా అందెశ్రీ పశువుల కాపరిగా జీతం ఉన్నాడు. జీతం చేస్తూనే మేస్త్రి పని నేర్చుకొని నిజామాబాద్ జిల్లాకు వలస కూలిగా వెళ్లి అక్కడ పనిచేశాడు. 1980 సంవత్సరంలో తిరిగి రేబర్తి గ్రామానికి వచ్చి అక్కడనుండి చేర్యాల ప్రాంతానికి మేస్త్రి పని చేశాడు. నాడు వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ చేర్యాలలో పాటలు, సాహిత్య పోటీలు నిర్వహించడంతో ఆ పోటీలలో మొట్టమొదటగా పాల్గొని మొదటి బహుమతి పొందాడు. 1987లో రేబర్తి సొసైటీ డైరెక్టర్గా గెలుపొందాడు. చేర్యాల మండలం బండపల్లి గ్రామానికి చెందిన మల్లవ్వ తో వివాహం జరిగింది. వీరికి నలుగురు సంతానం. ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. అప్పటి నుండి పాటలు రాస్తూ హైదరాబాద్కు కుటుంబంతో తరలి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. శృంగేరి మఠానికి సంబంధించిన స్వామి శంకర్ మహారాజ్ ఇతను పాడుతుండగా విని ఇతడిని చేరదీసాడు. నాటి నుంచి నేటి వరకు ఆయన కలం నుంచి సమాజాన్ని మేలుకొల్పే ఎన్నో గేయాలు వెలువ డ్డాయి. తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ పాటలు ఉద్యమాన్ని ఉర్రూలూగించాయి. సినీ నటుడు నారాయణ మూర్తి ద్వారా వచ్చిన విప్లవాత్మక సినిమాల విజయం వెనుక ఈ పాటలున్నాయి. తెలంగాణ, ప్రకృతి లాంటి అంశాలపై గేయరచన చేసారు. అందెశ్రీ మృతితో రేబర్తిలో విషాదఛాయలు అలుముకు న్నాయి. గ్రామంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని స్థానికులు కంటతడి పెట్టుకున్నారు.

# పరకాలను దోచుకున్న చల్ల ధర్మారెడ్డి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆగ్రహం



**ఆత్మకూర్, నవంబర్ 10 (జనం సాక్షి):** పరకాల నియోజక వర్గములో అవసరము లేకున్నా కూడా తన స్వార్థం కోసం ఇళ్లను కూల్చిన పరమ దుర్మార్గుడు మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆత్మకూర్ మండలంలోని పలు గ్రామాలలో కోట్లాది రూపాయలతో ఎస్సీ కాలనీలలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపనలు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి చేశారు. అనంతరం అగ్రం పహాడ్ గ్రామములో శంకుస్థాపన చేసిన అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి తన స్వార్థం కోసం నియోజకవర్గమును దోచుకున్నాడని దుయ్యబట్టారు. అవసరం లేకున్నా కూడా తనే కాంట్రాక్టర్ కావడంతో స్వార్థం కోసం ఇండ్లను కూల్చి ఆ నిరుపేదలకు గృహాలు అందించలేని మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి చేయడం కన్నా తీరని అన్యాయం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం ధనిక రాష్ట్రాన్ని దోచుకుని పుట్టబోయే పిల్ల పేరు మీద కూడా ఆరు లక్షల అప్పులు చేసిన దుర్మార్గులు అని మండిపడ్డారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకుని వాటాలు పంచుకునే మధ్య కుటుంబం తనకసస్తున్నారన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని దళిత కాలనీలను ఆదర్శంగా అభివృద్ధి చేస్తానని మోసం చేసిన కెసిఆర్ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శిస్తే తెలంగాణ ప్రజలు తన్ని తరుముతారు అన్నారు. వీరు చేసిన అవినీతి అక్రమాలను అదే దుబాయిలో అయితే ఉరిశిక్ష విధించే వారన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ బీరం సునంద సుధాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కమలాపురం రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం స్వామి, మాజీ వైస్ ఎంపీపీ ముద్దం సాంబయ్య, మాజీ సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, మాజీ జెడ్పిటిసి కక్కెర్ల రాధిక రాజు గౌడ్, అగ్రంపాడు గ్రామ కమిటీ అధ్యక్షులు ఏలియా, పంచాయతీరాజ్ డిఇ యుగంధర్, ఏ ఈ బాబురావు, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల కోసం
# ఎంపీలపై ఒత్తిడి తేవాలి

- పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్
- కేయూలో బీసీ విద్యార్థుల ధర్మదీక్ష



**హనుమకొండ (జనంసాక్షి) :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి పురుడు పోసిన కాకతీయ యూనివర్సిటీ గడ్డ మీద బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ అరగంటి నాగరాజు ఆధ్వర్యంలో మళ్లీ బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి శ్రీకారం చుట్టడం శుభపరిణామని రాష్ట్ర బీసీ, విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్,ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అభిప్రాయపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా విద్యా, ఉద్యోగ, కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా స్థానిక సంస్థల కోటాలో 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం రేవంత్ ప్రభుత్వం అసెంబ్లీలో రెండు బిల్లులు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా తీర్మానం చేస్తే,బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్పించకుండా అన్యాయం చేసిందని అన్నారు. భవిష్యత్తులో మేమెంతో మాకంతా వాటా దక్కేందుకు పార్లమెంట్ సభ్యులపై ఒత్తిడి తెచ్చి, రాజ్యాంగ సవరణ చేసే విధంగా ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, కేయూ పాలకమండలి సభ్యులు, డా. చిర్ర రాజు, తదితర బీసీ నాయకులు ధర్మదీక్ష ప్రారంభించగా, జర్నలిజం విభాగాధిపతి సంగని మల్లేశ్వర్, తెలుగు విభాగాధి పతి,డాక్టర్ మామిడి లింగయ్య విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి బీసీ జేఏసీ వైస్ చైర్మన్లు బోనగాని యాదగిరి గౌడ్, దాడి మల్లయ్య యాదవ్, దొడ్డపల్లి రఘుపతి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బచ్చు ఆనందం, రాష్ట్ర కార్యదర్శి భీమగాని యాదగిరి గౌడ్, బీసీ నాయకులు బక్కి అవినాష్, ప్రొఫెసర్ మండల సారంగపాణి, డాక్టర్ పెద్దమళ్ళ శ్రీనివాసరావు, ఆకుతోట శ్రీనివాస్, కృష్ణ యాదవ్, సంకినేని వెంకన్న, రమేష్, బీసీ విద్యార్థి నాయకులు, సామాజిక ఉద్యమకారులు, తదితరులు పాల్గొన్నారు.



# గిరిజనుల సంస్కృతిని కాపాడాలి

- కేంద్రప్రభుత్వ మాజీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ ఈఎఎస్ శర్మ

హైదరాబాద్ (జనంసాక్షి) : గిరిజనుల సంస్కృతిని కాపాడాలని కేంద్రప్రభుత్వ మాజీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ ఈఎఎస్ శర్మ తెలిపారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో జరిగిన పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. గిరిజనుల జీవిత విధానాన్ని, సంస్కృతిని కాపాడాలంటే ప్రభుత్వాలు గిరిజనుల నిజమైన అవసరాలను తీర్చాలని అన్నారు. సోమవారం నాడు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సోషల్ సైన్స్ విభాగంలో ఆంత్రపాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జరిగిన పుస్తకావిష్కరణ సభలో మల్టీ డిసిప్లినరీ స్టడీస్ ఆఫ్ ది డెక్కన్ ట్రైబ్స్ అనే ఆంగ్ల గ్రంథాన్ని కేంద్రప్రభుత్వ మాజీ కార్యదర్శి డా. ఇ.ఎ.ఎస్. శర్మ, సోషల్ సైన్స్ డీన్ ప్రొ. కె. సునీతా రాణిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. శర్మ మాట్లాడుతూ ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో గిరిజనులను అడవి నుండి దూరం చేస్తున్నారు. వాస్తవంగా వారి జీవన విధానాన్ని, సంస్కృతిని కాపాడాలంటే ప్రభుత్వాలు గిరిజనులతో మమేకమై వారి నిజమైన అవసరాలు తీర్చాలని అన్నారు. ప్రసిద్ధ గిరిజన పరిశోధకురాలు డా. ఊర్మిళ పింగ్లె 1969 నుండి పరిశోధన చేసి, రాసిన వ్యాసాలు ఒక సంకలనంగా తేవటం అభినందనీయం అన్నారు. ప్రొ. సునీతా రాణి మాట్లాడుతూ ప్రముఖ చిత్రకారుడు రామ్చందర్ గుహ పుస్తకానికి ఉపోద్ఘాతం రాయటం అంటేనే ఇది ప్రాముఖ్యత కల్గిన పుస్తకం అని అన్నారు. గిరిజన సంక్షేమ మాజీ అధికారి డా. వి. ఎన్. వి. కె. శాస్త్రి, డా. ద్యావనపల్లి సత్యనారాయణలు మాట్లాడుతూ గిరిజనులపై వచ్చిన ఈ పుస్తకం దక్కన్ ప్రాంతపు చరిత్ర పూర్వయుగం నుండి మరియు గిరిజన జాతుల జీవన విశేషాలను ప్రతిబింబించేదిగా ఉన్నదని అన్నారు. ఈ సభలో రచయిత్రి డా. ఊర్మిళ పింగ్లె, ప్రొఫెసర్ షీలా ప్రసాద్, ప్రొఫెసర్ ఆర్. శివప్రసాద్, ప్రొఫెసర్ వెంకట్రావ్, ఆంత్రపాలజీ డిపార్ట్మెంట్ బాధ్యులు ప్రొఫెసర్ రోమేష్ సింగ్, ప్రొఫెసర్ అప్పారావు, తెలంగాణ పబ్లికేషన్స్ అధిపతి కోయ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పాటల కవిత్వం అందెశ్రీ ప్రాణం

- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** జయ జయహే తెలంగాణ గీతాన్ని అందించి తెలుగు కవిత్వాన్ని ఉర్రూతలూగించిన అందెశ్రీ తెలంగాణ ఎర్రసైలకల పేగు బంధం అని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తెలిపారు. పాట అందెశ్రీ ప్రాణమని, గానం ఆయన దేహమని, ఆశువుగా చెప్పే కవిత్వం అందెశ్రీ దేహమని పేర్కొన్నారు. జనం నాలుకలపై పాటల కవిత్వాన్ని రాసి మాయమైపోయిన అందెశ్రీ తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని అన్నారు. పాటగా పుట్టి, పాటగా పెరిగి, బతుకంతా పాట కవిత్వమై జీవించిన అందెశ్రీ కి జోహార్లు. నదుల పుట్టుకను చూసుకుంటూ, ఆ అలలపై తేలి ఆడుతూ తన కలలను "ది నడిచిపోతున్నదని' కావ్యమైన అందెశ్రీ పాటల కవిత్వ నదిగా సాహిత్య చరిత్ర లో చిరస్థాయిగా నిలిచిపోతారని నివాళులర్పించారు.

# అందెశ్రీ మృతి పట్ల చిన్నారెడ్డి సంతాపం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రముఖ కవి, రచయిత, డా. అందెశ్రీ అకాల మరణం పట్ల మాజీమంత్రి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ గీత రచయిత అందెశ్రీ మృతి చాలా బాధాకరం. రాష్ట్ర సాహితీ లోకానికి తీరని లోటు అని చిన్నారెడ్డి అన్నారు. వారి కుటుంబ సభ్యులకు చిన్నారెడ్డి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.

# ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులకు ఆదరణ

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి




**గోపాల్పేట (జనంసాక్షి) :** ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ఆదరణ ఉందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. గోపాల్పేట్ మండలం జయన్న తిరుమలాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సులో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి గారు పాల్గొన్నారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ పూర్వం వ్యవసాయం చేస్తే రైతుల ఇంటిదగ్గర ఆవులు, ఎద్దులు, గేదెలు అధికంగా ఉండడంతో వాటి పేడను వ్యవసాయం పొలంలో చల్లి ఆర్గానిక్ వ్యవసాయం చేసే వారని అన్నారు. నేటి కాలంలో రైతుల ఇంటిదగ్గర ఆవులు, ఎద్దులు ,గేదెలు కనిపించకుండా తగ్గాయి కాబట్టి జంతువుల పేడ లేకపోవడంతో రసాయనాలు వాడి పంటలు పండిస్తున్నారని అన్నారు.

# ప్రజా వాగ్గేయకారుడు అందెశ్రీకి అరుణోదయ నివాళి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రజా కవి, వాగ్గేయకారుడు డాక్టర్ అందెశ్రీ గాంధీ ఆసుపత్రిలో గుండెపోటుతో మరణించారన్న వార్త మమ్మల్ని ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురిచేసిందని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు విమలక్క, రాష్ట్ర అధ్యక్షులు మల్సూర్, ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్ తెలిపారు. సాటి ప్రజలను, చుట్టూ ఉన్న ప్రకృతిని పాఠశాల గా భావించి ఆయన నేర్చుకున్న పాటల విద్య తెలంగాణ గీతమై మన హృదయాల్లో మాయం కాలేని గుర్తుగా నిలిచిపోయిందని, ఎన్నో డాక్టరేట్లకు సమానమైన సాహిత్యాన్ని సృష్టించిందని తెలంగాణ ఉన్నంతవరకు అందెశ్రీ గీతం ఉంటుందని, 'జై బోలో తెలంగాణ పాట" లో ఉద్యమాన్ని "మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు" అన్న పాటలో లోకం పోకడను మనకు అందించి ప్రపంచ పర్యటనకు వెళ్లినట్టే ఆయన మన నుండి తుది వీడ్కోలు తీసుకున్నాడని, తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో అందెశ్రీతో ఎన్నో వేదికలు మేము పంచుకున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రమున్నంత వరకు ప్రజల హృదయాల్లో 'జయ జయహే తెలంగాణ/జననీ జయకేతనం అనే తెలంగాణ రాష్ట్ర గీతంలో అందెశ్రీ సజీవంగా ఉంటారు. చిన్నతనం నుండి కష్టాలు, కన్నీళ్లు మూటగట్టుకుని, ఎంతోమంది తెలంగాణ జానపద వైతాళికుల సాంగత్యంలో గొప్ప పాండిత్యాన్ని అలవరచుకున్నాడని, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ పాటలన్నింటినీ గ్రంథస్తం చేయడంలో ఆయన సంపాదక బాధ్యతలు తీసుకున్న నిప్పుల వాగు నిరంతరం పారుతూ పచ్చని పంటల కోసం సాహిత్య సేద్యం చేయడమే కాకుండా, మారుమూల చీకటి పల్లెల్లోకి వెలుగులు విరజిమ్మాలని ఆశిస్తున్నామని, సుద్దాల హనుమంతు, బండి యాదగిరి, దాశరథిల నుండి చెరబండరాజు, గూడ అంజయ్య, గద్దర్ లాంటి ప్రజా కవుల గొప్ప సాంప్రదాయాన్ని తనవంతుగా కొనసాగిస్తూ వచ్చిన అందెశ్రీకి మరొకసారి నివాళు లర్పిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు, శోఖతప్తులై ఉన్న తెలంగాణ ప్రజాలు, కవులు-కళాకారులందరికీ అరుణోదయ ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తుందని, అందె శ్రీ లోని పాజిటివ్ అంశాలను అరుణోదయ స్వీకరిస్తుందని తెలిపారు.

## పలిమెల మండలంలో
# ట్రైయినీ ఐఏఎస్ల పర్యటన



**మహదేవపూర్, నవంబర్ 10 (జనంసాక్షి) :** పలిమెల మండలం లేంకలగడ్డ గ్రామంలో సోమవారం ట్రైని ఐఏఎస్ ల బృందం జిల్లా అధికారులతో కలిసి పర్యటించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు ట్రైని ఐఏఎస్ లు లేంకల్లగడ్డ గ్రామంలోని పలు పనుల అభివృద్ధి కార్యక్రమలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల తో పాటు అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పాఠశాల విద్యార్థులకు అంగన్వాడి పిల్లలకు అందుతున్నటువంటి మౌలిక వసతుల సదుపాయాలను పరిశీలించారు. ట్రైని ఐఏఎస్ అధికారుల వెంట మండల స్థాయి అధికారులు. సిడిపిఓ అయిత రాధిక. ఎంపీడీవో సాయి పవన్. ఎంపీఓ ప్రకాష్ రెడ్డి. ఎస్సై రమేష్. సీఐ వెంకటేశ్వర్లు. పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్. తదితరులు పాల్గొన్నారు

# హైదరాబాద్లో సోనాటైప్ జీసీసీ ప్రారంభం




హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రపంచ ప్రఖ్యాత సాఫ్ట్వేర్ సప్లై చైన్ సెక్యూరిటీ కంపెనీ సోనాటైప్ హైదరాబాద్లో తన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్(జీసీసీ) ప్రారంభించింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఐటీ, ఇండస్ట్రీస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్ హాజరయ్యారు. అమెరికా వెలుపల సోనాటైప్ సంస్థ స్థాపించిన ఇది మొదటి రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్ కూడా. హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో 200కుపైగా డీప్టెక్ ఇంజనీర్లు, ప్రొడక్ట్ లీడర్లు, కృత్రిమ మేధస్సు నిపుణులు పనిచేస్తారు. వీరు సురక్షిత సాఫ్ట్వేర్ డెవలప్మెంట్, ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్, ఏఐ ఆధారిత సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సాంకేతిక ఆవిష్కరణలకు తోడ్పడనున్నారు. సోనాటైప్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫార్చ్యూన్ కంపెనీలలో 70% సంస్థలకు సేవలు అందిస్తోంది. 15 మిలియన్లకు పైగా సాఫ్ట్వేర్ డెవలపర్ కమ్యూనిటీకి ఇది మద్దతు ఇస్తోంది. ఈ సందర్భంగా కంపెనీ గ్లోబల్ లీడర్షిప్ హైదరాబాద్లో తమ జీసీసీ ప్రారంభించడం పట్ల ఆనందం వ్యక్తం చేసింది. సంజయ్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ టెక్నాలజీ ఎకోసిస్టమ్లో సోనాటైపస్ చేరడం మాకు ఆనందంగా ఉంది. సైబర్ సెక్యూరిటీ రంగంలో ఆవిష్కరణలకు హైదరాబాద్ నుంచి వారు చేస్తున్న కృషి విలువైనదిగా నిలుస్తుంది" అన్నారు. 2024లో హైదరాబాద్ 70జీసీసీలను ఆకర్షించింది. ఈ క్రమంలో ఈ ఏడాది చివరి నాటికి మరిన్ని 50 జీసీసీలు నగరంలో స్థాపించబడతాయని, దేశవ్యాప్తంగా ఏర్పడుతున్న కొత్త జీసీసీలలో 30-35 హైదరాబాద్లోనే వస్తాయని అంచనా.


ఏఐ, ఐఓటీ, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో నైపుణ్యమైన మానవ వనరులు, సదుపాయాలు, రియల్ ఎస్టేట్, ఆవిష్కరణ వాతావరణం ం ఇవన్నీ హైదరాబాద్ను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్గా తీర్చిదిద్దుతున్న కీలక అంశాలుగా మారాయి. ఇటీవలి కాలంలో హైదరాబాద్ కేంద్రంగా పలు ప్రధాన జీసీసీలు స్థాపించబడ్డాయి.

# అందేశ్రీ మృతికి పాలమూరు అధ్యయన వేదిక నివాళి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అందెశ్రీ మృతికి టీజేఏసీ మాజీ చైర్మెన్ జి.రాజేందర్ రెడ్డి, ఎంఆర్ జేఏసీ హనీఫ్ అహ్మద్, పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి, కో-కన్వీనర్ కేసీ వెంకటేశ్వర్లు నివాళి అర్పించారు. ప్రపంచంలోని నదులన్నీ చుట్టివచ్చి మానవ జీవన దుఃఖాన్ని ఆర్తిని సంతోషాన్ని కనిపెట్టే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. అక్షరాలను నోటి మీద అల్లటమే కానీ ఆయనది కలం పట్టుకుని రాసిన జీవితం కాదని, ఆయన బాల్యమంతా తొలి యవ్వన కాలమంతా పార పట్టుకుని తాపీ పని చేయడంలో గడిచింది. పశువులను మేపడంలో గడిచిందని, ఆయన లోపలి ధారణ శక్తిని ఊహాశాలిత్వాన్ని గమనించిన వాళ్లు అందించిన దారం పట్టుకుని ఆయన శిఖరాలు అధిరోహించే ప్రయత్నం చేశాడని ఆ ప్రయత్నం పాటలలో ఫలించిందని, ఆ ఫలితాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం గ్రహించి ఆయనకు డాక్టర్ ఇచ్చిందని, ఆయన స్థాయి డాక్టరేట్ పరిధిలో దాటిందని తెలిపారు. మతాల పరిధులు దాటి కులాల గోడలు దాటి మనిషిని మనిషిలా చూడాలని ఆకాంక్షించాడని, అందెశ్రీ మరణం ఎవరూ ఊహించకుండా జరిగిన విషాద ఘటన. ఆయన కుటుంబం అభిమానులు తెలంగాణ సమాజం తీవ్ర సంవేదనకు గురైందని, అందెశ్రీ కి నివాళు లర్పించటమైనా ఆశయాలను ఎత్తిపట్టటమైనా సహజీవన సామరస్యాన్ని విద్వేషపూరితంకాని స్నేహస్పద ఆలోచనలను ముందుకు తీసుకుపోవడమేనని, తెలంగాణ సమాజం ఈ కృషిలో ఉండాలని కోరారు.

## సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు 'జీవిత సాఫల్య పురస్కారం'



మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న 'జాతీయ విద్యా దినోత్సవం' సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఈ 2025 సంవత్సరానికి గాను ప్రదానం చేయనున్న ప్రతిష్టాత్మక 'జీవిత సాఫల్య పురస్కారా'నికి ప్రముఖ చరిత్రకారులు, బహుగ్రంథ రచయిత, జర్నలిస్ట్, న్యాయవాది, నిత్యనూతన చారిత్రక పరిశోధకుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ ఎంపిక కావడం హర్షణీయం. ఆయన అవిశ్రాంతంగా సాగిస్తున్న చరిత్ర రచనా కృషికి గుర్తింపుకు గాను ఆయనను ఈ పురస్కారం వరించడం శుభపరిణామం. ఈ నవంబరు 11 నాడు విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు తదితర ప్రముఖుల సమక్షంలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించనున్నారు. ఈ పురస్కారం క్రింద ఇరవై ఐదు వేల రూపాయలు నగదు మరియు జ్ఞాపికను అందజేసి ఆయనను సత్కరించనున్నారు.

సయ్యద్ నశీర్ అహమ్మద్ దేశవ్యాప్తంగా అందరికి సుపరిచితులు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ముఖ్యంగా ఆయన చరిత్ర రచనలో సుప్రసిద్ధులు. ఆయన తెలుగు నేలకి మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా విశిష్ట మేటి చరిత్రకారుడుగా నిలిచి గొప్ప పేరుని సముపార్జించుకున్నారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం జన సముదాయాలు నిర్వహించిన పాత్రలను ఆయన అనేక వేదికల ద్వారా వ్యక్తీకరిస్తూనే ఉన్నారు. గత మూడు దశాబ్దాలుగా విశేష కృషి చేస్తున్న చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ ఇప్పటివరకు 25 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను రచించి వెలువరించి ప్రపంచవ్యాప్తంగా అశేష పాఠకుల ఆదరణను విరివిగా చూరగొన్నారు. తన గ్రంథాలను ఆయన ఉర్దూ భాషతో పాటుగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడం మరియు గుజరాతి భాషలలో వెలువరించారు. ఆయనే పుస్తక రచనతో పాటుగానే నిరంతరంగా ఆయా పత్రికలలో అనేకంగా వ్యాసాలు రాస్తూనే ఉన్నారు.

సయ్యద్ నశీర్ అహమ్మద్ 2004 నుంచి జర్నలిస్ట్ వృత్తికి స్వస్తి పలికి పూర్తికాలం చారిత్రక పరిశోధనకు అంకితమై కాలగర్భంలో కలగలిసిన నిజాల్ని వెలుగులోకి తీసుకువచ్చి నవ చరిత్రను సృష్టిస్తూనే ఉన్నారు. సయ్యద్ నశీర్ అహమ్మద్ కేవలం చరిత్ర గ్రంథ రచన మరియు ప్రచురణతో సరిపెట్టుకోలేదు. అంతేకాకుండా స్వాతంత్ర్య సమర యోధుల త్యాగమయ, సాహసోపేత పోరాటాలను, స్వాతంత్ర్య సాధనలో వారి పాత్రను ప్రజలకు, ముఖ్యంగా యువత మరియు విద్యార్థులకు ఉపన్యాసాల ద్వారా మరియు అనేక ఫోటో ఎగ్జిబిషన్ల ద్వారా తెలియజేస్తున్నారు. ఆ రకంగా ఆయన పలు రకాలుగా ప్రచార కార్యక్రమాలను అవిశ్రాంతంగా నిర్వహిస్తూ ప్రజానీకాన్ని చైతన్యవంతులను చేస్తున్నారు.

చరిత్ర గ్రంథాల రచన, ప్రచురణను వ్యాపార దృష్టితో కాకుండా సేవా దృష్టితో నిర్వహిస్తున్న సయ్యద్ నశీర్ అహమ్మద్ తన కుటుంబం, తన సన్నిహితుల ఆర్థిక సహాయ సహకారాలతో ప్రచురించిన గ్రంథాలను ఎంపిక చేసిన వందలాది గ్రంథాలయాలకు, చరిత్రకారులకు, జర్నలిస్టులకు తమ వదాన్యుల చిరుగానుకగా నేటికిని అందిస్తూనే ఉన్నారు. పాఠకుల సౌకర్యార్థం తన గ్రంథాలన్నిటినీ అంతర్జాల మాధ్యమాల ద్వారా అందుబాటులో లభ్యమయేటట్లుగా ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అలాగే ఈ గ్రంథాల పీడీఎఫ్ ఫైళ్ళను సైతం ఆయన ప్రత్యేకంగా తయారు చేయించి కోరిన వారికి అంతర్జాలం ద్వారా వేలాది పాఠకులకు నేటికిని అందిస్తూనే ఉన్నారు.

తానే ఒక సైన్యంగా నిరంతరం శ్రమించి మరుగున పడిన చరిత్రని వెలికితీసి శోధించి డాక్టరేట్ లను అధిగమించి విశిష్ట పరిశోధనలు చేసిన సయ్యద్ నశీర్ అహమ్మద్ కృషిని నేటి వరకు ఏ ఒక్క విశ్వవిద్యాలయం కూడా గుర్తించకపోవడం కడు విచారకరం. అనేక మంది విద్యావేత్తలు, మేధావులు మరియు ప్రగతిశీలురు ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయాల్సిన అవశ్యకతను అడపాదడపా వెల్లడిస్తూనే ఉన్నారు. ఇకనైననూ విశ్వవిద్యాలయాలు సయ్యద్ నశీర్ అహమ్మద్ కృషిని గుర్తించి ఆయనకు 'గౌరవ డాక్టరేట్ పురస్కారా'న్ని ప్రదానం చేయాల్సిన అవసరం తప్పకుండా ఉంది. అంతిమంగా 'సయ్యద్ నశీర్ అహమ్మద్ అంటే చరిత్ర'...'చరిత్ర అంటే సయ్యద్ నశీర్ అహమ్మద్' అని అన్నట్లుగా ఆయన జీవన ప్రస్థానం నిత్యనూతనంగా కొనసాగుతూనే ఉంది. 'ఆయన మరిన్ని చరిత్ర రచనలు వెలుగులోకి తీసుకురావాలి' అని ఆకాంక్షిస్తున్నాను.

( నవంబర్ 11 నాడు సయ్యద్ నశీర్ అహమ్మద్ 'జీవిత సాఫల్య పురస్కారా'న్ని స్వీకరిస్తున్న సందర్భంగా)



**జె.జె.సి.పి. బాబూరావు**
రీసెర్చ్ స్కాలర్,
సెల్: 94933 19690.

## పదాలని ప్రజాకంఠంగా మార్చిన కవి అందెశ్రీ

భాష ఏదైనా కావొచ్చు. కానీ ఆ భాషలో పాట నిర్వర్తించే పాత్రను మరే సాహిత్య ప్రక్రియ నిర్వర్తించ లేదు అనేది వాస్తవం. అక్షర సత్యం. వచన కవిత్వానికి దాని శైలి, కథ అనుభూతుల ప్రస్తుతీక రణ ఉంటుంది. కానీ పాట కు మాత్రం మాటల్ని మించి ప్రయాణిం చే శక్తి ఉంటుంది. పాట అనేది రాగానురాగాల ప్రవాహం మాత్రమే కాదు, అది భావనల కీ గొప్ప అక్షర రూపం. అనుభవం, వ్యక్తిత్వం, సమాజ దృక్కోణం మూడింటి సమ్మేళనంగా పాట రూపుదిద్దు కుంటుంది. పాట అనే పదానికి విశ్లేషణాత్మకంగా మూడు విభాగా లుగా అర్థాలివ్వవచ్చు. అవి భావ ప్రకటన, అనుభూతి పరవశత, సామూహిక అనుభవ పంచిక. పాట అనేది మానవ హృదయ స్పందనల ప్రబల రూపం. ఇది ప్రత్యేకంగా జానపద సాహిత్యం లో స్పష్టంగా కనిపిస్తుంది. రాయబడని పల్లె గీతాలు, నాన్న నానమ్మల నోటి మాటగా మారిన జానపద గీతాలు. ఇవి రచయితలెవరో తెలియకపోయినా పాట మాత్రం ప్రవహిస్తూనే ఉంటుంది. కాలానికి అతీతంగా సాగిపోయే ఈ గీతాల గమనమే పాట యొక్క నిత్యత్వాన్ని సూచిస్తుంది. కొన్ని పాటలకు రచయిత పేరు తెలియక పోవచ్చు. కొన్నిటికి రచయిత పేరు కాలగర్భంలో కలిసిపోవచ్చు. కానీ పాట మాత్రం ప్రజల నోటిదిగిన పల్లకిలా ఎప్పటికీ తిరుగుతూనే ఉంటుంది. ఇది పాట అనేక జీవనాల్ని తాకిన అక్షర రేఖ. రచయిత భావం, జీవ అనుభవం, సామాజిక స్పర్శ, సంగీత నృత్య సమ్మేళనంతో కలసి పాట శక్తి వంతమైన అక్షర ప్రయోగంగా మారుతుంది. ఇలాంటి పాటల గొప్ప రచయితలలో డా. అందె శ్రీ ఒకరు. వారి పాటలు హృదయాన్ని మదింపు చేసే త్రివేణి సంగమం లా ఉంటాయి. అక్షరం, రాగం, భావం అనే మూడు మార్గాల్లో ఆయన ప్రయాణం పాటకు కొత్త ఒరవడి ఇచ్చింది.

సాహిత్యంలో సహజత్వం అనేది రచయిత హృదయ స్పందనకు అద్దం పడే లక్షణం. అలాంటి సహజ స్పందనకు జమ కట్టే ప్రకృతి కవి, ప్రజా కవి, ఆత్మజీవి కవిగా పేరొందిన వారు డా. అందె శ్రీ. వరంగల్ జిల్లాలోని జనగాం నియోజకవర్గానికి చెందిన మద్దూర్ మండలంలోని రేబర్తి గ్రామం లో జన్మించారు. అసలు పేరు అందె ఎల్లయ్య. పుట్టుకతో దళిత నేపథ్యం, బాల్యంలో ఎదురైన అనూహ్య సంఘటనలు, సామాజిక వివక్ష, పేదరికం, వలస జీవితం మొదలైనవి ఈ కవి యొక్క అభివృద్ధిని శ్రమ, శోకంతో పాత్రలుగా నిలిచాయి. బాల్యానుభవాల ప్రభావం పిల్లవాడి గా కొరకుడు బడనీ పంచాయితీ పాలకుల దయాదాక్షిణ్యాలతో బతికిన అందె శ్రీ, చిన్న చిన్న పనులు చేస్తూ జీవనం సాగించాడు. జీవితం ఓ పాఠశాల అయితే బాధ అనేది గురువు అవుతుంది. ఎల్లయ్య జీవితంలో వచ్చిన బాధలు, విచారాలు, విరహాలు, అసహ్యాలు అన్నీ పాటలుగా మారాయి. అందుకే ఆయనను పరిశీలిస్తే, "శోకం నుంచి శ్లోకం పుట్టిన కవి" అని విశ్లేషించవచ్చు.


**వలస జీవితం - ఆధ్యాత్మిక మలుపు**

జీవిత పరిస్థితుల వల్ల నిజామాబాద్ ప్రాంతానికి వలస వెళ్లిన ఎల్లయ్య, అక్కడ తాపీ మేస్త్రీగా కూలీగా పని చేశాడు. ఇదే సమయంలో శంకర్ మహా రాజ్ అనే ఆధ్యాత్మిక గురువుతో పరిచ యం ఏర్పడింది. వారితో పరిచయం కవి కి జీవనోపాయం మాత్రమే కాక జీవనోద్దేశం నేర్పింది. మహారాజ్ ఒక రోజు అతనితో అన్న మాటలు "నీవు చూసిన బతుకులను పాటలుగా రాయి", ఎల్లయ్య జీవితాన్ని మలుపు తిప్పిన మంత్ర వాక్యాలుగా నిలిచాయి.

సాహిత్యప్రేరణ వేమన పద్యాలు, కుమ్మరి సిద్ధప్ప రచనలు అందెశ్రీ కీ మంత్ర ముగ్ధులుగా ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా పేర్కొనాల్సిన అంశం ఏమిటంటే ఈ ఇద్దరు కవులు కూడా తమ రచనల ద్వారా జీవితానుభవాల్ని తాత్వికతగా అభివ్యక్తి చేసినవారే. వేమన భావ వివేకం, సిద్ధప్ప ప్రజా స్పర్శ ఆయన పై ప్రభావం చూపాయి. దీనివల్ల డా. అందె శ్రీ కూడా వచన గేయాలకు విలువనిస్తూ, పద్యాల్లాంటి గేయాల రూపంలో అనేక రచనలు చేశారు. ఆయన రచనల్లో కనిపించే చిన్న పదాల వాడకం, సంక్షిప్త రేఖాచిత్రాలు, స్పష్టమైన సందేశాలు వేమన శైలికే సమానంగా ఉంటాయి. అందె శ్రీ రచనల్లో దర్శించబడే ముఖ్యమైన అంశం విరక్తి భావం. అనగా లౌకికతపై ఆసక్తి కోల్పోవడం. ఇది కేవలం ధ్యాన ధార్మిక తత్త్వం గా కాక, జీవిత విరక్తికి రూపం ఇచ్చిన సహజ భాషా వాస్తవికత. ఆయన పాటలలోని ఉదాహరణలు చూస్తే "నీడ నాది కాదు, నీరే నా రూపం..." "నడిచిన బాటలే నన్ను నేర్పించాయి.

**రచనలు - ఇతివృత్తాల విశ్లేషణ**

అందెశ్రీ రచించిన పాటలలో "పల్లె పాడుతుంది", "గుండె గాలి పాట", "పాదాల పాటలు", "పాటలతో పాడిన బతుకులు" అనే గేయాలు ఉన్నాయి."పల్లె పాడుతుంది" అనే గీతంలో గ్రామ జీవనంలో అంతర్లీనమైన వేదన, సమాజమార్గంలో మహిళ భాద్యత, వ్యవసాయ నిస్సహాయత వంటి అంశాల్ని కవి శబ్దాలుగా మలిచాడు."పాదాల పాటలు" అనే కవితా గీతంలో జీవిత పయనా న్ని ప్రతినిధిగా చూపిన "పాదాలు" రూపకం గాఢంగా వర్ణించబడి ంది. ఇందులో పాత్రలు ప్రత్యేకంగా కనిపించకపోయినా, పాదాలు అనే ప్రతీక ద్వారా వలసల యాత్ర, కూలీల బాధ, జీవితం అన్నీ ఆలోచనగా వెల్లువెత్తుతాయి.



**పాటల రూపంలో ప్రకాశించిన పీడల చిత్రణ**

సాహిత్యపరంగా సమాజాన్ని ప్రతిబింబించడమే కాదు, ఆత్మనుభవాన్ని శోధించి శబ్దంగా మలచడం సాహిత్యానికి ఉన్న అత్యున్నత లక్ష్యం. ఈ లక్ష్యాన్ని పరిపూర్ణంగా సాధించిన రచయిత ల్లో డా. అందెశ్రీ ముందుం టారు. వీరి కవి త్వము లో కల్పనకు చోటు లేదు. కళాత్మక అలంకారా లకు బదులుగా జీవన అనుభవా ల నుండి పుట్టిన జీవగీతాలే ప్రధానంగా నిలుస్తాయి. ఈ కారణంగా వారి రచనల్లో మానవతా స్పర్శ, సామాజిక వాస్తవికత, మరియు వ్యక్తిగత శోకాలను సహృదయంతో చూడగల స్వరూపం స్పష్టం గా దర్శించవచ్చు. అందెశ్రీ పాటల్లో, ముఖ్యంగా ఆయన కుమారుడు మరణించిన సందర్భంలో రాసిన పాట

"మళ్లీ జన్మంటూ వుంటే సూరమ్మా..."

ఈ పాట కేవలం భావోద్వేగానికి పరిమితం కాదు. ఇది ఆత్మవేదన రూప సాహిత్య కావ్యం. పాట అంతటా ఓ తల్లి రూపకంగా నిలిచిన సూరమ్మ అనే నిజ జీవిత వ్యక్తిని గుర్తుచేస్తూ, అతని తనయ నష్టాన్ని మానసికంగా భరించలేకపోయిన కవి, ఆ సమయంలో ఇచ్చిన ఓదార్పును శాశ్వత రూపం లో పదంగా మలచారు. ఈ పాటలో సూరమ్మ తల్లి రూపకం. జీవితంలో అనూహ్యంగా దొరికిన మానవతా దృక్పథానికి సంకేతం. "నవ్వుల్లో నాగవల్లీ, నా పాలవల్లి" లాంటి వ్యాఖ్యలు వేదన లోనూ సౌందర్యాన్వేషణ చేసే కవి నిగూఢ దృష్టి ని తెలియజేస్తాయి. ఈ పాట పై విశ్లేషణాత్మక వ్యాసాన్ని కందుకూరి రఘునాథం గారు "పుత్రశోకంలో తల్లి రూపం" అనే శీర్షికతో తెలుగు సాహిత్య సమీక్ష పత్రిక (ఏప్రిల్ 2022 సంచిక)లో ప్రచురించారు.

ఈ పాటకు అందెశ్రీ గారికి నంది అవార్డు లభించడం కేవలం గౌరవమే కాదు. ఓ కమర్షియల్ సినిమాల్లో తక్కువగా వినిపించే సామాజిక గీతాలకు వచ్చిన గుర్తింపు. ఇదే పాటపై విశ్లేషణాత్మకంగా స్పందించిన ఆచార్య వాసం వెంకటరావు "సినిమా గీతాల్లో సామాజిక జ్వాలలు" అనే వ్యాసంలో (ఫిల్మ్ సొసైటీ జర్నల్, 2021) ఈ పాటను మానవ హక్కుల దృష్టితో విశ్లేషించారు.

**అందెశ్రీ గారి పాటలలో కొన్ని ప్రస్తావనీయ గేయాలు**

వీరి పాటలు సామాజిక, వ్యక్తిగత, ప్రాంతీయ సమస్యల ఆధారంగా రూపొందినవి. ఇవి కల్పన ఆధారిత గీతాలు కాదు. అనుభవాల ప్రతిబింబా లు. అవి పల్లెనీకు వందనములమ్మో, గలగల గజ్జెలబండి, జన జాతరలో మన గీతం, పరిగెత్తు నా పాటలు ప్రజల నోట, చినుకమ్మ... చినుకమ్మ... ఈ పాట లలో ప్రజల నోట పలికే భాష, పల్లె జీవిత కదలికలు, సామాజిక వ్యతిరేకతలపై నిరసనలు, ఒక్కొక్కటి కవి సామాజిక అవగాహనకు సూచికలుగా నిలుస్తాయి.

**అందెశ్రీ రచనలు - ఇతివృత్తాల సమీక్ష**

వీరి అందెల సందడి రచన వచన కవిత్వం. ఇందులో కవి జీవిత అనుభవాల మేళవింపు తో తాత్వికత, వేదన కలగలిపి మనిషి అసలు బతుకుబండిని ఆవిష్కరించారు. మరొకటి వాక్కులమ్మ పద్య కావ్యం. ఓ సాధారణ తల్లి బతుకు లోని మర్మాల ను కవి పద్యబద్ధంగా రూపీకరించాడు. పాటల పూదోట అనేది గేయాల సంకలనం. ఇది కవి గాయక మానసిక స్థితికి అద్దంపడే సంపుటి. నదీ తో ప్రయాణం రచన మహాగేయ కావ్యం. జీవితాన్ని నది తో పోల్చి, ప్రతి మలుపు, ప్రవాహాన్ని భావవంతంగా ఊహించి రచించిన గేయ శ్రేణి. ఇది తాత్వికతకు దృశ్యంగా నిలుస్తుంది.

**కొమ్మ చెక్కితే బొమ్మరా-కవిత్వం**

పాటలు కేవలం సంగీతమో, గేయరూపమో కాదు. అవి సమాజపు శ్వాస. నాటి కాలం నుంచి నేటి వరకు సాహిత్యంలో, ముఖ్యంగా గీత రచనలలో, ఆస్తికత్వం%-%నాస్తికత్వం అనే తాత్విక ధ్వనులు ఎన్నో మార్గాల్లో ప్రతిఫలించాయి. కానీ ఈ రెండు దృక్పథాలను సమకాలీన సాంఘిక దృష్టితో సమతుల్యంగా ప్రశ్నించే, అన్ని వర్గాల మానవత్వాన్ని ఒకే తూలికతో లేపే గళంగా నిలిచిన పాటలు అరుదుగా కనిపిస్తాయి. అటువంటి విశిష్టతను కలిగి ఉన్న పాటే డా. అందెశ్రీ రచించిన "కొమ్మ చెక్కితే బొమ్మరా" అనే గేయం. ఈ గేయం ఆస్తికత%-%నాస్తికత అనే రెండింటికీ విసిరిన విప్లవాత్మక సవాల్.

"కొమ్మ చెక్కితే బొమ్మరా,
కొలిచి మొక్కితే అమ్మరా,
ఆది కే ఇది పాదురా,
కాదంటే ఏదీ లేదురా"

అన్న పదబలికలో, ఉన్నది దైవ నిరాకరణ కాదు. ఇది ఒక దైవ ప్రయోజనాన్వేషణ. సాంప్రదాయ భక్తి కలిపిన అసంతృప్తి ధ్వని. ఈ గీతంలో "గూడు బిడ్డ గుహలను వదిలి గుండె రాయిగా చేసుకో న్నారు" అనే పంక్తి మనిషి ప్రకృతి సిద్ధమైన మానవత్వాన్ని త్యజించి ఆచారాల పేరుతో భావనల్ని నిర్మానుష్యం చేసిన పరిస్థితిని చిత్రిస్తు ంది. భక్తి యుక్తుల ఆవరణలో మానవీయత మాయమైపోతున్న దన్న బలమైన విమర్శ ఇది. ఈ సందర్భంలో "కన్న తల్లి ని పరుశు రాముడు... ఎల్లమ్మ పుట్టేను" అన్న భాగంలో కవి స్పష్టం గా కుల కీటకత ను, తల్లి తత్వాన్ని, ఆదరణ ధర్మాన్ని కలిపి దయామయంగా కానీ ధ్వజగతంగా ప్రశ్నిస్తున్నారు. ఇది నర్మగర్భంగా కనిపించవచ్చు కానీ ఆలోచనాత్మకంగా చూస్తే ఇది బ్రాహ్మణిక ధర్మ శాస్త్రాలలోని విచిత్రమైన దుర్మార్గ గాథలపై ఒక అణచివేత హక్కు వాదన. ఈ పాటలు రచన పరంగా చూస్తే ప్రజాపదాలకు సమ్మేళనం. "పదాల గూటికి సామాజిక బాధ్యతను కూర్చోబెట్టిన రచనా శైలి" అనే అభిప్రాయాన్ని సాహితీ పరిశోధకులు విశదీకరించారు (శ్యామల, 2017, తెలంగాణ గేయ వివేకం, ఉషా పబ్లికేషన్స్).

వీరి సాహిత్య సేవకు ప్రతిఫలంగా ఎన్నో ప్రతిష్టాత్మకమైన అవార్డులు వరించాయి. కాకతీయ విశ్వవిద్యాలయం వీరికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా, వాషింగ్టన్ డి.సి.లోని అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ వారు కూడా గౌరవ డాక్టరేట్ తో పాటు 'లోకకవి' అన్న బిరుదును అందించి వీరి ప్రతిభను విస్తృతంగా గౌరవించారు. అంతేకాక, వంశీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి నుండి దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం లభించాయి. దత్త పీఠం నుండి స్వర్ణ కంకణ ధారణ ఘనత కూడా వీరి సాహిత్య ఔన్నత్యానికి సాక్ష్యంగా నిలిచింది. ప్రపంచ తెలుగు సాధన సాహితీ స్రవంతి వారు అందించిన సాహిత్య పురస్కారం ద్వారా వీరి కవితా కృషి కి మరింత నెగిలిన మన్నన లభించింది.

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినందుకుగాను ప్రముఖ కవి, గేయరచయిత అందెశ్రీకి 2025 జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో జరిగిన అధికారిక కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చేతుల మీదు గా రూ. కోటి నగదు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం తరఫున అత్యున్నత గౌరవం.

తెలంగాణ ఉద్యమ కవుల పట్ల కలిగే గౌరవానికి సమ్మేళనంగా, కవి అందెశ్రీని ఒక ప్రజాకవి, ఉద్యమకవి. తెలంగాణ పల్లె ల పట్ల వీరి ప్రేమ, గౌరవం, భక్తి, శ్రద్ధలు అక్షరరూపంలో పలికినప్పుడు, ఆ పద్యాలు ఉద్యమ గీతాలుగా, ప్రజల గుండెల్లో నాటుకుపోయా యి."జయ జయ హే తెలంగాణ - జననీ జయకేతనమా" అనే గీతం, తెలంగాణ ప్రజల అభిమానం మరియు స్వాభిమానానికి ప్రతీకగా నిలిచింది. ఇది కేవలం ఒక పాట కాదు, తెలంగాణ స్వరానికి ప్రతిరూపం. నవంబర్ 2003 లో ఆది లాబాద్ లో నిర్వహించిన తెలంగాణ రైటర్స్ ఫోరమ్ సమావేశంలో ఈ గీతం మొట్టమొదటిసారి పాడబడింది. అనంతరం ఇది అనేక ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యక్రమాల్లో, విద్యాసంస్థల్లో ప్రార్థనాగీతంగా ఆలపించబడింది. ఈ గీతం "మా తెలుగు తల్లికీ మల్లెపూదండ" అన్న రాష్ట్రగీత స్థానాన్ని భర్తీ చేసింది. ప్రముఖ గాయకుడు గోరటి వెంకన్న గానం, రామచారి స్వర సిద్ధాంతం దీనికి జీవం పోసాయి. ఈ గీతం కేవలం శబ్దాల సమాహారమే కాదు. ఇది ఒక ప్రాంతపు ప్రజల భావోద్వేగానికి, ఆకాంక్షలకు, సంఘర్షణకు ప్రతినిధిగా మారింది. అందెశ్రీ రచనా శైలి తాత్వికతతో కూడిన సామాజిక విశ్లేషణను కలిగి ఉంటుంది. జీవిత పార్శ్వాలైన బాధ, ఆకలి, భయం, ఉనికి, నమ్మకం మొదలైన భావనలను లోతుగా ఆవిష్కరించారు.

ఒక సాధారణ గొడ్లకాపరి జీవితం నుండి అసాధారణ సాహితీ ఖ్యాతి పొందిన వ్యక్తిగా అందె శ్రీ విశేషమైన సాహిత్యబలం ప్రదర్శించారు.

**డా. ఐ. చిదానందం**
**తెలుగు ఉపన్యాసకులు**
**వెల్దండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ**
**నాగర్ కర్నూల్ జిల్లా**
చరవాణి - 8801444335

## ఢిల్లీ ఎర్రకోట మెట్రోస్టేషన్ దగ్గర పేలుడు ఉగ్రవాద భయం!

ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నంబర్ 1 దగ్గర పార్క్ చేసిన కారు ఒక్కసారిగా పేలిపోవడం, వరుసగా మంటలు చెలరేగి పక్కనే నిలిపిన మూడు నాలుగు వాహనాలు దగ్ధమవడం దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. సాయంత్రం సమయములో జరిగిన ఈ సంఘటనలో అక్కడున్న ప్రజలు భయభ్రాంతులతో పరుగులు తీయడం, పొగ మేఘాలుపైకి ఎగిసిపోవడం దేశవ్యాప్తంగా టెలివిజన్ ఛానెల్స్, సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్ష చిత్రాలుగా ప్రసారమయ్యాయి. ప్రారంభ సమాచారం ప్రకారం కారులో ఏదో రకమైన పేలుడు సంభవించిందని, బలమైన శబ్దం తరువాత మంటలు చెలరేగి పక్కనున్న వాహనాలకు వ్యాపించాయని ఢిల్లీ అగ్నిమాపక శాఖ పేర్కొంది. ఈ ఘటన తరువాత చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఎర్రకోట పరిసర ప్రాంతమంతా పోలీసు బలగాలతో నిండిపోయింది, ఢిల్లీజూదా కీలక ప్రాంతాలలో హై అలర్ట్ ప్రకటించారు. ఈ కారు పేలుడుకు కారణం ఏమిటి, యాదృచ్ఛిక ప్రమాదమా, పన్నాగం పన్నిన ఉగ్ర చర్యా అనే అంశంపై విచారణ ఇంకా కొనసాగుతోంది. ప్రాథమిక దశలో ఉన్న దర్యాప్తు గురించి అధికారిక సమాచారం పరిమితంగానే బయటకు వస్తోంది కాబట్టి ఈ ఘటనను ఉగ్రదాడిగా ఖరారు చేసే దశ ఇప్పటికీ రాలేదు. అయినా ఈ పేలుడు జరిగిన రోజే, దగ్గరలోని హర్యాణాలోని ఫరీదాబాద్ ప్రాంతంలో భారీగా పేలుడు పదార్థాలు, ఆయుధాలు పట్టుబడిన విషయం బట్టి చూస్తే, దేశవ్యాప్తంగా ప్రమాద సంకేతాలు ఎంత తీవ్ర స్థాయికి చేరుకున్నాయో స్పష్టమవుతోంది. ఫరీదాబాద్ కేసులో దాదాపు 300 కిలోలకుపైగా పేలుడు పదార్థాలు, అసాల్ట్ రైఫిల్ వంటి పరికరాలు స్వాధీనం చేసుకోవడం, బాధ్యులుగా ఇద్దరు వైద్యులు సహా పలువురిని అరెస్ట్ చేయడం జరిగింది.

ఈ పరిణామాల వెంటనే గుజరాత్ ఏటీఎస్ ఇటీవల అరెస్ట్ చేసిన కొంతమంది వ్యక్తుల కేసు కూడా వెలుగులోకి వచ్చింది. ఆ కేసులో అఫ్ఘానిస్తాన్‌లో ఉన్న హ్యాండ్లర్‌కు అనుబంధంగా నిర్వహించినట్లు చెప్పబడుతున్న డాక్టర్‌తోపాటు యూపీకి చెందిన యువకులు పాకిస్థాన్ సరిహద్దు వద్ద డ్రోన్ల ద్వారా ఆయుధాలు, విషతుల్య రసాయనాల్ని స్వీకరించినట్టు విచారణ సంస్థలు వెల్లడించాయి. ఈ కేసు వివరాలు బయటకు వచ్చిన వెంటనే రిసిన్ వంటి అత్యంత ప్రమాదకర విషపదార్థాలు కూడా ఈ కుట్రలో భాగమైనట్లు బయటపడటం దేశ భద్రతా వ్యవస్థలకి పెద్ద హెచ్చరిక అయ్యింది.

ఇప్పటికే లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి అతి తీవ్రవాద సంస్థలు కాశ్మీర్ లోయలో సమన్వయ దాడులకై కదలికలు ప్రారంభించాయని నిఘా వర్గాలు ఇటీవల హెచ్చరిక నివేదికలు పంపాయి. పాకిస్థాన్‌కు చెందిన హఫీజ్ సయీద్ భారతదేశంపై కొత్త కుట్రలు పన్నుతున్నాడని, బంగ్లాదేశ్ వంటి పొరుగు దేశాలను కొత్త లాంచ్ ప్యాడ్‌లుగా మలచే ప్రయత్నం చేస్తున్నాడని కూడా తాజా ఇంటెలిజెన్స్ సమాచారం వెల్లడిస్తోంది. అంతేకాక ఇటీవల దేశవ్యాప్తంగా విమానాశ్రయాల వద్ద కూడా నిర్దిష్ట కాలానికి హై అలర్ట్ అమలులో ఉండేలా కేంద్ర సంస్థలు సూచనలు ఇచ్చాయి. ఈ సంఘటనల సమాహారం చూస్తే ఎర్రకోట మెట్రో స్టేషన్ దగ్గర జరిగిన పేలుడు ఏ కోణంలో జరిగినా, దేశ భద్రతకు ఇది ఒక హెచ్చరిక గడియారంలా మోగిందని చెప్పాలి.

ఢిల్లీ వంటి రాజధాని నగరాలు సామాన్య ప్రజల జీవిత కేంద్రాలు మాత్రమే కాదు, రాజకీయ, ఆర్థిక, వ్యాపార నిర్ణయాల ఆవాసాలు. అందుకే గత రెండు దశాబ్దాలలో ఢిల్లీని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు పలుమార్లు దాడులకు పాల్పడ్డారు. 2005 అక్టోబర్ 29న దీపావళికి కాస్త ముందుగా సరోజినీ నగర్, పహార్గంజ్, గోవింద్‌పురి ప్రాంతాలలో వరుస బాంబు పేలుళ్లు జరగడం, దాదాపు 60 మందికిపైగా ప్రాణాలు కోల్పోవడం దేశాన్ని కుదిపేసిన సంఘటన. ఆ తరువాత 2008 సెప్టెంబర్ 13న ఢిల్లీలోని కానాట్ ,కరోల్ బాగ్ తదితర ప్రాంతాలలో ఐదు చోట్ల వరుస పేలుళ్లు జరిగి 20కుపైగా మంది ప్రాణాలు కోల్పోయారు. 2011లో ఢిల్లీ హైకోర్టు గేటు వద్ద జరిగిన బాంబు పేలుడు కూడా రాజధాని భద్రతలోని లోపాలను బహిర్గతం చేసింది.



ఈ నగరంలోనే భారత పార్లమెంట్‌పై 2001 డిసెంబర్ 13న జరిగిన దాడి భారత ప్రజాస్వామ్యం గుండెల్లో గాయంలా గుర్తుండిపోయే సంఘటన. ప్రజాస్వామ్య వ్యవస్థలపై ద్వేషంతో నిండిన ఉగ్రవాద మానసికత ఎంత ప్రమాదకర రూపం తీసుకుంటుందో ఈ దాడి ప్రపంచానికి చూపించింది. ఈ సమస్త దాడులలో ప్రధాన లక్ష్యం ఏమిటంటే ప్రజలలో భయం నింపడం, ప్రభుత్వంపై విశ్వాసం దెబ్బతీయడం, సామాజిక ఐక్యతను పాడు చేయడం.

ఇలాంటి నేపథ్యం ఉన్న దేశంలో తాజా ఎర్రకోట మెట్రో సంఘటన, ఫరీదాబాద్ వంటి ప్రాంతాలలో పెద్ద ఎత్తున పేలుడు పదార్థాల స్వాధీనం, ఉగ్రవాద సంస్థల కదలికలపై వస్తున్న నిఘా నివేదికలు కలిపి చూస్తే, దేశంలో ఉగ్రవాద చర్యలు మళ్లీ ఉధృతమయ్యే ప్రమాదాన్ని తేలికగా తిప్పికొట్టలేము. ఒకవైపు అంతర్జాతీయ సరిహద్దులపై డ్రోన్‌ద్వారా ఆయుధాల స్మగ్లింగ్, మరొకవైపు ఇంటర్నెట్ ద్వారా మౌలికవాద ప్రచారం, ఎన్క్రిప్టెడ్ యాప్‌లలో రహస్య సందేశాల మార్పిడి వంటి సాంకేతిక పద్ధతులు ఉగ్రవాదులకి కొత్త సాధనాలుగా మారుతున్నాయి. పేలుడు పదార్థాల రూపం కూడా గతంతో పోలిస్తే మారుతోంది. అమోనియం నైట్రేట్, ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్ డివైసులు మాత్రమే కాక విషతుల్య రసాయనాలనూ పరిగణలోకి తీసుకుంటున్నట్లు తాజా కేసులు సూచిస్తున్నాయి.

ఈ పరిస్థితిలో అమాయక పౌరుల ప్రాణాలు అత్యంత అస్థిర స్థితిలో ఉంటాయి. ఉగ్రవాదులు ఎంచుకునే లక్ష్యాలు ఎక్కువగా మార్కెట్లు, బస్ స్టాండ్లు, మెట్రో స్టేషన్లు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి జనసంద్రత గల ప్రదేశాలు కాబట్టి సామాన్య వ్యక్తి ప్రతీ రోజూ ప్రయాణించే మార్గమే ప్రమాద గమనంగా మారిపోతుంది. 2005, 2008 ఢిల్లీ పేలుళ్లు దీపావళి షాపింగ్‌కు వచ్చిన సాధారణ కుటుంబాలపై పడి ఎంత విషాదం సృష్టించాయో అప్పటి వార్తాచిత్రాలు గుర్తు చేస్తున్నాయి. నేటి ఎర్రకోట మెట్రో సమీప ఘటనలో కూడా అదే ఆశంక కనిపిస్తోంది - స్వల్ప సమయంలో తప్పించుకోలేని స్థితిలో ఉన్న ప్రయాణికులపై తక్షణ ప్రభావం పడుతుంది, ఆ ఘటనను ప్రత్యక్షంగా చూసిన వారికి దీర్ఘకాలిక మానసిక ఆందోళన మిగులుతుంది.

ఇలాంటి సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కోవడానికి కేవలం పోలీసు బలగాలు చాలు అనుకోవడం పొరపాటు. భద్రతా వ్యవస్థ ఒక వైపు పనిచేస్తుంటే, ప్రజాస్వామ్య దేశంలో ప్రతి పౌరుడూ నిధానంగా అప్రమత్తత చూపాలి. అనుమానాస్పదంగా కనిపించే కానిస్టర్లు, నిర్లక్ష్యంగా వదిలేసిన బ్యాగులు, అనుచితంగా ప్రవర్తించే వ్యక్తుల గురించి వెంటనే సమీప పోలీసు బలగాలకు, మెట్రో సిబ్బందికి సమాచారం ఇచ్చే అలవాటు పెరగాలి. సామాజిక మాధ్యమాల్లో అసత్య వార్తలు, గాలి వార్తలు వ్యాప్తి చెందకుండా ఉన్న సమాచారాన్ని ధృవీకరించుకున్న తరువాత మాత్రమే పంపాలి. పుకార్లు ఒక నగరాన్ని మరింత భయాందోళనకూ గురి చేస్తాయి, విచారణలో ఉన్న సంస్థల పనికి ఆటంకం కలిగిస్తాయి.

ప్రభుత్వం పక్షాన చూసుకుంటే దేశ భద్రతా వ్యవస్థకు వ్యూహాత్మక బలోపేతం అవసరం. రాష్ట్ర పోలీసు శాఖల ఆధునికీకరణ, అధునాతన కమ్యూనికేషన్ సాధనాలు, డ్రోన్ మానిటరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సీసీటీవీ విశ్లేషణ వంటి పద్ధతులు విస్తృతంగా వినియోగంలోకి రావాలి. కేంద్ర నిఘా సంస్థలు, రాష్ట్ర నిఘా విభాగాలు, మెట్రో రైలు సంస్థ, రైల్వే రక్షణ దళాలు పరస్పర సమాచారం సమయానికి పంచుకునే వ్యవస్థ మరింత పటిష్ఠం కావాలి. అంతర్జాతీయ స్థాయిలో ఉగ్రవాదానికి ఆర్థిక మద్దతు అందించే నెట్‌వర్క్‌లను గుర్తించి తగిన ఆంక్షలు విధించే దిశలో కూడా భారతదేశం ఇప్పటికే తీసుకుంటున్న చర్యలు మరింత వేగవంతం కావాలి.

ఉగ్రవాద సమస్యను కేవలం చట్ట ఆర్డినెన్స్ దృక్పథంతో మాత్రమే చూడలేం. సమాజంలో చివరి అంచులో నిలిచి ఉన్న యువతను ఆధునిక మౌలికవాద ప్రచారం సులభంగా ఆకర్షించే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో విద్యా వ్యవస్థ, మతపరమైన నేతృత్వం, సివిల్ సొసైటీ సంస్థలు కలసికట్టుగా కార్యాచరణ జరపాలి. అసహనంను, విద్వేషాన్ని పెంచే భాషకు బదులుగా మానవతా విలువలపై ఆధారపడిన చర్చలు, వేదికలు పెరగాలి. బలహీన వర్గాల ఆర్థిక పురోగతికి ఆస్కారం కలిగించే విధంగా ప్రభుత్వ పథకాలు నిజంగా లక్ష్యగ్రూప్‌లకు చేరితే, ఉగ్రవాద సంస్థల ఆకర్షణ కొంత మేర తగ్గుతుంది. ఇలాంటి సామాజిక దృక్పథం లేకుండా కేవలం కఠిన చట్టాల వల్ల మాత్రమే దీర్ఘకాలిక శాంతి సాధ్యం అయ్యేది కాదు.

ఢిల్లీ ఎర్రకోట మెట్రో స్టేషన్ దగ్గర పేలుడు, ఫరీదాబాద్‌లో భారీ పేలుడు పదార్థాల స్వాధీనం, దేశవ్యాప్తంగా నిఘా సంస్థలు ఇచ్చిన తాజా హెచ్చరికలు - ఇవన్నీ కలిపి చూస్తే దేశం ప్రస్తుతం సున్నిత దశలో ఉందని స్పష్టమవుతోంది. ప్రజాస్వామ్య భారతదేశం ఎదుగుదలకి, ఆర్థికాభివృద్ధికి ఇది ఒక తీవ్రమైన సవాలుగా భావించాలి. అమాయకుల ప్రాణాలు కోల్పోయేలా సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రతి పౌరుడూ జాగ్రత్త, ప్రతి సంస్థ నిరంతర అప్రమత్తత, ప్రతి నాయకత్వం బాధ్యతతో ముందడుగు వేయాల్సిన సమయం ఇది. భయంతో నిశ్చలంగా నిలబడి ఉండటం కాదు, తెలివైన అప్రమత్తతతో, సామాజిక ఐక్యతతో ఉగ్రవాదాన్ని విఫలం చేయడం మాత్రమే భారత సమాజం ముందున్న ఏకైక మార్గం.



**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం.**

## రెక్కలు తొడిగిన బాల్యం

**అక్షరాలు వాన చినుకులై కుర్సినై**
**మట్టి పొరల్లో మొలకెత్తినై**
**ఈ పూట యెన్ని పోగుంటలుబెట్టాలో**
**పొద్దున్నే రా..**
**ఎర్ర చెలకను తడిమెుద్దాం**
**బడి దోస్తుల మట్టి బంధం**
**ఒక్కో భావం సీతాకోకలై ఎగురుతున్నె**
**యెక్కడెక్కడో తిరిగి సివరకూ బడిని చేరేవి**
**వొయ్యిల బరువు కంటే**
**ఈ చిరు గుండే మోసిన బరువే**
**అర్థం కానిది బాధ్యతేదో, బంధమేదో**
**ఇయ్యాలా.. అంగట్లో అద్దెకు దొరుకుతుంది**
**కాకుల గూట్లో కోయిల ఎందుకు జేరింది**
**కోయిల పిల్లల్నీ కాకులెందుకు పొడిచినై**
**సత్యమేదో తెల్సి సావలె**
**పాపమన్నోడు లేకపాయే**
**వాడ్ని.. కోయిల ఆవహించిందేమో**
**మధురాన్ని చెవిలో పోసాడు**
**అదిప్పుడూ.. జీర గొంతైంది**
**ఆపాత మధురం చేదైందా!**
**పొలం గట్లపై నాట్యం జేసిన నెమల్లు**
**నీళ్ల బాయిల్లో ఈత కొట్టిన చేప పిల్లలు**
**జామ మామిడి నేరడి పండ్లపై**
**మోజుబడ్డయి ఎంతైనా..**
**ఆకలిగొన్న పడుచు కొదుమలు కదా**
**వొంగి దుంకిన ఆటలో**
**తొండాట ఒక పాఠమే..**
**గుణపాఠంలో నువ్వూ నేనూ,**
**గొంతులో ఒక వెలక్కాయ**
**ఆనందాన్ని వాడెవడో**
**లాక్కుపోయిండు**
**సీక్స్ కొట్టిన బ్యాట్ అటకెక్కింది**
**అప్పుడప్పుడూ..**
**ఎర్ర చింతకాయ**
**నాలుకను ఎర్రబార్చేది**
**ఓ రోజు..**
**సూపుడేలును సేతి పంపు పచ్చడి చేసింది**
**ధరం బాయి సావుగంజి పోసేది**
**సెప్పుల్లేని లాగుల కాలం**
**గతి మతి తెలియని అదృష్ట ఘడియే**
**శూన్యంలోకి పరకాయ ప్రవేశం**
**కాలం విలువ కాట్లో గలిసింది**
**కాయితంలో ఒలికిన సిర**

తరువాయి రేపటి సంచికలో

## బాల్య వివాహాలను అరికట్టాలి



**మహేశ్వరం, నవంబర్ 10 (జనంసాక్షి) :** బాల్య వివాహాలను అరికట్టాలని మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. సోమవారం మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో శాంతిశ్రీ మాట్లాడుతూ...బాలికలకు 18 సంవత్సరాల వయస్సు,బాలురకు 21 సంవత్సరాల వయస్సు పూర్తయిన తర్వాతనే వివాహం చేసుకోవాలన్నారు. బాల్య వివాహం చేసుకోవడం వల్ల అమ్మాయిలకు ప్రసవ సమయంలో తల్లి బిడ్డలకు ప్రమాదకరంగా ఉంటుందన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేసుకోవడం వల్ల కుటుంబ వ్యవహారాలపై అవగాహన లేక కుటుంబంల్లో కలహాలు వస్తాయన్నారు. బాల్య వివాహం చట్టరీత్య నేరమన్నారు. బాల్య వివాహనికి పాల్పడితే కఠిన చర్యలు ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే 1098,100 నంబర్లకు ఫోన్ చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సువర్ణ, ఉపాధ్యాయురాలు మంగ,వివోలు సునీత,ప్రమీల,ఓబీ జ్యోతి, అంగన్వాడీ టీచర్లు అమృత,తేజ తదితరులు పాల్గొన్నారు.

# సస్పెండ్ చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- మైక్రోబాక్స్ కంపెనీలో 13 మంది తొలగింపు
- కలెక్టరేట్ ఎదుట ధర్నా, కలెక్టర్ కు వినతి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



**సంగారెడ్డి టౌన్, నవంబర్ 10 (జనం సాక్షి) :** యూనియన్ పెట్టుకున్నారనే కక్షతో కార్మికులను విధుల్లో నుంచి బిస్లరీ కంపెనీ యాజమాన్యం తొలగించిందని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ పరిశ్రమల్లో కార్మికులు చట్టబద్ధంగా యూనియన్ పెట్టుకుంటే రాజ్యాంగ బద్ధమైన హక్కును సహించకుండా పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో యూనియన్ పెట్టుకున్నారనే సాకుతో ఐదు మంది యూనియన్ నాయకులను ఉద్యోగం నుంచి తొలగించారు. అదే విధంగా కొండాపూర్ మండలంలో మైక్రోబాక్స్ అనే కంపెనీలో సీఐటీయూ యూనియన్ పెట్టకున్నారని 13 మంది కార్మికులను ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. దీనిపై లేబర్ అధికారులకు, కలెక్టర్ కు ఫిర్యాదు చేశామన్నారు. చట్టాలు అమలు చేయకపోతే చట్టాన్ని రక్షించాల్సిన యంత్రాంగం ఎందుకు మౌనంగా ఉంటుందో సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనేక కంపెనీలలో వేతనాలు ఇవ్వడం లేదన్నారు. అదే విధంగా యూబీ నైజాం బీరు కంపెనీ ఉత్పత్తి ఆపివేశారు..ఎవరి అనుమతి తీసుకుని ఉత్పత్తి ఆపివేశారని ప్రశ్నించారు. మీకు కార్మిక చట్టాలు వర్తించవా..ఉత్పత్తి ఆపివేయడం వల్ల 200 మంది కాంట్రాక్టు కార్మికుల ఉపాధి కోల్పోయారని తెలిపారు. బీరు ఇండస్ట్రీలో కోట్ల రూపాయల లాభాలు సంపాధించే మీరు కాంట్రాక్టు కార్మికులు మీకు భారమయ్యారా అంటూ ప్రశ్నించారు. ఇవాలా కాంట్రాక్టు కార్మికులు లేకుండానే ఉత్పత్తి చేశారా అన్నారు. ఆర్చ్ ఫార్మాలో అనే కంపెనీలో దాదాపు 11 నెలల నుంచి వేతనాలు యాజమాన్యం ఇవ్వడం లేదని, ఒకనెల పనిచేస్తే మరుసటి నెల వేతనం ఇవ్వాలి కదా అన్నారు. వేతనాలు ఇవ్వాలని చట్టాలు చెబుతున్నా ఇంత దారుణంగా నగ్నంగా కార్మిక చట్టాల ఉల్లంఘన ఈ సంగారెడ్డి జిల్లాలో జరిగితే ఇక్కడ ఉండే లేబర్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వేతనాలు ఇవ్వకుంటే రాష్ట్రంలో ఉన్న కమీషనర్, జేసీఎల్, డీసీఎల్ , కార్మికశాఖ మంత్రి ఏం చేస్తున్నారని మండిపడ్డారు. నరేంద్రమోడీ 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. ఇంకా అది పూర్తిగా అమలులోకి రాలేదని, ఈ చట్టాలు ఉండగానే ఇంతఘోరమైన పరిస్థితి ఉంటే రేపు ఈ చట్టాలు రద్దయిపోతే ఈ కార్మికులు బానిసలుగా మారాల్సిన పరిస్థితేనా అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధంగా యూనియన్ పెట్టుకునే హక్కును కూడా యాజమాన్యాలు సహించే పరిస్థితి లేదు. ఈ అప్రజాస్వామిక వైఖరి విడనాడాలి..తొలగించిన కార్మికులను వెంటనే బిస్లరీ యాజమాన్యం, మైక్రోబాక్స్ యాజమాన్యం వెంటనే పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లిఖార్జున్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీరం మల్లేశం, జి.సాయిలు, జిల్లా కోశాధికారి కే. రాజయ్య జిల్లా ఉపాధ్యక్షులు అతిమేల మానిక్, ప్రవీణ్ పాండురంగారెడ్డి, బాగారెడ్డి, నాగేశ్వర్ రావు, మైపాల్ యాదగిరి, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి ఎ.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# మురికి కూపంగా కుమ్మరికుంట చెరువు




**హయత్‌నగర్, నవంబర్ 10 (జనం సాక్షి) :** హయత్‌నగర్ డివిజన్ లోని కుమ్మరి కుంట పరిసర ప్రాంతాల లోని కాలనీ లలో వర్షాలు పడినప్పుడల్లా భూగర్భ డ్రైనేజ్ మాన్యువల్స్ తరచూ ధ్వంసం కావడంతో మురుగు నీరు కుమ్మరి కుంటలోకి చేరి మురికి కూపంగా తయారైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పరిసర కాలనీల్లో నివసిస్తున్న ప్రజలు తీవ్రమైన దుర్వాసన, విపరీతమైన దోమల వలన, రోగాల బారిన పడి నరకయాతన అనుభవిస్తున్నారని వారు ఆక్రోసాన్ని వెలిబుచ్చారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలని కోరుతూ, స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులతో కలిసి హయత్ నగర్ లోని జలమండలి జనరల్ మేనేజర్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అధికారులతో భేటీ అయి, గత కొంత కాలంగా నిలకడగా కొనసాగుతున్న డ్రైనేజ్ సమస్యలను వివరంగా తెలియజేస్తూ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మాన్యువల్‌లు ధ్వంసమవ్వడానికి కారణాలను గుర్తించి, శాశ్వత మరమ్మత్తులు చేయాలని వారు అన్నారు. మురుగు నీరు కుంటలోకి చేరకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు వారు సూచించారు. సంబంధిత కాలనీ లలో డ్రైనేజ్ లైన్లను పునర్నిర్మించి, అవసరమైన చోట్ల కొత్త మాన్యువల్స్‌ను ఏర్పాటు చేయాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యల పై జలమండలి అధికారులు సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ ప్రజలతో ఉంటానని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కుమ్మరి కుంట పరిసర ప్రాంతాల లోని వివిధ కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు, బిజెపి జిల్లా నాయకులు పొరంద మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎర్రవెలి సత్యనారాయణ, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం



**కేశంపేట, నవంబర్ 10 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షులు కోడూరు రాములు అన్నారు. మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామానికి పెద్ద మొత్తంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతం లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, స్థానిక కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు కోడూరు శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ తైద పర్వతాలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సింగిడి మల్లారెడ్డి, కోడూరు నర్సింలు, గోపని భీమయ్య, నాయకులు డోలు రాజు, సొంటె చెన్నయ్య, ఎదిరే మల్లేష్, ఏదిరే శ్రీశైలం, పంది రాజు, కర్రోల్ల నరసింహ, చిట్టమొని నర్సింలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఐదు లక్షల ఆర్థిక సాయం



**చేవెళ్ల, నవంబర్ 10 (జనంసాక్షి) :** చేవెళ్ల మండల పరిధిలోని మీర్జాగూడ గేటు వద్ద ఇటీవల జరిగిన బస్సు-టిప్పర్ లారీ ప్రమాదంలో మృతి చెందిన టిప్పర్ లారీ డ్రైవర్ ఆకాశ్ ధ్యానోభ కంబాలే కుటుంబానికి ప్రభుత్వం తరఫున మంజూరైన రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళతో కలిసి చెక్కును బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ...బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సంక్షేమం కోసం అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు డీసీసీ ఉపాధ్యక్షుడు బండారి ఆగిరెడ్డి, సొసైటీ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, మల్గారి జనార్ధన్ రెడ్డి, సొలిపురం బల్వంత్ రెడ్డి, మర్పల్లి కృష్ణారెడ్డి, పాండు యాదవ్, దావల్గారి గోపాల్ రెడ్డి, మధుసూదన్ గుప్తా, మద్దెల శ్రీనివాస్, పడాల ప్రభాకర్, అజీజ్, ఎర్ర గోపాల్, గుండాల రాములు, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కాలే యాదయ్య




**చేవెళ్ల, నవంబర్ 10 (జనం సాక్షి) :** చేవెళ్లలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రతి రైతు తన పంటకు తగిన మద్దతు ధర అందుకునేలా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల పట్టణకేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందన్నారు. ప్రభుత్వం ప్రతి రైతుకు గిట్టుబాటు ధర కల్పించే దిశగా కృషి చేస్తోందని తెలిపారు. క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధరను ప్రకటించిందని, చేవెళ్ల ప్రాంత రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతులు నాణ్యమైన ధాన్యం తెచ్చి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింపుల సత్యనారాయణ రెడ్డి, మల్గారి జనార్ధన్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారి ఆగిరెడ్డి, గొనె ప్రతాప్ రెడ్డి, బల్వంత్ రెడ్డి, మర్పల్లి క్రిష్టా రెడ్డి, సున్నపు వసంతం, రెడ్డిశెట్టి మధుసూదన్ గుప్తా, దావల్గారి గోపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, బేగరి రాములు, పాండు యాదవ్, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజఆగి రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు దేవర సమతావెంకట్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, గంగియాదయ్య, టేకులపల్లి శ్రీనివాస్, పడాల ప్రభాకర్, జనార్ధన్, డైరెక్టర్ లు ప్రతాప్ రెడ్డి, బండారు సువర్ణ రెడ్డి, పైండ్ల మధుసూదన్ రెడ్డి, విజయ్, అజీజ్ (లియాఖత్), ఖదీర్ హుస్సేన్, గుండాల రాములు, ఎర్ర గోపాల్, తలారం మాణిక్యం, తిరుపతి, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# సాయిబాబు కుటుంబాన్ని ఆదుకుంటాం

- ముగ్గురు పిల్లలను చదివిస్తా..
- ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, నవంబర్ 10 (జనం సాక్షి) :** ఉప్పల్ లోని ఇందిరా నగర్ కు చెందిన వెల్దండ సాయి బాబు మూడు రోజుల క్రితం గుండె పోటుతో మృతి చెందారు. సాయి బాబుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సోమవారం సాయి బాబు కుటుంబాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. చిన్న వయసులోనే సాయి బాబు మృతి చెందడం చాలా బాధాకరంగా ఉందని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి అన్నారు.సాయి బాబు కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అంద చేశారు. ముగ్గురు పిల్లలను తన సొంత ఖర్చులతో చదివిస్తానన్నారు. ఈ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ, తోకట రాజు,మద్దూరి కుమార్, గంజాయి ప్రకాష్, ఎల్డండా రాజు, డప్పు నందు, ఒక్కస్ నరేందర్, అలుగుల అనీల్ కుమార్,మండల నాగరాజు, జాజర్ల సాయికుమార్, తోకట రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మాలల రణభేరి మహాసభను జయప్రదం చేయండి

- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య



**వికారాబాద్, నవంబర్ 10 (జనంసాక్షి) :** మాలల రణభేరి మహాసభలను జయప్రదం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు లు అన్నారు. మాల మహానాడు వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ప్రేమ్ కుమార్ అధ్యక్షతన సోమవారం నాడు వికారాబాద్ అంబేద్కర్ భవన్ లో జరిగిన సమావేశంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు, నవంబర్ 23 వ తేదీన సరూర్ నగర్ స్టేడియం గ్రౌండ్ లో తలపెట్టిన మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయుటకు మాలలంతా తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ మహాసభలో మాలలకు ఎస్సీ వర్గీకరణ అనంతరం జరిగిన రోస్టర్ పాయింట్ల కేటాయింపు లో 5% కేటాయించిన గ్రూప్ 3 లోని మాలలకు 1% ఉన్న గ్రూప్ 1 లోని కులాల కంటే విద్యా, ఉద్యోగాలలో తక్కువ అవకాశాలు వస్తున్నాయని మనకు జరిగిన ఈ అన్యాయంపై ప్రశ్నించడంతో పాటు ఎస్సీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ శాతాన్ని పెంచడం ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరి చేయడంతో పాటు మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యికోట్ల నిధుల కేటాయింపు డిమాండ్, మాలల సామాజిక భవనం ఏర్పాటు తదితర డిమాండ్ల సాధనకై ప్రభుత్వాన్ని ప్రశ్నించ నున్నట్లు వారు పేర్కొన్నారు, ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బ్యాగరి ప్రేమ్ కుమార్ మాల మహానాడు జిల్లా సీనియర్ నాయకులు కడిచెర్ల రత్నం, మాట్లాడిన అనంతరం కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. మండలాల వారీగా తిరిగి మాలలను చైతన్యం చేసి అధిక సంఖ్యలో మాలల రణభేరి మహాసభకు జిల్లానుంచి తరలి వస్తామని జిల్లా నాయకులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్ , యాదయ్య, అశోక్, నర్సింహులు, ప్రశాంత్, నరేందర్, నవీన్ కుమార్, రాములు, అడ్వకేట్ లు మల్లయ్య, సంజీవ్, నాయకులు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులపై అధికారుల వేధింపులపై సమగ్ర విచారణ చేపట్టాలి




**నిజాంపేట్, నవంబర్ 10 (జనం సాక్షి) :** కుతుబుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో పని చేస్తున్న మహిళా పారిశుద్ధ్య సిబ్బందిపై అధికారుల వేదింపులపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని సిఐటియు బాచుపల్లి మండల కమిటీ కార్యదర్శి రాథోడ్ సంతోష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్యామ్ సుందర్ కి ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు బాచుపల్లి మండల కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న మహిళల పారిశుద్ధ్య సిబ్బందుల పై అధికారుల వేధింపులు జరుగుతున్నాయని ఇటీవల దిన పత్రికలలో వచ్చిన కథనాలపై పై అధికారులు విచారణ జరిపించి అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో మహిళల వేదింపులు విషయంలో ఓ అధికారిని బదిలీ చేసిన ఘటన కూడా మన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే జరిగిందని గుర్తు చేశారు. మహిళల ఉద్యోగులు కార్మికులకు భద్రత కల్పించవలసిన అధికారులే వేధింపులకు గురి చేయడం సరి కాదన్నారు. అధికారులపై అనేక ఆరోపణలు వస్తున్న విచారణ చేసి ఎందుకు చర్యలు చేపట్టట్లేదని డిమాండ్ చేశారు, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య ఉద్యోగులు, కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్టు తెలిసినప్పటికీ అధికారులు మాత్రం ఆ సమస్యల్ని పరిష్కరించట్లేదని నిర్లక్ష్యం వహిస్తున్నట్టు కనబడుతోందని తెలిపారు. వెంటనే స్పందించి ఇప్పటివరకు విచారణ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, మహిళల పారిశుద్ధ్య సిబ్బందులపై అధికారుల వేధింపు లపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు చేపట్టవలసిందిగా డిమాండ్ చేశారు, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున కార్యక్రమం తీసుకుంటామని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో సిఐటియు బాచుపల్లి మండల నాయకులు పి.స్వామి, సిఐటియు నాయకులు బాల పేరు పాల్గొన్నారు.

## ఉప్పల్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి



**ఉప్పల్, నవంబర్ 10 (జనం సాక్షి) :** ఉప్పల్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్టుగా కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ డివిజన్ న్యూ విజయపురి కాలనీ లో రూ.కోటి 83 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. న్యూ విజయపురి కాలనీలో తొందరలోనే కొత్త మంచినీటి పైపు లైన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ లోని అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మాణాలను చేస్తున్నట్టుగా ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి చెప్పారు. ఉప్పల్ డివిజన్ ను సమస్యలు లేని డివిజన్ గా, ఆదర్శ డివిజన్ గా తీర్చి దిద్దుతున్నట్టుగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఈ రాజ్ కుమార్ ,కాలనీ అధ్యక్షులు వెంకటేశ్ ,తెల్కల మోహన్ రెడ్డి ,నాగి రెడ్డి ,పబ్బు నర్సింహ,సల్ల ప్రభాకర్ రెడ్డి,వర్కాల మదన్ గౌడ్,పాపయ్య,శంకరయ్య,పూస సతీష్,భాస్కర్,దానయ్య,నర్సింహ కురుమ,వెంకటేశ్వర రావు,పద్మ సుమిత్ర సావిత్రి అండాలు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెటింగ్ గోదాం నిర్మాణం కోసం స్థల సేకరణ

- మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి



**రాయికోడు, నవంబర్ 10 (జనం సాక్షి) :** మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ శివారులో రైకోడ్ మార్కెట్ కమిటీ గోదాం నిర్మాణానికి నాలుగు ఎకరాల భూమిని కేటాయించినట్లు చైర్మన్ సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు.ఇందుకు సంబంధించిన నాలుగు ఎకరాల గోడౌన్ స్థలాన్ని సోమవారం చైర్మన్ సుధాకర్ రెడ్డికి సర్వే నిర్వహించి రెవెన్యూ అధికారులు అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇందుకు సహకరించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు రాయకోడు మునిపల్లి మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్ ఐ శ్రీకాంత్ సర్వేయర్ తో పాటు ఆత్మ కమిటీ డైరెక్టర్ ఒగ్గు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- సహకార సంఘం అధ్యక్షుడు ఆకుల పవన్



**కొండాపూర్, నవంబర్ 10 (జనం సాక్షి) :** కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం అధ్యక్షుడు ఆకుల పవన్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మల్కాపూర్ సహకార సంఘం అధ్యక్షుడు ఆకుల పవన్ వద్ద కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వయోలతో పాటు సొసైటీ డైరెక్టర్లు వీరేశం, పట్నం సురేష్, అనంతయ్య, శంకర్, శ్రీనివాస్ రెడ్డి, రాములు, మాజీ ఎంపీటీసీలు విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం సన్న వడ్లకు 500 బోనస్ ప్రకటించినందున రైతులు దళారులను నమ్మకుండా నేరుగా సొసైటీల వద్దే వడ్లు అమ్మాలని సొసైటీల వద్ద వడ్లకు సరైన తూకం మద్దతు ధర లభిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్, వయోలు, రైతులు దేవయ్య, ఎల్లయ్య,మౌలానా, యాదగిరి, మహేందర్రెడ్డి, సత్యనారాయణ, శ్రీశైలం, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 10 (జనం సాక్షి) :** కక్షిదారులు ఈ నెల 15వ న నిర్వహించే ప్రత్యేక స్పెషల్ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో కోరారు.ప్రజలు, కక్షిదారులు పూర్తిగా ఈ స్పెషల్ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్ అనేది ఇరు పక్షాల సమ్మతితో కేసులను త్వరగ, తక్కువ ఖర్చుతో పరిష్కరించే ప్రజలకు ఉపయోగకరమైన అవకాశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీ చేసుకునే అవకాశం ఉన్న కేసులు క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, వైవాహిక, కుటుంబ సమస్యలు, డ్రంకన్ డ్రైవ్, మోటార్ వాహన చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం వంటి వివిధ కేసులలో రాజీ కూర్చుకోవచ్చు అని తెలిపారు. చిన్న చిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోరాదు.రాజీ అనేది శాంతికి, పరిష్కారానికి సరైన మార్గం అని పేర్కొన్నారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ ప్రత్యేక అవకాశాన్ని ప్రతి కక్షిదారు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.జిల్లా పరిధిలోని పోలీసు అధికారులు,ఎస్ ఎచ్ ఓలు, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్‌లు సంబంధిత సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. తమ కేసులు రాజీ చేసుకోవాలనుకునే వారు సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను సంప్రదించాలని ఎస్పీ గారు సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని ఎస్పీ తెలిపారు.

## నిజాంపేటలో దొంగల హల్‌చల్

### ఇంటి తాళాలు బద్దలు కొట్టి చోరీ

- నాలుగున్నర తులాల బంగారం, 50 తులాల వెండి, రూ. లక్ష చోరీ
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**నిజాంపేట్, నవంబర్ 10 (జనం సాక్షి) :** నిజాంపేట్ లో దొంగలు హల్ చల్ చేశారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్నా బంగారు నగలు, వెండి, నగదు దోచుకెళ్ళారు. నారాయణఖేడ్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం వివరాల ప్రకారం నిజాంపేట గ్రామంలోని ఇంటి యజమాని దత్తు సమీప గ్రామమైన మునిగేపల్లికి బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఇంటికి తాళం ఉన్నది గమనించిన దొంగలు రాత్రి సమయంలో ఇల్లు తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారం, 50 తులాల వెండి, రూ. లక్ష నగదు దోచుకెళ్లినట్లు తెలిపారు. యజమాని ఫిర్యాదుతో సబ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి, సంగారెడ్డి నుంచి క్లూస్ టీం రప్పించి ఫింగర్ ప్రింట్స్ ఇతర ఆధారం సేకరించారు. చుట్టుపక్కల సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగలను పట్టుకునే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ మెదక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

# వర్షాలకు దెబ్బతిన్న రోడ్ పనులు వేగవంతంగా చేపట్టాలి

- ఎన్నికల విధులు నిర్లక్ష్యం చేయొద్దు
- జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష

**సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 10 (జనం సాక్షి) :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ పనులును వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లాలో వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు ... ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో దెబ్బతిన్న ఆర్ అండ్ బి పరిధిలోని రోడ్లు, పంచాయతీ రాజ్ రోడ్ల పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. టెండర్లు పూర్తయిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల విధుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించోదన్నారు.




ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల విధులు నిర్వహించాలని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. పటాన్చెరువు నియోజకవర్గ పరిధిలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు బిఎల్ఓ లను బిఎల్ఓ సూపర్వైజర్లను సరిగా మానిటర్ చేయకపోవడం వల్ల అనుకున్న లక్ష్యాలను సకాలంలో చేరుకోవడం లేదని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం ఇస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఇంకా కొంతమంది బిఎల్వోలు తమ ఆన్లైన్ ఆప్ లో ఇప్పటికీ లాగిన్ కాలేదని అలాంటి సమస్యలు ఇకముందు పునరావృతం కావద్దని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని మున్సిపాలిటీలలో టిఎస్‌బి పాస్ కింద వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తాహసిల్దార్ల నుండి మున్సిపల్ కమిషనర్ల నుండి కలెక్టరేట్ కు వచ్చే ఫైళ్ళలో పూర్తి సమాచారంతో పంపాలనిఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ పద్మజ రాణి, సంబంధిత జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు,మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అందెశ్రీ మరణం సాహిత్య రంగానికి తీరని లోటు

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్
- చేర్యాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ పందిల్ల నర్సయ్య

**చేర్యాల, నవంబర్ 10 (జనంసాక్షి) :** ప్రముఖ రచయిత, తెలంగాణ గాయకుడు అందెశ్రీ (64) ఆకస్మిక మరణం సాహిత్య రంగానికి, చేర్యాల ప్రాంతానికి తీరని లోటని, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, చేర్యాల ప్రాంత పరిరక్షణ కమిటీ కన్వీనర్ పందిల్ల నర్సయ్య అన్నారు. ఆయన మృతి పట్ల సోమవారం చేర్యాల మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరు పేద కుటుంబంలో జన్మించిన అందెశ్రీ అంచలంచెలుగా ఎదుగుతూ డాక్టరేట్ లతోపాటు అనేక గౌరవ పురస్కారాలు అందుకుని, అనేక అభ్యుదయ గీతాలు రచించారని, ఈ కాలపు వాగ్గేయకారులలో అందెశ్రీ ఒకరని, వారి మరణం సాహిత్య రంగానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతమైన జయ జయహే తెలంగాణ జననీజయ కేతనం, మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు అనే గేయాలతో తెలంగాణ ప్రజలను చైతన్యం చేసి ప్రపంచానికి



వన్నె తెచ్చిన మహాకవి అందెశ్రీ అని ఆయన సేవలను కొనియాడారు. అయన చేర్యాల ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టకరమన్నారు. అందెశ్రీ చిరకాల కోరికైన చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా సాధించాలని అనేకసార్లు ప్రజాసంఘాల నాయకులతో చర్చించే వారని గుర్తు చేశారు. ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, జర్నలిస్టులు చింతల విజయ్ కుమార్, తౌట పశుపత్, పెంద్యాల రాజు, కత్తుల భాస్కర్ రెడ్డి, పొన్నబోయిన మహేందర్, నీరటి చందు, సుంకరి శ్రీనివాస్, ఎబ్నేజర్, పీ. నరహరి, ఇప్పకాయల నందిని, రాజూనందన్ తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి డిపో నుండి గచ్చిబౌలికి నూతన సర్వీసు ప్రారంభం

**కల్వకుర్తి, నవంబర్ 10 (జనం సాక్షి) :** కల్వకుర్తి డిపో నుండి తేదీ 12 11 2025 బుధవారం నాడు మధ్యాహ్నము మూడు గంటలకు హైదరాబాదులోని గచ్చిబౌలి కి బస్సు సర్వీసు ప్రారంభము జరుగుతున్నది అని కల్వకుర్తి మరియు పరిసర ప్రాంతంలోని సాఫ్ట్వేర్ ఉద్యోగులకు ఈ బస్సు సౌకర్యం ఎంతో ఉపయోగపడుతుందని తెలంగాణ మానవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు గోవిందు శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ బస్సు కల్వకుర్తి నుండి మధ్యాహ్నం మూడు గంటలకు బయలుదేరి గచ్చిబౌలి కి వెళ్లి తిరిగి సాయంత్రం 6 గంటలకు గచ్చిబౌలి నుండి తిరుగు ప్రయాణం చేసి వయా కల్వకుర్తి మీదుగా అచ్చంపేటకు వెళుతుంది అని అన్నారు. తిరిగి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు బయలుదేరి వయా వయా కల్వకుర్తి నుండిఉదయం 7 గంటల 30 నిమిషాలకు చేరుకొని గచ్చిబౌలికి బయలుదేరుతుందని తిరిగి 10,30 కల్వకుర్తికి చేరుకుంటుందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి డిపో మేనేజర్ మేనేజర్కి, ఆర్ఎంకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇట్టి అవకాశాన్ని సాఫ్ట్వేర్ ఉద్యోగస్తులు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

## అనుమానాస్పదంగా యువకుడు మృతి



**తూప్రాన్, నవంబర్ 10 (జనం సాక్షి) :** మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి లోని కల్లు కాంపౌండ్ సమీపంలో అనుమానాస్పదంగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఉడిపి ప్రాంతానికి చెందిన రామ్ చరణ్ అనే వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్ కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన వ్యక్తి ఉడిపి ప్రాంతానికి చెందిన రామ్‌చరణ్‌గా గ్రామస్తులు గుర్తించారు. గత కొద్ది రోజులుగా మనోహర్ గ్రామంలో కల్లు దుకాణంలో కల్లు తాగి స్పృహ పడిపోయి వచ్చి పడిపోతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడంలేదన గతంలో ఫిర్యాదు చేసిన ఇలాంటి స్పందన లేదని గ్రామస్తుల ఆరోపించారు. కల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## రుచి కోసం కాదు ఆరోగ్యం కోసం ఆహారం తీసుకోవాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**చిలప్‌చేడ్, నవంబర్ 10 (జనంసాక్షి) :** నర్సాపూర్ ప్రాజెక్టు పరిధిలోని చిలప్ చేడ్ మండలం కేంద్రమైన హైస్కూల్ ప్రాంగణంలో పోషణమాసఉత్సవం అలాగే బాల వివాహ నిషేధ చట్టం అవగాహన కార్యక్రమం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరై ప్రతి వ్యక్తి రుచి కోసం కాదు ఆరోగ్యం కోసం అన్ని రకాల ఆహార పదార్థాలు తినాలని ముఖ్యంగా స్థానికంగా దొరికే ఆపకూరలని తిని ఆరోగ్యంగా ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు మరియు ప్రతి ఆడపిల్లను చదివించి ఉన్నత స్థాయికి ఎదిగేలా చూడాలని మరియు చదువులు చదివించి వారికి ఉద్యోగాలు వచ్చిన తర్వాత పెళ్లిళ్లు చేస్తే రాబోయే కాలంలో మంచి ఆరోగ్యవంతమైన సమాజానికి తయారు చేసుకోవచ్చు తయారు చేసుకోవచ్చు.ఈసందర్భంగా ఇక్కడ ఏర్పాటుచేసిన న్యూట్రిషన్ స్టాల్సిన అన్నింటిని చూసి అభినందించారు అనంతరం పోషణ అభియాన్ కార్యక్రమంలో ఉత్తమ,అంగన్వాడి టీచర్లకు ఆశా, ఏపీఎం,సిఎ,సీసీ పంచాయతీ కార్యదర్శికి, ఎఎన్ఎం మెడికల్ ఆఫీసర్, హెల్త్ సూపర్వైజర్, పారిశుద్ధ్య కార్మికులకు, ప్రశంస పత్రాలను అందించారు ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా డి డబ్ల్యూ హేమ భార్గవి మాట్లాడుతూ బాల్యవివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని దీనికోసం ప్రతి ఒక్కరి సహాయం సహకారం కచ్చితంగా ఉండాలని కోరారు. అనంతరము గర్భిణీలకు సామూహిక శ్రీమంతాల కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి చిలప్ చేడ్ మండల ఐసీడీఎస్ సూపర్వేజర్ సంతోషిమాత ఎమ్మార్వో ఎంపీడీవో ప్రవీణ్ ఏపిఎం వైద్యాధికారి ఎస్సై నర్సింలు ఎన్జిఓ సునీత పంచాయతీ కార్యదర్శులు సీఏ లు సీసీలు ఆశాలు అంగన్వాడి టీచర్లు ఐసీపీఎస్ సిబ్బంది సిబ్బంది, షి టీమ్, సఖి టీం గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఎంపీడీవో



**నిజాంపేట్, నవంబర్ 10 (జనం సాక్షి) :** నిజాంపేట్ మండల కేంద్రంలోని వివిధ గ్రామ పంచాయతీలలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఎంపీడీవో సంగ్రామ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... బాచేపలి, రామ్ రెడ్డి పేట్, మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని బేస్మెంట్ స్లాబ్ లెవెల్ ఇళ్లను పరిశీలించడం జరిగిందన్నారు. అలాగే గ్రామాలలోని మురికి కాలువలు, శానిటేషన్, పంచాయతీలో రిజిస్టర్లను పరిశీలించారు. ఎంపీడీవో వెంట బాచేపల్లి పంచాయతీ సెక్రెటరీ రమేష్ ,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్ష పరిశీలనతో రైతుల్లో శాస్త్రీయ చైతన్యం



**మొగుడంపల్లి, నవంబర్ 10 (జనం సాక్షి) :** మొగుడంపల్లి మండల పరిధిలోని గోడిగార్పల్లి, గ్రామంలో మల్లారెడ్డి విస్వవిద్యాలయ విద్యార్థుల విజ్ఞాన కార్యక్రమం నిర్వహించారు.డెవలప్మెంట్ సైన్స్ కేమికల్ సబ్జెక్టలతో భూసార పరిశీలన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు గోడిగార్పల్లి గ్రామంలోని రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులకు భూసార పరీక్షల శాస్త్రీయ ప్రాముఖ్యతను వివరించారు.వారు భూమిలోని సేంద్రియ పదార్థాల స్థాయిలు, పీహెచ్ విలువలు, నత్రజని మరియు ఇతర పోషకాలు ఎలా పంటల దిగుబడిపై ప్రభావం చూపుతాయో వివరించారు. రైతులు డబ్ల్యూ ఆకారంలో మట్టిని సేకరించి, “వి ” ఆకారంలో మట్టి నమూనాలను సేకరింలని కోరారు. భూమి ఆరోగ్యాన్ని తెలుసుకోవడానికి భూసార పరీక్ష కీలకమని తెలియజేశారు.విద్యార్థులు భూమిలోని పోషకాలు, పిఏహెచ్ స్థాయి, ఉప్పుదనం వంటి అంశాలపై నమూనాలు సేకరించారు. సేకరించిన నమూనాలను విశ్లేషణ చేసి రైతులకు నివేదికలు అందజేయనున్నారు.ఈ కార్యక్రమంలో డీడీఎస్ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్లు, మల్లారెడ్డి విశ్వవిద్యాలయ బృందం, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ఆస్పత్రి కోసం నేడు పేటలో బీజేపీ అర్ధనగ్న ప్రదర్శన

- జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్

**నారాయణపేట, నవంబర్ 10 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రజలకు కనీస వైద్యం అందించేందుకు ఆస్పత్రి ఏర్పాటు చేయక పోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 11న పట్టణంలో బిజెపి ఆధ్వర్యంలో అర్ధనగ్న నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్ తెలిపారు.సోమవారం ఆయన జిల్లా బిజెపి లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ,పట్టణ బిజెపి మాజీ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 70 వేల జనాభా ఉన్నా పట్టణంలో ఉన్న ఆస్పత్రిని 12 కిలో మీటర్ల దూరంలో ఉన్న మెడికల్ కాలేజీ కి తరలించారని అన్నారు.ఆస్పత్రిని తరలించి 6 నెలలు గడిచిందని అప్పటి నుంచి పట్టణ ప్రజలతో పాటు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు కనీస వైద్యానికి నోచుకోక ఇప్పటి వరకు తమ దృష్టికి వచ్చిన 20 మంది సకాలంలో వైద్యం అందక మరణించారని తెలిపారు. ఆస్పత్రిని తరలించినప్పటి నుంచి బిజెపి అనేక ఉద్యమాలు చేపట్టిందని అయినా కాంగ్రెస్ ప్రభుత్వంలో స్పందన లేదని అన్నారు.బిజెపి ఉద్యమం చేసినప్పుడు మాజీ డిసిసి అధ్యక్షుడు ప్రెస్ మీట్ పెట్టి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో 8 కోట్లతో ఏరియా ఆస్పత్రి నిర్మిస్తామని అంతేకాకుండా ఎమ్మెల్యే చొరవతో మరో కోటి పెంచి నిర్మిస్తామని ప్రకటించారని ఇప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదని అన్నారు.ఇప్పటికే 20 మంది చనిపోయారని అక్కడ చ చ్చిన వాటిని మాత్రం పోస్టు మార్టం కోసం పాత ఆస్పత్రికి తీసుకు వస్తున్నారని అన్నారు.ఇంకెంత మంది చనిపోతే ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు.తక్షణమే ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఇది వరకు పాత బస్టాండ్ లో ఉన్న చిన్న పిల్లల ఆస్పత్రిలో వెంటనే ఏరియా ఆస్పత్రిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ప్రజల వెంబడి బిజెపి ఎప్పుడూ ఉంటుందని స్పష్టం




చేశారు.మంగళవారం ఆస్పత్రి ఏర్పాటు కోసం బిజెపి నిర్వంచే అర్ధనగ్న నిరసన ప్రదర్శన లో బిజెపి కార్యకర్తలు,ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# సోయా పంట కొనుగోలులో వేలు ముద్ర ఎందుకు?

- ఆ నిబంధనతో రైతులు నష్టపోతున్నారు
- మాజీ మంత్రి జోగు రామన్న




**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** సోయా పంట కొనుగోలులో వేలు ముద్ర ఎందుకని వెంటనే ఆ నిబంధనను తొలగించాలని బీ ఆర్ ఎస్ మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డులో సోయా పంట కొనుగోలులో రైతులకు వేలు ముద్ర నిబంధన పెట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దానికి బదులుగు ఓటీపి విధానం అమలు చేస్తే మేలు జరుగుతుందని తెలిపారు. రైతులకు అండగా ఉండాల్సిన ఎంపీ ఎమ్మెల్యేలు రైతులపై దృష్టి సారించకుండా రాజకీయ స్వలాభం కోసం దృష్టి పెట్టడం సిగ్గుచేటు అన్నారు. రైతులపై కనీస చిత్తశుద్ధి లేని ఆదిలాబాద్ ఎంపీ, ఎమ్మెల్యేలు అనవసర రాద్ధాంతం చేస్తూ అన్నదాతలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు తేమ శాతం నిబంధనలతో రైతులు ఓ వైపు అల్లాడుతుంటే.. ఎంపీ, ఎమ్మెల్యే ఏమీ పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో నీళ్లతో ఉన్న సోయాను సైతం కొనుగోలు చేశామని, సోయా పంటకు తేమ నిబంధననే ఉండేదికాదని. ఓటిపి విధానం ద్వారా ప్రతి రైతుల నుంచి సోయా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు వారి పక్షాన ఉండి బి ఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అజయ్, ఇజ్జగిరి నారాయణ,గంద్రత్ రమేష్,చెందాల రాజన్న, అప్కామ్ గంగయ్య, స్వరూప రాణి, ధమ్మా పాల్, వాగ్మారె ప్రశాంత్,దయానంద్ కలిమ్,తదితరులు పాల్గొన్నారు.



# బడితే పూజకు భయపడ్డ బడి పంతులు

- పాఠశాలకు దుమ్మా కొట్టాడని ఆరోపణలు

**బెల్లంపల్లి, నవంబర్ 10 (జనంసాక్షి) :** బడితే పూజకు భయపడ్డ బడి పంతులు బడికి దుమ్మా కొట్టాడని గుండ్ల సోమారం ప్రజలు భావిస్తున్నారు. గుండ్ల సోమారం ఉపాధ్యాయుడు ఖాదర్ బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న విషయం ఒక దినపత్రికలో ప్రచురితం కావడంతో విచారణకు బయపడి సదరు బడి పంతులు బడికి దుమ్మా కొట్టాడు. యవ్వారం ముదిరిందని సెలవులో వెళ్ళిపోయాడు. గుండ్ల సోమారం హై స్కూల్లోని బాలికలను ఉపాధ్యాయుడు ఖాదర్ కొంతకాలంగా అసభ్యంగా తాకుతూ, వికృత చేష్టలకు పాల్పడుతున్నాడని తెలిసింది. ఈవిషయాన్ని పెద్దసార్ బానేష్ కు చెప్పినా పట్టించుకోకుండా తోటి ఉపాధ్యాయునికి వత్తాసు పలికి అదేం లేదు అన్నట్టుగా వ్యవహరించాడు. కాగా విషయం పత్రికల్లో రావడంతో స్పందించిన ఉన్నతాధికారులు విచారణ కోసం జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పద్మశ్రీ, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్ వైజర్ సౌజన్య, ప్రొటెక్షన్ అధికారి సత్తయ్యను నియమించగా వారు విచారణ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దినపత్రికలో వచ్చిన కథనం చూసి పాఠశాలకు వచ్చినట్లు చెప్పారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులను విచారించామని చెప్పారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని, తప్పు చేసిన వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థినులను ఇబ్బందులు గురిచేస్తే చర్యలు తప్పవని ఖచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యా యున్ని గ్రామస్థులు నిలదీశారు. విద్యార్థినుల ఆవేధనను చెప్పినప్పుడు తల్లిదండ్రులకు ఎందుకు చెప్పలేదని, తప్పు చేసిన ఖాదర్ కు సహకరిస్తున్నారా అని మండిపడ్డారు. విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని, విద్యార్థుల భవిష్యత్తుపై నిర్లక్ష్యం ఎందుకు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు ఖాదర్, ప్రధానోపాధ్యాయుడు బానేశ్ ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దినపత్రికలో కథనం వచ్చేదాకా గ్రామస్థులకు తెలియదని, పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా మీకు బాధ్యత లేదా అని నిలదీశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉపేక్షించొద్దని గ్రామస్థులు విచారణ అధికారులను కోరారు.

# చెలరేగుతున్న ఇసుక మాఫియా

- పోలీసుల పై దాడి.. నిందితుల అరెస్టు

**మల్హార్, నవంబర్ 10 (జనంసాక్షి) :** మండలంలోని మల్లంపల్లి గ్రామ శివారులో అక్రమ ఇసుక మాఫియా చెలరేగిపోతున్నారు. ఆదివారం కొయ్యూరు పోలీసులు మల్లంపల్లి గ్రామానికి పెట్రోలింగ్ లో బాగంగా వెళ్తుండగా నాలుగు ట్రాక్టర్లు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిని పట్టుకోగా నిందితులు పోలిసులపై దాడి చేసి పారిపోతుండగ పోలీసులు వెంబడించి ముగ్గురు నిందితులను పట్టుకొన్నారు.హెడ్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొయ్యూరు ఎస్ఐ వడ్లకొండ నరేష్ కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను రిమాండ్ కు తరలించారు. నేరాలకు పాల్పడుతూ పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన నిందితులకు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కొయ్యురు ఎస్ఐ నరేష్ తెలిపారు.

# ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించండి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్..



**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 10 (జనంసాక్షి) :** హనుమకొండ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిలకు అర్జీలను అందజేశారు. ప్రజలు వినతి పత్రాలను అందజేస్తూ సమస్యలను కలెక్టర్ కు తెలియజేయగా ఓపిగ్గా విన్నారు. వెంటనే సంబంధిత అధికారులను ప్రజలు అందించిన వినతులపై పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలు పెండింగ్ లో లేకుండా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, హౌసింగ్, ఇతర శాఖలకు సంబంధించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు 158 అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, డి ఆర్ డి ఓ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, సిపిఓ సత్యనారాయణరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

- డివైఎఫ్ఐ నాయకుల ధర్నా..




**హనుమకొండ ప్రతినిధి, నవంబర్ 10 (జనంసాక్షి) :** నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఇస్తామన్నా రెండు కోట్ల ఉద్యోగాలను ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు.సోమవారం హనుమకొండ జిల్లా గ్రంథాలయం వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.దేశంలో బీజేపీ, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలు యువతకు ఇచ్చిన హామీలు కేవలం ఓట్లు దక్కించుకునే ఎత్తుగడలేనని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికిన బిజెపి ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పుతుందని, ఉద్యోగాలు లేకుండా చేస్తుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఏటా లక్ష ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ల తోనే ఉద్యోగాలను భర్తీ చేసి చేతులు దులుపుకుందని, ఉద్యోగాలు ఇచ్చేంతవరకు నిరుద్యోగ భృతి నెలకు ?4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేసిందని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా యువతకు ఎటువంటి ఉపశమనం కలగలేదని, నియామక ప్రక్రియలు నత్తనడకన సాగుతున్నాయని, నిరుద్యోగులు నిరీక్షణతో విసిగి పోతున్నారని, ఇటీవల ప్రవేశపెట్టిన 'రాజీవ్ యువ వికాసం' పథకం కూడా మరో నిరాశగా మిగిలిందని అన్నారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, నాయకులు భోగి నరేష్, కేయూ రీసర్చ్ స్కాలర్స్ కేతపాక ప్రసాద్, జనగాం రాజారాం, నాయకులు దూడపాక అశోక్,యం.చంద్ర, నిరుద్యోగ సంఘ నాయకులు శ్యామ్, ప్రభాకర్, కామేష్, ప్రశాంత్, రమేష్ నవీన్, తిరుపతి, నరేష్, రాకేష్, వంశి, అనిల్, అఫ్జల్, రాజు, అనిత, స్వప్న, స్రవంతి, శ్వేత సంధ్య పాల్గొన్నారు.

# సమగ్ర అవగాహన ఉంటేనే పరిష్కారం సులభం

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గ్రామ స్థాయి పరిపాలనా విధానాలు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం భూపాలపల్లి ఐడిఓసి కార్యాలయంలో సివిల్ సర్వీసెస్ ట్రైనింగ్ అధికారులు, విద్యా, వైద్య, వ్యవసాయ, మహిళా, శిశు సంక్షేమ, వయోవృద్ధుల సంక్షేమ, డిఆర్డీఓ, ప్రణాళిక శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ శిక్షణా అధికారులకు గ్రామీణ ప్రాంతాల వాస్తవ పరిస్థితులపై ప్రత్యక్ష అనుభవం అవసరమని, అందుకోసం ఫీల్డ్ లెవల్ ఫంక్షనరీలతో సమన్వయం, గ్రామాలలోని ప్రజలతో నేరుగా ఇంటరాక్షన్ జరగాలని సూచించారు. సేవలు, సంక్షేమ పథకాల అమలు, సమస్యల గుర్తింపు, తక్షణ పరిష్కారంపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. పలిమెల, మహాముత్తారం మండలాల్లో అధికారులతో కలిసి ప్రాంతాలను సందర్శించి మహిళా సంఘాలు, రైతులు, యువతతో ఇంటరాక్షన్ కావాలని సూచించారు. పలిమెల, మహాముత్తారం మండలాలను నీతి ఆయోగ్ యాస్పిరేషన్ బ్లాకులుగా ప్రకటించిందని, ఐదు సెక్టారులకు సంబంధించి 49 ఇండికేటర్లు, 81 పారామీటర్లు నిర్దేశించినట్లు తెలిపారు. జిల్లాలో 76 శాతం అడవులు విస్తరించి ఉన్నాయని వివరించారు. 12 మంది అధికారులు రెండు బృందాలుగా పలిమెల, మహాముత్తారం మండలంలో పర్యటన చేయనున్నారని, ఈ పర్యటనకు సంబంధించి నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, సమస్యలు, అవసరాలను తెలుసుకుని ఆచరణలోకి తీసుకువెళ్లే విధంగా యంత్రాంగానికి సూచనలు చేయాలని తెలిపారు. అధికారుల పర్యటనకు స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్వీసెస్ అధికారులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వైద్యాధికారి డా మధుసూదన్, డీఈఓ రాజేందర్, వ్యవసాయ అధికారి బాబురావు, డిఆర్డీఓ బాలకృష్ణ, సీపీఓ బాబురావు, సంక్షేమ అధికారి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 10 (జనంసాక్షి) :** 2025-26 సంవత్సరానికి గాను వరి ధాన్యం కొనుగోలు కొరకు జిల్లాలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇందులో భాగంగా రైతుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో రైతు సంక్షేమం కోసం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా రైతుల సౌకర్యం కొరకు కంట్రోల్ రూమ్ నం.6303928682 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో 1967, 1800 4250 0333 నెంబర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులకు అవసరమైన కొనుగోలు కేంద్రాల సమాచారం అందించడంతో పాటు, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు ఇతర అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, నవంబర్10 (జనంసాక్షి) :** ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం త్వరితగతిన చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ సోమవారం ప్రజావాణికి వచ్చే అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమీక్షించి, సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగాలని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు ఫీల్డ్ విజిట్లు నిరంతరం నిర్వహిస్తూ, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల ఫేషియల్ రికగ్నిషన్ హాజరు వ్యవస్థ పై పర్యవేక్షణ కఠినంగా ఉండాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు ను నిరంతరం పర్యేక్షించాలని ఆదేశించారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనకు సంబంధించి జిల్లాలో చేపట్టనున్న అవగాహన కార్యక్రమాల గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. బాల్యవివాహాల నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు విస్తృత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పి సీఈవో గోవింద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హనుమకొండలో ఆర్మీ రిక్రూట్మెంట్ మెంట్ ర్యాలీ ప్రారంభం

- జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 10 (జనం సాక్షి) :** హనుమకొండ డీడీజీ , జోనల్ రిక్రూటింగ్ ఆఫీస్, చెన్నై మరియు డైరెక్టర్ రిక్రూటింగ్, ఏఆర్ఓ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సోమవారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రారంభమైంది.జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సైన్యాధికారుల సమక్షంలో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం ఆదిలాబాద్ మరియు వనపర్తి జిల్లాల అభ్యర్థులకు రన్నింగ్ పోటీలు నిర్వహించారు.ఈ రెండు జిల్లాల నుండి 794 మంది వ్రాత పరీక్షలో అర్హత సాధించగా, 624 మంది హాజరై హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ఫిజికల్ ఫిట్నెస్ మరియు ఇతర పరీక్షల్లో పాల్గొన్నారు.సైన్యాధికారుల ప్రకారం, తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల అభ్యర్థులు ఇప్పటికే వ్రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, నవంబర్ 10 నుండి 22 వరకు ఫిజికల్, ఫిట్నెస్ మరియు మెడికల్ పరీక్షలను హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ఎదుర్కోనున్నారు.ఈ కార్యక్రమానికి సైన్యాధికారులు, జిల్లా యువజన క్రీడా అధికారి అశోక్ కుమార్ గుగులోతు తదితరులు పాల్గొన్నారు ప్రతి రోజు రన్నింగ్, ఫిజికల్ ఫిట్నెస్, మెడికల్ టెస్టులు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం నిర్వహించబడతాయని ఆర్మీ అధికారులు తెలిపారు.

# పదేళ్లు గడిచినా పరిష్కారం చూపట్లే

- భూ బాధితుడు దిడ్డి రాజయ్య



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పదేళ్లు గడిచినా అధికారులు పరిష్కారం చూపట్లేదని భూ బాధితుడు దిడ్డి రాజయ్య ఆరోపించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో ఫిర్యాదు చేసిన అనంతరం బాధితుడు రాజయ్య స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు శివారు కేటీపీపీ పరిధిలోకి 15మంది రైతులకు చెందిన 38ఎకరాల భూమి పోయిందని, పరిహారం కోసం గత పదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. తహశీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్, సిఎండి లను పలుమార్లు సంప్రదించి తమ సమస్యను తెలియజేసినప్పటికి దాటవేస్తూ వస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిహారం అందేలా కృషి చేయాలని, తమకు న్యాయం చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

# ఎన్టీపీసీలో కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

- హెచ్ఎమ్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



**మంచిర్యాల ప్రతినిధి (జనంసాక్షి) :** సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు ఆలస్యంగా చెల్లించడం పట్ల హెచ్ఎమ్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతి నెల 7వ తేదీలోపు కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్ ఆదేశాలతో సర్కులర్ జారీ అయినప్పటికీ, సంబంధిత అధికారులు దానిని తుంగలో తొక్కుతున్నారని ఆయన విమర్శించారు. కాంట్రాక్ట్ ఇచ్చి, వారు సబ్ కాంట్రాక్టర్ల ద్వారా కమిషన్ల కోసమే వేతనాలు ఆలస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, కార్మికుల కష్టార్జిత వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం చూపిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు రోజువారీ కష్టపడి పనిచేస్తున్నారు. వారిని ఇబ్బందులకు గురి చేయడం అన్యాయం. యాజమాన్యం వెంటనే స్పందించి, వేతనాల చెల్లింపులో పారదర్శకత పాటించాలి" అని అన్నారు. ఈ సందర్భంగా కార్మికులు నిరసనలో పాల్గొని తమ వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.



# వరద రక్షణ కిట్లు అందజేత

**నిర్మల్ రూరల్, నవంబర్10 (జనం సాక్షి) :** భారీ వర్షాలు, వరదలు సంభవించినప్పుడు ఉపయోగపడే రక్షణ కిట్లను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి,జెడ్పి సీఈవో గోవింద్,మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
11 నవంబర్ 2025

# సీపీఐ శతవసంతాల ముగింపు సభను జయప్రదం చేద్దాం

- ఖమ్మం కేంద్రంగా జరిగే బహిరంగ సభకు భారీగా తరలిరావాలి
- 40 దేశాల నుండి రానున్న ప్రతినిధులు
- 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ

**భద్రాచలం, నవంబర్ 10 (జనంసాక్షి) :** పీడిత తాడిత ప్రజల జీవితాలకు భరోసా కల్పించేందుకు దేశ స్వతంత్రానికంటే ముందే ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంత ముగింపు సభ ఖమ్మం కేంద్రంగా జరగనుందని ఈ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ అన్నారు. శత వసంత ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక డివిజన్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత గడ్డపై కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి ఈ డిసెంబర్ 26వ తేదీ నాటికి వందేళ్లు పూర్తి అవుతుందని, భారత



స్వతంత్ర సంగ్రామంలో బానిస సంకెళ్ళ నుండి భరత మాత విముక్తి కోసం కమ్యూనిస్టు కార్యకర్తలు అలుపెరగని పోరాటాలు చేశారని అన్నారు. భగత్ సింగ్ లాంటి యువ కిషోరాలు నమ్మిన సిద్ధాంతం కోసం ఉరి కొయ్యలను ముద్దాడారని గుర్తు చేశారు. ఆనాటి నుండి నేటి వరకు పీడిత ప్రజల పక్షాన నిలబడింది ఎర్రజెండా నేనని, ఎర్రజెండాల పని అయిపోయిందని అవహేళన చేసిన వారికి ఈ శతవసంత ఉత్సవాల బహిరంగ సభ ఒక గుణపాఠం కావాలని చెప్పారు. 40 దేశాల నుండి కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు, మేధావులు కవులు కళాకారులు ఉత్సవ ముగింపు సభకు తరలివస్తున్నారని, ఈ బహిరంగ సభను మరింత ఎరుపెక్కించేందుకు తమ తమ ప్రాంతాల నుండి కమ్యూనిస్టు పార్టీ నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. 5 లక్షల మందితో ఖమ్మం కేంద్రంగా జరిగే ఉత్సవాల ముగింపు సభ దేశానికే గర్వకారణం కానుందని, ఎర్ర జెండా నీడలో ఆమరులైన ప్రతి ఒక్కరికి ఈ శతవసంత ఉత్సవం అంకితం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వాతాడి దుర్గారావు, పట్టణ కన్వీనర్ మా రెడ్డి శివాజీ, ఏఐటీయుసి పట్టణ కార్యదర్శి కంభం మెట్టు శ్రీనివాస్, నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, ఎస్ వి ఎస్ నాయుడు, సత్యానంద్, గుంజి రామారావు, శోభన్, సీతారామ రాజు, సాయిరాం, సూరిబాబు, సతీష్ రామ శంకర్, ఉమాదేవి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## రైఫిల్ షూటింగ్‌లో జిల్లా జట్టుకు ఎంపికైన కేంద్రీయ పాఠశాల విద్యార్థినులు




**మిర్యాలగూడ, నవంబర్ 10 (జనం సాక్షి) :** మిర్యాలగూడ కేంద్రీయ విద్యాలయం కు చెందిన పలువురు విద్యార్థులు రైఫిల్ షూటింగ్ లో జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కర్ర నాని ప్రసాద్ సోమవారం తెలిపారు. అండర్ 14 విభాగంలో బి రిషిక, డి కృతిక, జి సిరి చందన, టి శ్రీలాస్య లు, అండర్ 17 విభాగంలో ఆర్ శివప్రియ, వి కీర్తన, ఏ శ్రీతృదిక, వి మనోజ్ఞ, డి నేత్ర, ఎం నిఖిల లు ఎంపికయ్యారు. వీరు రాష్ట్రస్థాయిలో జరిగే రైఫిల్ షూటింగ్ పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఎంఈఓ లావూరి బాలు నాయక్ తో కలిసి ప్రిన్సిపాల్ విద్యార్థినులను, పిడి వెంకటరత్నం, పి ఈ టి సతీష్ లను ప్రత్యేకంగా అభినందించారు. ముందు ముందు మరింత ప్రతిభ చూపి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## కుక్క నోట్లో మృత శిశువుతో చక్కర్లు

- మిర్యాలగూడ లో కలకలం



**మిర్యాలగూడ, నవంబర్ 10 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మిర్యాలగూడలో అవమానియ ఘటన చోటుచేసుకుంది.నెలలు నిండని శిశువు మృతదేహం కుక్కనోట్లో కనపడి కలకలం రేపింది. పట్టణంలోని విద్యానగర్ కు వెళ్లే సబ్ జైల్ రోడ్ లో కుక్క శిశువు మృతదేహాన్ని నోట కరుచుకొని వెళ్తుండడంతో స్థానికులు గుర్తించి వెంటనే వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.శిశువు మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికితరలించారు.ఆడ శిశువు కావడంతోనే అబార్షన్ చేసి ఉంటారని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలి

- పరిమితికి మించి ప్రయాణికుల రవాణా ప్రమాదం..
- గూడ్స్ వాహనాల్లో ప్రజా రవాణా చేయవద్దు
- ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కవద్దు
- ఎస్పీ కె.నరసింహ

**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 10 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని, రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణే లక్ష్యమని జిల్లా ఎస్పీ కె.నరసింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీసులు ఆధ్వర్యంలో నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహించి రోడ్డు భద్రత, నియమ నిబంధనలు, ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.ప్రజలను, కూలీలను, చిన్న పిల్లలను గూడ్స్ వాహనాలలో రవాణా చేసినా, పరిమితికి మించి ప్యాసింజర్ వాహనాలలో రవాణా చేసిన అలాంటి వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు.జిల్లాలో పరిమితికి మించి, గూడ్స్ వాహనాల్లో కూలీలను, ప్రజలను తరలిస్తున్న వాహనాలను గత వారం రోజులుగా 70 గుర్తించి జరిమానా, కేసులు



విధించడం జరిగిందన్నారు.పలుమార్లు ఇదే విధమైన కేసులు నమోదైతే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించి ప్రజలు తమ ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణించాలని తెలిపారు. రవాణా చట్ట ప్రకారం గూడ్స్ వాహనాలు కేవలం సరుకుల రవాణా కోసమే ఉపయోగించాలని,వాటిలో వ్యక్తులను, కూలీలను, చిన్నపిల్లలను రవాణా చేయడం నేరమని తెలిపారు.గూడ్స్ వాహనాల్లో ప్రయాణించడం వల్ల తీవ్ర ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువ ఉంటాయని తెలిపారు.వాహనదారులు, ప్రజలు కూడా తమ ప్రాణాలను ముప్పుగా మారే పరిస్థితుల్లో ప్రయాణించవద్దని కోరారు.ప్రతి ఒక్కరు రవాణా నియమాలను పాటిస్తూ, సురక్షిత రవాణా కోసం పరిమితికి లోబడి వాహనాలలో ప్రయాణించాలని తెలిపారు.

## దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు

- ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి, నవంబర్ 10 (జనంసాక్షి) :** దళారుల చేతిలో రైతులు మోసపోవద్దని, రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఎజెండా అని రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా మోసం చేస్తే దళారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బేతంపూడి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడంతో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు లక్కినేని సురేందర్రావు, ఎంపీడీవో మల్లీశ్వరి, ఏ ఓ నీరుడు అన్నపూర్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## లీగల్ సర్వీసు యాక్ట్‌ను సేవలను కక్షిదారులు ఉపయోగించుకోవాలి



**కోదాడ, నవంబర్ 10 (జనం సాక్షి) :** నేషనల్ లీగల్ సర్వీస్‌డే సందర్భంగా సోమవారం కోదాడ కోర్టులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం జడ్జికె సురేష్ మాట్లాడుతూ1987లో ఏర్పడిన లీగల్ సర్వీస్ చట్టం 1995 నుంచి అమలులోకి వచ్చింది. లీగల్ సర్వీస్ యాక్ట్ ద్వారా అందరికి సమ న్యాయం అందించడానికి,పేదలకు న్యాయాన్ని చేరువ చేయడానికి కృషి జరిగిందన్నారు.ఈ చట్టం ద్వారా అందరికీ న్యాయవిజ్ఞానం అందిస్తున్నామని, రాజీమార్గాలను, లోక్ అదాలత్‌లను, మధ్యవర్తిత్వం, న్యాయ సహాయం అందించడం, పలు రకాల కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జాతీయ స్థాయి నుండి మండల స్థాయి వరకు లీగల్ సర్వీస్ కమిటీలు ఏర్పాటు చేసి కార్యక్రమాలను చేస్తున్నామని చెప్పారు.చిన్న చిన్న నేరాలల్లో జైలులలో మగ్గుతున్న ఖైదీలకు, దారిద్ర్య రేఖకు దిగువన గల పేదలకు న్యాయ రక్షణకు కల్పించడంలో న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఈ చట్టం అమలు జరుగుతూ అందరికీ న్యాయం అందేలా చేస్తున్నామన్నారు. ప్రతి నెల నవంబర్ 9న జరగాల్సిన సెలవు రోజు కావడంతో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భవ్య, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎండి. ఉమర్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్డి జకీయా సుల్తానా, సెంకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ సిహెచ్ సత్యనారాయణ, న్యాయవాదులు ఉయ్యాల నరసయ్య, గట్ల నర్సింహారావు, ఈదుల కృష్ణయ్య, సిలివేరు వెంకటేశ్వర్లు,లీగల్ సర్వీస్ సిబ్బంది మౌనిక, శైలజ,పారాలీగల్ వాలంటీర్లు, అంగన్ వాడీ టీచర్లు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

# అక్రమ రవాణాను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

- ఎర్రరాయిని తరలిస్తున్న మూడు వాహనాలు స్వాధీనం
- హద్దునూర్ పోలీస్ స్టేషన్ కు వాహనాల తరలింపు

**న్యాల్‌కల్, నవంబర్ 10 (జనం సాక్షి) :** తెలంగాణ – కర్ణాటక సరిహద్దు, సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, గణేష్ పూర్ గ్రామ శివారులో.. అక్రమంగా ఎర్రరాయిని తరలిస్తున్న మూడు వాహనాలను స్థానిక రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. స్థానిక తహసిల్దార్ ప్రభు ఆదేశం మేరకు.. స్థానిక రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యామ్ రావు, సర్వేర్ లాల్ సింగ్ ల బృందం సోమవారం సాయంత్రం గణేష్ పూర్ గ్రామ శివారులో అక్రమంగా నిలువున్న రెండు కర్ణాటక ట్రాక్టర్లలోని ఎర్రాయిని బీదర్ కు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. అక్కడే ఉన్న ఓ లారీని సైతం స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. పక్షం రోజుల క్రితం జహీరాబాద్ ఆర్డిఓ, స్థానిక రెవెన్యూ, పోలీస్ సిబ్బంది మెరుపుదాడి చేసి ఓ ఇటాచిని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దాడులు చేసిన పక్షం రోజుల వ్యవధిలోనే.. మైనింగ్ వ్యాపారులు తిరిగి దందాను కొనసాగించడం చర్చనీయ అంశంగా మారింది. స్థానిక అధికారుల కనుసైగలోనే మైనింగ్ మాఫియా దందా కొనసాగుతోందని గణేష్ పూర్, రాజోల, గంగువార్, మెటల్ కుంట, తదితర గ్రామాలకు చెందిన పలువురు ఆరోపిస్తున్నారు.



అక్రమ మైనింగ్ మాఫియా దందాను పూర్తిస్థాయిలో కట్టడి చేయడంలో అధికార బృందం విఫలం అయ్యారని మండలంలోని పలువురు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేయింబవళ్లు అక్రమంగా రవాణా కొనసాగిస్తున్న చూసి చూడనట్లు వ్యవహరించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అక్రమ దందాపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజానీకం కోరుతున్నారు.

## మధ్యాహ్న భోజన వర్కర్స్ 9 నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలి




**గద్వాల నడిగడ్డ, నవంబర్ 10 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రగతిశీల మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ టి యు సి ఐ అనుబంధ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని సోమవారం పిజెపి క్యాంపు నుండి కలెక్టరేట్ వరకు దాదాపు 200 మంది మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించాలని కలెక్టర్ వినతి పత్రం అందజేసినట్లు ప్రగతిశీల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో దాదాపు 9 నెలలుగా మెనూ బిల్లులు గుడ్డు బిల్లులు గౌరవ వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని వీటి పరిష్కారం కోసం గతంలో అధికారులకు విన్నవించినప్పటికీ పరిష్కరించడంలో జాప్యం జరుగుతుందని, బిల్లుల చెల్లింపు జాప్యం వల్ల ఈ స్కీమును కొనసాగించలేకపోతున్నారనీ, అందుకనే నెలలు బిల్లులు చెల్లించాలని మెనూ బిల్లులు పెంచాలని గౌరవ వేతనాలు 10,000 రూపాయలు ఇవ్వాలని వంటగదిల నిర్మాణం చేయాలనీ, కార్మికులకు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని పిలుపునివ్వడం జరిగిందనీ జరిగిందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా కార్యదర్శి కృష్ణ, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కృష్ణ, పాషా, ధనమ్మ, సరోజ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలి



**సంగారెడ్డి, నవంబర్ 10 (జనం సాక్షి) :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ పద్మజ రాణిలతో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు సమర్పించారు.ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖాధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి, పరిధిలో పరిష్కరించగలిగిన వాటిని వెంటనే పరిష్కరించాలని, పరిధికి సంబంధించినవి కాని అంశాలపై దరఖాస్తుదారులకు సరైన సూచనలు అందించాలి అని తెలిపారు. ప్రజావాణిలో మొత్తం 31 దరఖాస్తులు స్వీకరించబడ్డాయని, వాటిని సంబంధిత శాఖలకు పంపించినట్లు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ జానకి రెడ్డి, పిడి, డిఆర్‌డిఓ జ్యోతి, రెవెన్యూ, పోలీస్,పంచాయతీ రాజ్, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సంక్షేమ శాఖల అధికారులు తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- చైతన్యం - డ్రగ్స్‌పై యుద్ధం నినాదంతో భారీ ర్యాలీ
- ఇల్లందు డీఎస్పీ చంద్రభాను

**టేకులపల్లి, నవంబర్ 10 (జనంసాక్షి) :** గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలన, సైబర్ నేరగాళ్ల మోసాలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాలతో భద్రాద్రి జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు అవగాహన కల్పిస్తూ ప్రజలను, యువతను, విద్యార్థులను చైతన్య పరుస్తున్నారు. ఈ క్రమంలో "చైతన్యం- డ్రగ్స్‌పై యుద్ధం" కార్యక్రమంలో భాగంగా టేకులపల్లి పోలీస్ స్టేషన్ నుంచి బోడు రోడ్డు సెంటర్ వరకు పాఠశాల విద్యార్థులతో, స్థానిక ప్రజానీకంతో కలిసి అవగాహన భారీ ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఇల్లందు డిఎస్పి చంద్రభాను ఈ కార్యక్రమానికి హాజరై ముందుగా 9వ మైలు తండా కమ్యూనిటీ కాంటాక్ట్( కార్డెన్ అండ్ సెర్చ్ ) నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ సైబర్ మోసగాల ఉచ్చులో పడవద్దని, బ్యాంకు



ఖాతా, ఏటీఎంఎస్, పిన్ నెంబర్లు, ఓటిపి వివరాలు ఎవరికి చెప్పకూడదన్నారు. వివిధ రకాల బ్యాంకు లోన్ ఇప్పిస్తామని ఆశలు చూపిస్తే అలాంటి వాటికి ఆకర్షితులు కావద్దని సూచించారు. ఒకవేళ సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ కు 1930 కు కాల్ చేయాలని తెలిపారు. వ్యక్తిగత ఫోటోలు డీపీలుగా పెట్టుకోవద్దని సూచించారు. సెల్ ఫోన్తో ప్రతిదీ లింకు ఉండటంతో మన సెల్ ఫోన్ నెంబర్ కూడా మన బ్యాంకు ఎకౌంటు పాన్ కార్డు, ఆధార్ కార్డు, పెన్షన్, పౌరసరఫరాల వినియోగానికి సంబంధించి మన సెల్ ఫోన్ నెంబరు అవసరం ఉంటుందని, దాని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మనకు మాయమాటలతో మోసానికి సైబర్ నేరగాళ్లు పాల్పడతారని వివరించారు. టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ మాట్లాడుతూ గంజాయి,మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. గ్రామంలో గంజాయి సాగు చేసిన, రవాణాకు పాల్పడిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దు చేస్తారన్నారు. మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, గంజాయి డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాల నివారణకు సమిష్టిగా కృషి చేయాలని, అందుకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి ఎస్సై రాజేందర్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, స్థానిక యువకులు, వ్యాపారస్తులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీతలకు సన్మానం

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘన సత్కారం



**దేవరకొండ, నవంబర్ 10 (జనం సాక్షి) :** దేవరకొండ పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీతలకు సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గత 40 సంవత్సరాల నుండి వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ చోల్లేటి భాస్కరాచారి కి,దాదాపు 25 సంవత్సరముల నుండి స్వచ్ఛంద సేవా సంస్థను నిర్వహిస్తూ మహిళా శక్తిని ముందుకు తీసుకు వెళ్తున్న గిరిజన ముద్దు బిడ్డ,ఉత్తమ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డు గ్రహీత లావుడి బాషా చౌహాన్ లకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘం నాయకులతో కలిసి ఘనంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# వరుస నష్టాలకు బ్రేక్..

**• మళ్లీ లాభాల్లోకి సూచీలు**

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మూడు రోజుల వరుస నష్టాల అనంతరం నేడు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు ఐటీ, ఫార్మా స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లతో పాటు మన మార్కెట్ సూచీలూ రాణించాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.2 లక్షల కోట్లు పెరిగి రూ.468 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 83,198.20 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే లాభాల్లోకి వచ్చింది. రోజంతా కొనుగోళ్ల మద్దతుతో చివరి వరకు అదే ఒరవడి కొనసాగింది. చివరికి 319.07 పాయింట్ల లాభంతో 83,535.35 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 82.05 పాయింట్ల లాభంతో 25,574.35 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.71గా ఉంది. సెన్సెక్స్ 30 సూ చీలో ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, టీఎం పీవీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ట్రెంట్, అల్ట్రాటెక్ సిమెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టాలు చవిచూశా యి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 64.09 డాలర్ల వద్ద కొనసాగు తుండగా.. బంగారం ఔన్సు 4082 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# డిసెంబర్ నాటికి బంగారం ధరలు ఇలా..

**ముంబై:** పండుగ సీజన్, డాలర్ విలువ తగ్గడం, స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం వంటి కారణాల వల్ల ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో బంగారం ధరలు భారీగా పెరిగా యి. అయితే ప్రస్తుతం గోల్డ్ రేటు స్వల్ప తగ్గుదలను నమోదు చేస్తోంది. వెండి కూడా అదే బాటలో నడుస్తోంది.




డిసెంబర్ నెలలో పసిడి ధరలు మరింత తగ్గే సూచనలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నా రు. ప్రపంచ ఆర్థిక పరిణామాలు బంగారం ధరలను ప్రభావితం చేసే అవకాశం ఉందని.. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌లోని కమోడిటీ రీసెర్చ్ సీనియర్ విశ్లేషకుడు మానవ్ మోదీ అన్నారు. అమెరికా ఫెడ్ రేటు 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన తరువాత.. బంగారం 4000 డాలర్ల మార్కు దగ్గర కదలాడాయి. డిసెంబర్‌లో కూడా ఫెడ్ రేటు తగ్గే అవకాశం ఉంది. కాబట్టి బంగారం ధర తగ్గే సూచనలు ఉన్నాయని ఆయన అన్నారు. చైనాలో, బంగారు రిటైలర్లకు వ్యాట్ ఆఫ్‌సెట్‌లను తొలగించడం, మినహాయింపులను 13 శాతం నుంచి 6 శాతానికి తగ్గించడం వలన ప్రధాన బ్యాంకులు కొత్త రిటైల్ ఖాతాలను స్తంభింపజేయడానికి దారితీశాయి. ఇది ప్రపంచంలోని అగ్ర బంగారు

# నితిన్ గడ్కరీ ఆవిష్కరించిన స్కూటర్

**న్యూఢిల్లీ:** హీరో మోటోకార్ప్.. తన ఎలక్ట్రిక్ మొబిలిటీ శ్రేణిని విస్తరించడంలో భాగంగానే విడా ఏవోటర్ వీఎక్స్2 గో 3.4 కిలోవాట్ స్కూటర్ ప్రవేశపెట్టింది. దీనిని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆవిష్కరించారు. ఈ కొత్త మోడల్ ధర రూ. 1,02,000 కానీ (బ్యాటరీ-యాజ్-ఎ-సర్వీస్ ఆప్షన్) ప్లాన్ కింద రూ. 60000లకు కొనుగోలు చేయవచ్చు. హీరో విడా కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ నవంబర్ 2025 నుండి దేశవ్యాప్తంగా ఉన్న డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉంటుంది. వీఎక్స్2 గో 3.4 కిలోవాట్ వేరియంట్ అందుబాటులోకి రావడంతో.. విడా వీఎక్స్2 సిరీస్‌లో మూడు స్కూటర్లు అందుబాటులోకి వచ్చాయి. విడా ఏవోటర్ వీఎక్స్2 గో 3.4 కిలోవాట్ వేరియంట్.. డ్యూయల్-రిమూవబుల్ బ్యాటరీ సిస్టమ్‌తో వస్తుంది. ఇది 100 కిమీ రేంజ్ అందిస్తుంది. ఈ స్కూటర్ టాప్ స్పీడ్ 70 కిమీ/గం కాగా.. ఇందులో 27.2 లీటర్ అండర్ సీట్ స్టోరేజ్ ఉంటుంది. హీరో మోటోకార్ప్ తన కస్టమర్ల సౌకర్యార్థం.. దేశంలో 4600 ఛార్జింగ్ పాయింట్లు, 700 సర్వీస్ సెంటర్ల నెట్‌వర్క్ కలిగి ఉంది. కాబట్టి హీరో ఎలక్ట్రిక్ కొనుగోలు చేసేవారికి.. ఛార్జింగ్ సంబంధిత ఇబ్బందులు, సర్వీసుకు సంబంధించిన ఆలస్యాలు వుండవు. కాగా ఇప్పటికే హీరో విడా స్కూటర్లు మార్కెట్లో మంచి ఆదరణ పొందుతున్నాయి. అంటే: వినియోగదారుడు బ్యాటరీని కొనుగోలు చేయకుండా, సర్వీస్ రూపంలో దాన్ని అద్దెకు తీసుకోవడం లేదా సబ్‌స్క్రిప్షన్ విధానంలో ఉపయోగించడం. అంటే.. వినియోగదారుడు స్కూటర్ కొనుగోలు చేస్తాడు కానీ బ్యాటరీని కాదు. బ్యాటరీని కంపెనీ అద్దె లేదా సబ్‌స్క్రిప్షన్ ఆధారంగా అందిస్తుంది.

# అక్టోబర్‌లో కార్ల అమ్మకాలు అదుర్స్..

**న్యూఢిల్లీ:** 2025 అక్టోబర్ ముగియడంతో.. వాహన తయారీ సంస్థలు తమ అమ్మకాల నివేదికలను విడుదల చేశాయి. కొత్త జీఎస్టీ అమలు, ఆఫర్స్ వంటివన్నీ సేల్స్ పెరగడానికి గణనీయంగా దోహదపడ్డాయి. ఈ కథనంలో ఇండియన్ మార్కెట్లో ఎక్కువ మంది కొనుగోలు చేసిన టాప్ 10 కార్లు ఏవి?, అమ్మకాలు ఎన్ని? అనే వివరాలు తెలుసుకుందాం.

టాటా నెక్సాన్: 22,083 యూనిట్లు
మారుతి సుజుకి డిజైర్: 20,791 యూనిట్లు
మారుతి సుజుకి ఎర్టిగా: 20,087 యూనిట్లు
మారుతి సుజుకి వ్యాగన్ఆర్: 18,970 యూనిట్లు
హ్యుందాయ్ క్రెటా: 18,381 యూనిట్లు
మహీంద్రా స్కార్పియో: 17,880 యూనిట్లు
మారుతి సుజుకి ఫ్రాంక్స్: 17,003 యూనిట్లు
మారుతి సుజుకి బాలెనో: 16,873 యూనిట్లు
టాటా పంచ్: 16,810 యూనిట్లు



మారుతి సుజుకి స్విఫ్ట్: 15,542 యూనిట్లు

భారతదేశంలో టాటా నెక్సాన్ కార్లకు మంచి డిమాండ్ ఉంది. దీనికి కారణం.. ఇది డీజిల్, పెట్రోల్, ఎలక్ట్రిక్, సీఎన్జీ ఆప్షన్లలో అందుబాటులో ఉండటం, అత్యుత్తమ సేఫ్టీ ఫీచర్స్ కలిగి ఉండటం కూడా. ఇక డిజైర్ అమ్మకాలు కూడా ప్రతి నెల ఆశాజనకంగానే ఉన్నాయి. మహీంద్రా కంపెనీకి చెందిన స్కార్పియో.. మారుతి కార్లైన ఎర్టిగా, వ్యాగన్ఆర్, బాలెనో, స్విఫ్ట్ కూడా గత నెలలో మంచి అమ్మకాలను పొందాయి.

# వ్యవసాయ భూములు.. క్యాపిటల్ గెయిన్స్..



**హైదరాబాద్:** భూమి, ప్లాటు, జాగా.. ఇలాంటివి అమ్మితే ఏర్పడే క్యాపిటల్ గెయిన్స్ స్వభావరీత్యా పన్నుకి గురి అవుతాయి. అయితే, గ్రామాల్లో ఉన్న వ్యవసాయ భూములు అమ్మితే ఏర్పడే క్యాపిటల్ గెయిన్స్ మీద ఎలాంటి పన్నుభారం ఏర్పడదు. గ్రామాల్లో వ్యవసాయ భూమి అంటే ఏమిటి.. ఇన్‌కం చట్టంలో గ్రామీణ వ్యవసాయ భూమి అంటే ఏమిటో వివరించారు. ఇలాంటి పొలాన్ని చట్టం ప్రకారం క్యాపిటల్ అసెట్‌గా పరిగణించరు. అసలు అది క్యాపిటల్ అసెట్ కాదు కాబట్టి, క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ పడదు. ఒక మున్సిపాలిటీ, అందులో ఉన్న జనాభా 10,000 కన్నా తక్కువ ఉండి, ఈ రెండు కండీషన్లకు అనుగుణంగా ఉన్న ప్రాంతంలోని పొలాన్ని వ్యవసాయ భూమి అంటారు. అలాగే మున్సిపాలిటీ బైట, జనాభా 10,000 దాటినప్పుడు దూరాన్ని బట్టి పరిగణనలోకి తీసుకుంటారు. మున్సిపాలిటీ పొలిమేర హద్దుల నుంచి కొలుస్తారు. జనాభా సంఖ్యను బట్టి, దూరాల లోపల ఉంటేనే గ్రామీణ వ్యవసాయ భూమి కింద లెక్కిస్తారు. ఈ రోజు గ్రామంలో ఉన్న జనాభా సంఖ్య తీసుకోరు. తాజా జనాభా లెక్కల గణన ప్రకారం పరిగణిస్తున్నారు. అంటే ప్రస్తుతానికి చివరగా 2011లో జనాభా లెక్కింపు జరిగినది. 2021లో జరగలేదు. 2027లో జరుగుతుంది. దూరం అంటే నడక దూరం కాదు, వైమానిక దూరం. పైన చెప్పిన షరతులకు లోబడి భూమి ఉండి, ఆ భూమి అమ్మితే పన్ను భారం ఉండదు. ఆదాయానికి కూడా పన్ను భారం ఉండదు. అయితే, చాలా మంది వ్యవసాయ భూమి మీద బంగారం పండుతుందని చెప్తారు. ఆస్తిపరులు, రాజకీయ నాయకులు, సినిమా ఇండస్ట్రీ వాళ్లు, పారిశ్రామి కవేత్తలు, బడా బడా ఆఫీసర్లు ఉన్నారు. మహానగరాల్లో మసలుతూ, వ్యవసాయం మీద ఆదాయం ఉందని, పొంతన లేని లెక్కలు చూపిస్తుంటారు. వరి వంగడంలో నుంచి "సిరి" పండిందని, యాపిల్ చెట్టుకి బంగారం పళ్లు కాశాయని చెప్పిన ఎందరో రాజకీ య నాయకులు, తనిఖీ లు చేసినప్పుడు, అడ్డంగా బుక్ అయిపోయారు. పెద్ద పెద్ద సినిమా స్టార్లు, తాము చిత్ర రంగాన్ని ఏలుతున్నా, వ్యవసాయదార్లమని చెప్పుకుంటున్నా రు. అలాగే కంపెనీలు కూడా. ఒక ఆర్‌టీఐ జవాబు ప్రకారం 2011లో 6,50,000 మంది వ్యక్తులు డిక్లేర్ చేసిన వ్యవసాయ ఆదాయం సుమా రు రూ. 2,000 లక్షల కోట్లు!! అయితే, ఆదాయ పన్ను శాఖ వారు స్క్రూ టినీ చేస్తున్నారు. శాటిలైట్ ద్వారా పరీక్ష చేస్తున్నారు. అ సలు పొలం ఉందా లేదా.. ఉంటే ఏం పండుతుంది.. అది ఎలా అమ్ముతారు.. ఎక్కడ అమ్ముతారు లాంటి విషయాలు తెలుసుకుంటున్నారు. వ్యవసాయం మీద పన్నుభారం లేదు. వ్యవసాయ భూములు అమ్మితే పన్నుభారం లేదు. వచ్చిన మొత్తం మీద ఏమాత్రం పన్ను కట్టకుండా వైట్ రంగు వేసుకోవచ్చు. అయితే, ఆ ఇన్వెస్ట్‌మెంట్ మీద వచ్చే ఆదాయం, వడ్డీ, డివిడెండ్ల రాబడి మీద పన్నుభారం ఉంటుంది. ఇక రూ. 50,00,000 దాటినా టీడీఎస్ ఉండదు. అయితే, అర్బన్ ల్యాండ్‌ని క్యాపిటల్ అసెట్‌గా పరిగణిస్తారు. అమ్మగా ఏర్పడ్డ క్యాపిటల్ గెయిన్స్ మీద పన్ను వేస్తారు. రూ. 50,00,000 దాటితే టీడీఎస్ 1 శాతం వర్తిస్తుంది. అర్బన్ ల్యాండ్ స్వల్పకాలికం అయితే, శ్లాబు ప్రకారం పన్ను విధిస్తారు. దీర్ఘకాలికం అయితే, 20 శాతం విధిస్తారు. అర్బన్ ల్యాండ్ అమ్మి వ్యవసాయ భూమి కొంటే పన్నుండదు. అలాగే కంపల్సరీ అక్విజిషన్, పన్ను విధింపు, మినహాయింపు ఉన్నాయి. అర్బన్ ల్యాండ్ అమ్మగా ఏర్పడ్డ క్యాపిటల్ గెయిన్స్ నుంచి మినహాయింపు పొందాలంటే 54ఎఫ్ ప్రకారం ఇల్లు కొనొచ్చు. 54ఈసీ ప్రకారం గుర్తింపు పొందిన బాండ్లలో రీఇన్వెస్ట్ చేయొచ్చు. లేని ఆదాయాన్ని చూపించకండి. లేని ఆస్తిని చూపించకండి. దొంగ లెక్కలు చూపించకండి. అన్నదాత ముసుగులో అసలు నిజాన్ని దాచి, దోచి అధికారుల దృష్టిలో పడకండి.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.90 | ₹ 5.95 |

## బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,12,950 | ₹ 1,23,220 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,67,000



# ఎవరికెంత బలం?

**విజయం మాదంటే.. మాదేనని ధీమా వ్యక్తం చేస్తున్న ఎన్డీఏ, మహాగఠ్‌బంధన్**

పాట్నా: బిహార్ శాసనసభ ఎన్నికల పర్వం చివరి దశకు చేరుకుంది. రెండో విడత ఎన్నికల పోలింగ్ నవంబర్ 11న (మంగళవారం) జరుగుతుంది. దీంతో పోలింగ్ ప్రక్రియ ముగుస్తుంది. 14న ఓట్ల లెక్కింపు ఉంటుంది. రెండో విడత ఎన్నికల పోలింగ్‌కు ప్రచారం ఆదివారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీలన్నీ సర్వశక్తులను ఒడ్డాయి. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల సమరం ప్రధానంగా ఎన్డీఏ, మహాగఠ్‌బంధన్ కూటముల మధ్య జరుగుతోంది. ఎన్డీఏలో బీజేపీ, జేడీయూ ప్రధాన పార్టీలు. మహాగఠ్‌బంధన్‌లో కాంగ్రెస్, ఆర్జేడీ ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. ఇవే కాకుండా ఇతర చిన్న పార్టీలు కూడా రెండు కూటములతో జట్టు కట్టాయి. ఆయా కూటముల్లో ఏయే పార్టీలు ఉన్నాయనే దాని గురించి సోషల్ మీడియాలో తెగ వెతుకుతున్నారు నెటిజనులు. చిన్న పార్టీలు కూడా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో వీటి గురించి నెట్టింట చర్చ నడుస్తోంది. మరోవైపు కొత్త పార్టీ జన్ సురాజ్ ఒంటరిగా బరిలోకి దిగింది. రాజకీయ నేతగా మారిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఈ పార్టీని స్థాపించారు. ఎన్డీఏ కూటమిలోని 5 పార్టీలు బిహార్ ఎన్నికల్లో కలిసి కట్టుగా పోటీకి దిగాయి. భారతీయ జనతా పార్టీ (బీజేపీ)తో పాటు సీఎం నితీశ్ కుమార్ నాయకత్వంలోని జనతాదళ్ (యునైటెడ్), కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), మాజీ సీఎం జితన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థానీ అవామ్ మోర్చా ఉపేంద్ర కుష్వాహా నాయకత్వంలోని రాష్ట్రీయ లోక్ మోర్చా ఎన్డీఏలో భాగస్వాములుగా ఉన్నాయి. ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్‌లో ఏడు పార్టీలు పాలు పంచుకున్నాయి. కాంగ్రెస్‌తో సహా తేజస్వీ యాదవ్ నేతృత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ), ముఖేష్ సహానీకి చెందిన వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ), ఇంద్రజీత్ ప్రసాద్ గుప్తా నాయకత్వంలోని ఇండియన్ ఇన్‌క్లూజివ్ పార్టీ (ఐఐపీ) మహాగఠ్‌బంధన్ పేరుతో బిహార్ ఎన్నికల బరిలోకి దిగాయి. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్-లెనినిస్ట్) లిబరేషన్ (సీపీఐఎంఎల్-లిబరేషన్), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) వంటి వామపక్ష పార్టీలు కూడా ప్రతిపక్ష కూటమిలో భాగంగా ఉన్నాయి.

ఎన్డీఏ కూటమి

1. భారతీయ జనతా పార్టీ
2. జనతాదళ్ (యునైటెడ్)
3. లోక్ జనశక్తి పార్టీ
4. హిందుస్థానీ అవామ్ మోర్చా
5. రాష్ట్రీయ లోక్ మోర్చా

మహాగఠ్‌బంధన్

1. కాంగ్రెస్ పార్టీ
2. రాష్ట్రీయ జనతాదళ్
3. వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ
4. ఇండియన్ ఇన్‌క్లూజివ్ పార్టీ
5. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా
6. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్-లెనినిస్ట్) లిబరేషన్
7. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్)

**ఎవరెవరికి ఎన్ని సీట్లు?**

ఎన్డీఏ కూటమిలోని బీజేపీ, జేడీయూ చెరో 101 సీట్లలో పోటీ చేస్తున్నాయి. లోక్ జనశక్తి పార్టీ 29, హిందుస్థానీ అవామ్ మోర్చా 6, రాష్ట్రీయ లోక్ మోర్చా 6 స్థానాల్లో బరిలో నిలిచాయి. మహాగఠ్‌బంధన్ విషయానికి వస్తే.. రాష్ట్రీయ జనతాదళ్ 145, కాంగ్రెస్ 45, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్-లెనినిస్ట్) లిబరేషన్ 19, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా 6, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) 5 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. మరో 12 చోట్ల మహాగఠ్‌బంధన్‌లోని పార్టీలు స్నేహపూర్వక పోటీకి దిగాయి.

బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తరచుగా అడిగే ప్రశ్నలు

1. బిహార్ ఎన్నికల 2025 ఫలితాలు ఎప్పుడు ప్రకటిస్తారు?
నవంబర్ 14న ప్రకటించబడతాయి.
2. బిహార్ ఎన్నికలు 2025లో ఎన్ని దశలు ఉన్నాయి?
నవంబర్ 6, నవంబర్ 11న రెండు దశల్లో జరుగుతున్నాయి..
3. బిహార్ శాసనసభలో సీట్లు ఎన్ని ?
బిహార్ అసెంబ్లీలో 243 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 122 సీట్లు అవసరం.
5. మొదటి దశలో పోలింగ్ ఎంత ?
మొదటి దశలో 65.08% పోలింగ్ నమోదైంది. ఇది 2020, 2024 ఎన్నికల కంటే ఇది ఎక్కువ.
5. బిహార్ ప్రస్తుత ముఖ్యమంత్రి ఎవరు?
జేడీయూ పార్టీకి చెందిన నితీశ్ కుమార్. ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వానికి ఆయన నాయకత్వం వహిస్తున్నారు.



# మిని విమానంలా.. వందేభారత్

**భవిష్యత్తు రైల్వే స్లీపర్ క్లాస్‌లు..**

**న్యూఢిల్లీ:** భారతీయ రైల్వేల ఆధునికీకరణ నేపథ్యంలో త్వరలో ప్రారంభించబోయే వందే భారత్ ఎయిర్ కండిషన్డ్ స్లీపర్ బోగీలు సిద్ధమవుతున్నాయి. ఈమేరకు సామాజిక మాధ్యమాల్లో వీటి తయారీకి సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారుతున్నాయి. ఇప్పటికే ఇటీవల అక్టోబర్ 15న ఢిల్లీలో జరిగిన ఇండియన్ రైల్వే ఎక్విప్‌మెంట్ ఎగ్జిబిషన్ (ఐఆర్ఈఈ) 2025లో ఈ ఏసీ స్లీపర్ కోచ్‌ను ప్రదర్శించారు. సుదూర, మధ్యస్థ ప్రయాణాలకు విమానం లాంటి సౌకర్యాన్ని అందించే లక్ష్యంతో రైల్వే మంత్రిత్వ శాఖ ఈ వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ రైళ్లను ఆటోమేటిక్ డోర్లు, వైఫై సదుపాయం, విమానం (ఎయిర్ క్రాఫ్ట్)లాంటి డిజైనింగ్‌లో రూపొందిస్తున్నారు.

# రెండో దశ పోలింగ్‌కు బీహార్ సిద్ధం

కూటములకు ఈ చివరి దశ పోలింగ్ కీలకమైన పరీక్షగా నిలుస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రెండో దశలో దాదాపు 3.70 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1.75 కోట్ల మంది మహిళలు. 45 వేలకుపైగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 40 వేల కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. పోలింగ్ నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. నాలుగు లక్షలకుపైగా సిబ్బంది ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారు. పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామఢీ, మధుబని, అరారియా, కిషన్‌గంజ్ తదితర జిల్లాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ ముస్లిం జనాభా అధికం. అత్యధికంగా హిసువా అసెంబ్లీ నియోజకవర్గంలో 3.67 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. లౌరియా, చన్‌పటియా, రక్సౌల్, త్రివేణిగంజ్, సుగౌలీ, బన్‌మన్‌ఖీ స్థానాల్లో అత్యధికంగా 22 మంది చొప్పున పోటీ పడుతున్నారు. సుపౌల్ స్థానం నుంచి మంత్రి బిజేంద్ర ప్రసాద్ యాదవ్ (జేడీయూ), గయా టౌన్ నుంచి మంత్రి ప్రేమ్ కుమార్ (భాజపా) వరుసగా ఎనిమిదోసారి గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రులు రేణుదేవీ, నీరజ్ కుమార్ సింగ్, లేశీ సింగ్, శీలా మండల్, జమా ఖాన్, మాజీ ఉపముఖ్యమంత్రి తార్‌కిశోర్ ప్రసాద్ (భాజపా), కాంగ్రెస్ బిహార్ అధ్యక్షుడు రాజేశ్ కుమార్ తమతమ స్థానాల నుంచి బరిలో దిగారు.

# 'హజ్' కోటా నిర్ధారణ.. ఎందరు వెళ్లొచ్చంటే?

**న్యూఢిల్లీ:** హజ్ యాత్ర-2026కు సంబంధించి భారత్ కొటా ఎంతనేది నిర్ణారణ అయ్యింది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు సౌదీ అరేబియాలో తన అధికారిక పర్యటన సందర్భంగా జెడ్డాలో ద్వైపాక్షిక హజ్ ఒప్పందంపై సంతకం చేశారు. 2026 హజ్ యాత్రకు భారత యాత్రికుల కోటా ఇప్పుడు 1,75,025గా నిర్ధారణ అయ్యింది. మంత్రి రిజిజు నవంబర్ 7 నుండి 9 వరకు సౌదీ అరేబియాలో అధికారిక పర్యటన చేస్తున్నారు. ఈ సందర్భంగా సౌదీ హజ్, ఉమ్రా మంత్రి తౌఫిక్ బిన్ ఫౌజాన్ అల్ రబియాతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఇరుదేశాల సమన్వయం, లాజిస్టిక్స్ ఏర్పాట్లు మొదలైన అంశాలపై దీనిలో చర్చించారు. భారత యాత్రికుల కోసం అవసరమైన ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు ఇరుపక్షాలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయని ఒక అధికారిక ప్రకటన తెలిపింది.




# రైతన్నకు చేదోడుగా మార్కెట్‌లోకి ఏఐ టూల్

**న్యూఢిల్లీ:** భారతదేశంలో వ్యవసాయ రంగం అనిశ్చితి, వాతావరణ మార్పులు, సరైన సమాచార లేమి వంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో స్మార్ట్ ఫామ్ సెంటర్స్ కోసం అగ్రిటెక్ ప్లాట్‌ఫామ్ 'ఆర్య.ఏజీ'ను ఓ ప్రైవేట్ సంస్థ ఆవిష్కరించింది. ఈ సెంటర్ల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా టెక్నాలజీల సాయంతో గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు తమ నిర్ణయాలను మెరుగుపరుచుకునేందుకు తోడ్పడుతుంది. ఆర్య.ఏజీ స్మార్ట్ ఫామ్ సెంటర్స్ కేవలం ఒక టూల్‌గానే కాకుండా వ్యవసాయానికి సంబంధించిన పూర్తి పరిష్కారాలను అందించే ఒక లోకల్ హబ్‌గా పనిచేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నియోపర్క్ సెన్సార్ల వంటి సాంకేతికతను ఉపయోగించి వేగవంతమైన మట్టి పరీక్షలు నిర్వహిస్తారు. దీనివల్ల సాంప్రదాయ ల్యాబ్ పరీక్షల కంటే తక్కువ సమయంలోనే భూసార స్థితి, పోషకాల లభ్యత గురించి కచ్చితమైన సమాచారం లభిస్తుంది. వ్యవసాయ క్షేత్రానికి అతి దగ్గరగా ఉన్న వాతావరణ పరిస్థితులపై ఆన్‌లైన్‌లో సమగ్ర సమాచారాన్ని అందిస్తారు. దీనివల్ల రైతులు విత్తనాలు నాటడం, నీటి పారుదల, ఎరువుల వినియోగం, పంట కోత వంటి కీలక నిర్ణయాలను సకాలంలో తీసుకోగలుగుతారు. డ్రోన్ ఇమేజింగ్, శాటిలైట్ మ్యాపింగ్ టెక్నాలజీలను ఉపయోగించి పంట ఆరోగ్య స్థితిని పర్యవేక్షిస్తారు. పంటల్లో చీడపీడల దాడిని, వ్యాధులను త్వరగా గుర్తించి తగిన సస్యరక్షణ చర్యలను సిఫార్సు చేస్తారు. ఆర్య.ఏజీ స్మార్ట్ ఫామ్ సెంటర్స్ సాంకేతికతను క్షేత్రస్థాయికి తీసుకురావడం ద్వారా రైతులకు అనేక విధాలుగా మేలు చేస్తున్నాయి. సరైన సమయంలో, సరైన పరిమాణంలో వ్యవసాయం సాగేందుకు ఇది తోడ్పడుతుంది. ఉదాహరణకు, మట్టి విశ్లేషణ ద్వారా ఎంత ఎరువు వాడాలి.. వాతావరణ అంచనా ద్వారా ఎప్పుడు విత్తనం వేయాలి లేదా ఎప్పుడు పంట కోయాలి అనే విషయాలపై కచ్చితమైన సమాచారం

# ఆధార్ కొత్త యాప్

**ప్రయోజనాలు ఇవే!**

**న్యూఢిల్లీ:** ఆధార్ కార్డును ప్రతీచోటుకి తీసుకెళ్లడం బహుశా కష్టం అవ్వొచ్చు లేదా మర్చిపోవచ్చు. దీనిని దృష్టిలో ఉంచుకుని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ కొత్త ఆధార్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇది గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ స్టోర్ వంటివాటితో అందుబాటులో ఉంది. ఈ విషయాన్ని ఉడాయ్ తన ఎక్స్ ఖాతాలో అధికారికంగా వెల్లడించింది. పేపర్‌లెస్ ఎక్స్‌పీరియన్స్ పొందటానికి ఈ యాప్ ఉపయోగపడుతుందని పేర్కొంది. ఆధార్ వినియోగాన్ని మరింత సురక్షితం చేయడానికి ఉడాయ్ ఈ కొత్త యాప్ తీసుకొచ్చింది. ఈ యాప్ ఉంటే.. ప్రత్యేకంగా పిజికల్ ఆధార్ కార్డును వెంటపెట్టుకోవాల్సిన అవసరం లేదు. ఇప్పటికే ఉడాయ్ ఎంఆధార్ పేరుతో ఒక యాప్ పరిచయం చేసింది. ఇప్పుడు తాజాగా.. ఈ కొత్త యాప్ ప్రవేశపెట్టింది. ఇది మీ ఆధార్ వివరాలను భద్రపరచుకోవడానికి, దానిని ఇతరులతో పంచుకోవడానికి ఉపయోగపడుతుంది. యాపిల్ యూజర్లు యాపిల్ స్టోర్ నుంచి, ఆండ్రాయిడ్ యూజర్లు ప్లేస్టోర్ నుంచి ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న తరువాత.. అవసరమైన టర్మ్ అండ్ కండిషన్స్ యాక్సెప్ట్ చేయాలి. ఇప్పటికే ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నెంబర్ ఎంటర్ చేయాలి. మొబైల్ నెంబర్ వెరిఫికేషన్ పూర్తయిన తరువాత.. ఫేస్ అథంటికేషన్ చేయాల్సి ఉంటుంది. అవసరమైన వివరాలు అన్నీ ఎంటర్ చేసాక, ఒక సెక్యూరిటీ పిన్ సెట్ చేసుకోవాలి. ఈ తరువాత యాప్ ఉపయోగించుకోవచ్చు.



# బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు





- బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవు
- బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి
- ఐసిడిఎస్ సూపర్వైజర్ అంజని, సౌజన్య

**తంగళ్ళపల్లి నవంబర్ 10 (జనంసాక్షి) :** తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని బాబాజీ కాలనీలో ఓ బాల్య వివాహాన్ని ఐసిడిఎస్, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు అడ్డుకున్నారు. పెళ్లి కుమార్తె మైనర్ అని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు తక్షణమే స్పందించి ఈ వివాహాన్ని నిలిపివేశారు. మండల కేంద్రానికి చెందిన ఇనుగొండ లక్ష్మణ్, రాజేశ్వరి దంపతుల కుమారుడుతో వేములవాడలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ చీర్లవంచ గ్రామానికి చెందిన మేకల రమేష్, సమ్మవ్వల కూతురుతో సోమవారం ఉదయం వివాహం జరగాల్సి ఉంది. మరికొద్ది సేపట్లో పెళ్లి తంతు మొదలుకానుండగా గుర్తుతెలియని వ్యక్తి చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ కు ఫోన్ చేసి పెళ్లికూతురు మైనరని ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. వివాహం జరుగుతున్న ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకుని పెళ్లి జరగకుండా ఫంక్షన్ హాల్‌కు పోలీసులు తాళం వేయించారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్‌లు రజిని, సౌజన్య, చైల్డ్ వెల్ఫేర్ కోఆర్డినేటర్ స్రవంతి వరుడు ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ కుటుంబ సభ్యులతో మాట్లాడి బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు చట్టపరమైన చిక్కుల పై అవగాహన కల్పించారు. వారికి ఇచ్చిన కౌన్సిలింగ్ తో కుటుంబ సభ్యులు పెళ్లిని నిలిపివేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ మండలంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామానికి వెళ్లి బాల్య వివాహాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగే బాల్య వివాహాలను నిరోధించడానికి కఠినంగా వ్యవహరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మీ గ్రామాలలో బాల్యవివాహాలు జరుగుతున్నట్లయితే వెంటనే మాకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. రికార్డులు పరిశీలించిన తర్వాత వధువుతో పాటు వరుడు కూడా మైనర్ అని తేలడం కోస మెరుపు.

# కరీంనగర్‌కు జాతీయస్థాయి ఐఐటీ / నీట్ కోచింగ్ సెంటర్ "ఫిట్జీ"

- ఆవిష్కరించిన ఫిట్జీ హైదరాబాద్ డైరెక్టర్ స్వప్న చల్లంగి.




**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 10 (జనంసాక్షి):** జాతీయస్థాయి ఐఐటి – నీట్ వంటి పోటీ పరీక్షలకు దేశంలోనే అత్యుత్తమంగా శిక్షణ ఇచ్చే విద్యాసంస్థ ఫిట్జీ ని కరీంనగర్‌లో ఫిట్జీ వరల్డ్ స్కూల్ డైరెక్టర్ స్వప్న చొల్లంగి , ఐఐటి కాన్పూర్ అల్యూమిని, ఫిడ్జి అకాడమిక్ డైరెక్టర్ సాయి సుప్రీత్‌తో కలిసి ఫిట్జీ కరీంనగర్ డైరెక్టర్ ఎర్రంశెట్టి మునిందర్, ఎస్ ఆర్ ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. మధుసూదన్ రెడ్డితో కలిసి కరీంనగర్ సెంటర్ ను హోటల్ మైత్రి లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఐటి ఓరియంటేషన్ ప్రోగ్రాం అరిందం పేరుతో విద్యార్థులకు ఐఐటి పోటీ పరీక్షలకు సంబంధించి పూర్తిస్థాయి అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... ఫిట్జీ లాంటి విద్యాసంస్థ కరీంనగర్‌కు రావడం కరీంనగర్ విద్యార్థుల అదృష్టమని విద్యార్థులు సుదూర ప్రాంతాలకు పోకుండా స్థానికంగానే అవకాశాన్ని అందిపుచ్చు కోవాలని తెలిపారు. కరీంనగర్ ట్రస్మా నాయకులు పచ్చునూరి సురేందర్, వేదం శ్రీనివాస్ గౌడ్, గాయత్రి శ్రీనివాస్ , విశ్వశాంతి ఆంజనేయులు, లలితా శ్రీనివాస్, లెజెండ్ రాజయ్య, నటరాజ్ లు ఫిట్జీ జనరల్ మేనేజర్ మహేష్ రెడ్డి, సాన్వి కళాశాల ప్రిన్సిపాల్ రత్నాకర్, మోహన్, కళాశాల అధ్యాపకులు, పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి హాజరయ్యారు.

# అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి



**ముత్తారం నవంబర్ 10(జనంసాక్షి):** ముత్తారం మండలం పోతారం గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లులు మంజూరు చేయాలని మంథని డివిజనల్ దళిత నాయకుడు ఊట్ల శ్రీనివాస్ సోమవారం రోజున మండల అభివృద్ధి అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా గ్రామంలో అనేక మంది స్వంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతూ ఇతర ఇళ్లల్లో కిరాయిలకు ఉంటున్నారని అలాంటి వారిని గుర్తించి ఇందిరమ్మ ఇల్లులు మంజూరు చేయాలని కోరడం జరిగిందని తెలిపారు. అనర్హత కలిగి ఉండి ఇందిరమ్మ ఇల్లు మందిరైన వారిని తొలగించి లేని వారికి ఇవ్వాలని లేనియెడల ఈనెల 14వ తేదీన ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు ఆయన తెలిపారు



# ప్రతి వరి గింజను కొనుగోలు చేస్తాం

- కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమే
- కమాన్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు

**ముత్తారం నవంబర్ 10(జనంసాక్షి):** రైతులు పండించిన ప్రతి వరి గింజను కొనుగోలు చేస్తామని ఇది రైతు ప్రభుత్వం అని కమాన్‌పూర్ ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు అన్నారు. సోమవారం ముత్తారం మండలంలోని మచ్చుపేట, మైదంబండ, హరిపురం, కేషన్ పల్లి, ముత్తారం, అడవిశ్రీరాంపూర్, ఖమ్మంపల్లి, గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏ.ఎం.సి చైర్మన్ వైనాల రాజు, ముత్తారం పి.ఏ.సి.ఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరి రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి దాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం మద్దతు ధరతో రైతులకు మేలు చేసే విధంగా గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రైతుకు సౌకర్యకరంగా గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. సన్న వరి ధాన్యానికి క్వింటాల్‌కి 500 రూపాయల బోనసిచ్చిన ఘనత భారతదేశంలో తెలంగాణ రాష్ట్రానికి దక్కిందని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తాలుతప్ప పేరుతో క్వింటల్‌కి ఐదు కిలోల వరకు కోత విధించేవారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గాధం శ్రీనివాస్,మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు ఎస్ కే వాజీద్ పాషా, మాజీ సర్పంచులు వేల్పూరి సంపత్ రావు,గోవిందుల పద్మ ఆనంద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బోల్నేని బచ్చం రావు,జాగిరి సమ్మయ్య, అరెల్లి శ్రీనివాస్,సిద్ధం మురళి కృష్ణ, గూగులోతు ప్రవీణ్ నాయక్, ఏ ఈ ఓ హారిక,సిసిలు ఎల్లమ్మ, తిరుపతి, కవిత, రాధిక తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు




# మానేరు వాగు బ్రిడ్జి పనులు వెంటనే చేపట్టాలి

- తాత్కాలిక మట్టిరోడు పనులు పూర్తి చేయాలి
- ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా

**గంభీరావుపేట, నవంబర్ 10(జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మానేరు వాగుపై వంతెన పనులు త్వరగా చేపట్టాలని సోమవారం రోజు ధర్నా చేపట్టారు, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోపలి రాజు రావు, ఎస్ ఎఫ్ ఎస్, జిల్లా కన్వీనర్ గొండ్ల తిరుపతి, మాట్లాడుతూ, మానేరు వాగుపై లింగన్నపేట గంభీరావుపేట మధ్య వంతెన పనులు త్వరగా చేపట్టాలని, తాత్కాలిక మట్టి రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని, ఈనెల 13వ తారీఖున డిగ్రీ కాలేజ్ ఎగ్జామ్స్ ఉన్నందున, తాత్కాలిక మట్టి రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని, ఇతర గ్రామాల నుండి మండలాల నుండి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని, సమయానికి పాఠశాలకు వెళ్లలేకపోతున్నారని, విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని తెలిపారు, తాసిల్దార్ మారుతి రెడ్డి , ఏ ఎస్ఐ శ్రీనివాస్,చేరుకొని, రెండు మూడు రోజుల్లో తాత్కాలిక మట్టి రోడ్డు చేపడతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు,

**మాట అని మరిచిపోతారు డిగ్రీ కాలేజ్ విద్యార్థులు**

ధర్నా కార్యక్రమంలో తాసిల్దార్ మారుతి రెడ్డి నీ ప్రశ్నించిన విద్యార్థులు, తాత్కాలిక మట్టి రోడ్డు పనులు రెండు మూడు రోజుల్లో పూర్తి చేస్తామని తెలుపగా, విద్యార్థులు"మాట ఇచ్చి అని తప్పుకుంటారని విద్యార్థులు ఆవేదనతో ప్రశ్నించారు, తాసిల్దార్ మారుతి రెడ్డి తప్పకుండా నాలుగైదు రోజుల్లో మరమ్మత్తులు చేపడతామని తెలిపారు,ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు, ప్రజలు, పాల్గొన్నారు

# ప్రజావాణిలో 80 దరఖాస్తులు

- ప్రజావాణి అర్జీలకు అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలి
- జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 10 (జనం సాక్షి) :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం లో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్లు విక్టర్, మదన్ మోహన్, డిప్యూటి కలెక్టర్ రవితేజ, ఆర్డీఓ లు కామారెడ్డి వీణ, , ఎల్లారెడ్డి పార్థసారథి రెడ్డి లతో కలిసి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు తమ వినతులు,ఫిర్యాదులు అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అర్జీదారుల సమస్యలను ఓపిగ్గా వింటూ సంబంధిత ఆయా శాఖ జిల్లా ఆధికారులకు అర్జీలను ఇస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిధిలో పరిష్కరించగలిగిన వాటిని వెంటనే పరిష్కరించాలని,పరిధికి సంబంధించినవి కాని అంశాలపై దరఖాస్తుదారులకు సరైన సూచనలు అందించాలని తెలిపారు. అలాగే ప్రజావాణి పెండింగ్‌లో ఉన్న ఆయా జిల్లా అధికారులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 80 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ప్రజావాణి లో ఆయా జిల్లా అధికారులు, రెవెన్యు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జీవితంలో ప్రతిఒక్కరు యోగా ఆచరించాలి

**ఆరోగ్యవంతులుగా ఉండాలి : ఆర్‌జీ-1 జీఎం డి.లలిత్‌కుమార్**



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ఆదేశానుసారం సింగరేణి సంస్థలో పనిచేసే ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు హైదరాబాద్ యోగా గురువు 'శ్రీషణ్ముక శివచంద్ర' 'ప్రాచీన యోగా దినచర్య' కార్యక్రమం 'మిషన్ హెల్తీ సింగరేణి' కార్యక్రమం స్థానిక ఆర్‌సిఓఏ క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్‌జీ-1 డి.లలిత్ కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత-లలిత్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లడుతూ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు ప్రతిఒక్కరు సమాజంలో గుడ్‌ఫ్యామిలీ, గుడ్‌వర్కర్‌గా యోగాతో కలుగు ఫలితాల గురించి చైర్మన్ ఏర్పాటు చేశారన్నారు. దానిని ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు దైనందిన జీవితంలో ప్రతిఒక్కరు యోగ ఆచరించి ఆరోగ్యవంతులుగా ఉండాలని తెలిపారు. ఆలాగే యోగా గురువు 'శ్రీషణ్ముక శివచంద్ర' హైదరాబాద్ వారి సుదీర్ఘ అనుభవం 15 సంవత్సరాల శాస్త్రీయ పరిశోధన అవగాహన కార్యక్రమంలో భాగంగా యోగాతో కలుగు ఫలితాలు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన చిన్నపాటి సూక్ష్మ వ్యాయామాల మీద జబ్బుల నివారణ తదితర వాటి మీద అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రామంలో ఆర్‌జీ-1 జీఎం డి.లలిత్‌కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత-లలిత్‌కుమార్, ఆర్‌జీ రీజియన్ క్వాలిటి జీఎం సుజోయా ముజుందార్, ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరి అరెల్లి పోషం, యస్ఓ టు జియం చంద్రశేఖర్, సియంఓఐఏ అధికారుల ప్రతినిధి క్రాంతికుమార్,పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పివో హన్మంతరావు, లేడిస్ క్లబ్ సెక్రటరి శిరీష,సేవా జాయింట్ సెక్రటరి రజిత, డాక్టర్ కారం పద్మ, డిప్యూటి మెడికల్ ఆఫీసర్ ప్రసన్న, అధిక సంఖ్యలో ఉద్యోగులు,సేవా సభ్యులు,పారిశ్రామిక ప్రాంతవాసులు పాల్గొన్నారు.

**మధ్యాహ్న భోజనం వికటించి**

# 17 మంది విద్యార్థులకు అస్వస్థత





- అధికారుల నిర్లక్ష్యం వలన తమ పిల్లలు అస్వస్థతకు గురయ్యారని తల్లిదండ్రుల ఆరోపణ

**జమ్మికుంట, నవంబర్ 10 (జనం సాక్షి):** మధ్యాహ్న భోజనం వికటించి 9 మంది బాలికలలు 8 మంది బాలురు అస్వస్థతకు గురైన సంఘటన జమ్మికుంట పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే జమ్మికుంట ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల లో సోమవారం విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత మొదట ముగ్గురు వాంటింగ్ చేసుకున్నారు, ఆ తర్వాత మిగతా విద్యార్థులు కడుపు నొస్తుందని చెప్పడంతో హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మధ్యాహ్న భోజనంలో నాసిరకం గుడ్లు పెట్టడం వలన విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని అధికారుల నిర్లక్ష్యం వల్ల తమ పిల్లలు అస్వస్థకు గురయాలని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న మండల విద్యాధికారి ఇతర ప్రభుత్వ అధికారులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని విద్యార్థులకు అందుతున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లోపం పై దర్యాప్తు చేపడతామని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వారు తల్లిదండ్రులకు ఆమె ఇచ్చారు.

**విద్యార్థుల అస్వస్థత పై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరా:**

ఈ విషయమై జిల్లా కలెక్టర్ ప్రమీల సత్పతిని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వారి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పరిస్థితి బాగానే ఉందని ఆరోగ్యం నిలకడగానే ఉందని కలెక్టర్ బండి సంజయ్ కి వెల్లడించారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని బండి సంజయ్ కలెక్టర్ కు సూచించారు.

# అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య

**తంగళ్ళపల్లి నవంబర్ 10 (జనం సాక్షి) :** అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి కింది మచ్చ జలంధర్ 60(సంఎ) లు అనే వ్యక్తి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని మృతి చెందిన సంఘటన తంగళ్ళపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మృతుని భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత మూడు సంవత్సరాల నుండి తన భర్త కీళ్ల నొప్పులు, నరాల బలహీనత, బీపీతో బాధపడుతూ ఉన్నాడు. అతనికి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఎన్నో ఆసుపత్రులకు వెళ్లిన అతని ఆరోగ్యం కుదుటపడలేదు. సోమవారం మధ్యాహ్నం చుట్టుపక్కల ఎవరూ లేని సమయంలో తన ఇంటి వద్ద పెట్రోల్ పోసుకొని మృతి చెందాడని అతని మరణం పై ఎలాంటి అనుమానం లేదని మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు తంగళ్ళపల్లి ఎస్సై ఉపేంద్ర చారి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించిన కేంద్ర మంత్రి బండి

- 5 జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే 12 వేల మంది విద్యార్థులకు ఫీజు చెల్లించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 10 (జనంసాక్షి):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సోమవారం రోజు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ పరీక్ష ఫీజు చెల్లించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 12 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. వీరిలో కరీంనగర్ జిల్లాలో 4,363, సిరిసిల్ల జిల్లాలో 3948, సిద్దిపేట జిల్లాలో 1013, జగిత్యాల జిల్లాలో 1434, హన్మకొండ జిల్లాలో 690 మంది విద్యార్థులున్నారు. వీరందరి పక్షాన పరీక్ష ఫీజు మొత్తాన్ని బండి సంజయ్ చెల్లించారు. కేంద్ర మంత్రి తరపున కరీంనగర్ జిల్లాలో చదివే విద్యార్థల పరీక్ష ఫీజు మొత్తాన్ని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ రావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి చెక్ రూపంలో అందజేశారు. అట్లాగే సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిని గోపీ ఆధ్వర్యంలో జిల్లా నేతలు గరీమా అగర్వాల్ ను కలిసి చెక్ అందజేశారు. సిద్దిపేట జిల్లా విద్యార్థుల పక్షాన బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, జగిత్యాల, హనుమకొండ జిల్లాల విద్యార్థుల పక్షాన ఆయా జిల్లాల బీజేపీ నేతలు ఆయా కలెక్టర్లను కలిసి పరీక్ష ఫీజు మొత్తాన్ని చెక్ రూపంలో అందజేయడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారే కావడం, వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్ష ఫీజు కూడా చెల్లించలేకపోతున్నారని తెలుసుకున్న బండి సంజయ్ ఈ మేరకు తన వేతనం నుండి ఆ మొత్తాన్ని చెల్లిస్తానని ఇటీవల ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారు. అనుకున్నట్లుగా ఆ మొత్తాన్ని చెక్ రూపంలో అందజేశారు. అతి త్వరలోనే "మోదీ గిఫ్ట్" పేరుతో సర్కారీ స్కూళ్లలో 9వ తరగతి చదువుకునే విద్యార్థులకు సైతం సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. అట్లాగే వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలోనే 'మోదీ కిట్స్' పేరుతో 1 నుండి 6వ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్ను, పెన్సిళ్లు, స్టీల్ వాటర్ బాటిల్ ను పంపిణీ చేయనున్నట్లు ఇప్పటికే బండి సంజయ్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# సెంట్రల్ లైటింగ్ సమస్య.. వెంటనే రిపేర్ చేయాలి

- కలెక్టర్‌కు మెమోరాండం, మున్సిపల్ కమిషనర్‌కు వార్నింగ్
- మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడాలి
- కాంట్రాక్టర్‌ను మార్చాలి
- సిపిఎం పట్టణ నాయకులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రేణుక



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 10 (జనం సాక్షి) :** సెంటర్ లైటింగ్ వెంటనే రిపేర్ చేసి పెట్టడానికి వెలుతురు ఇవ్వాలని మాజీ మున్సిపల్ కౌన్సిల్ రేణుక అన్నారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రేణుక పాత 24వ వార్డు మాట్లాడుతూ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల కామారెడ్డి పట్టణం మెయిన్ రోడ్డు మొత్తం కూడా చీకట్లో మగ్గుతుందని అన్నారు. హౌసింగ్ బోర్డ్, జిఆర్ కాలనీ, కౌండిన్య కాలనీ, లక్ష్మీ నగర్, బృందావన్ కాలనీ, వికాస్ నగర్, ఆర్.బి నగర్‌లతో పాటు కామారెడ్డి పట్టణంలోని నరసన్నపల్లి ఎంట్రన్స్ నుండి టేక్రియాల్ వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం బందు అయి 8 నెలలు దాటిపోతున్నదనీ మెయిన్ రోడ్డు మొత్తం చిమ్మ చీకటిలో మగ్గిపోతున్న మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారని అన్నారు. ఈరోజు ఈ విషయంపై కలెక్టర్‌కి ప్రజావాణి లో మెమొరండం ఇవ్వడం జరిగిందని కలెక్టర్ స్పందించి కమిషనర్‌ని రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారని, తెలిపారు. గత 8 నెలలుగా సెంట్రల్ లైటింగ్ సిస్టం బంద్ ఉందనేది కామారెడ్డి ప్రజలందరికీ తెలుసని ప్రధానంగా మహిళలు విద్యార్థినులు పిల్లలతో పాటు అందరూ ఇబ్బందులు పడుతున్నారని కానీ వరద వచ్చిన నాటి నుండే సెంట్రల్ లైటింగ్ సమస్య వచ్చిందని చెప్పడం లో కమిషనర్ అబద్దాల తనం కనిపిస్తుందని అన్నారు. పండగలు అన్నీ కూడా చీకట్లోనే చేసుకోవాల్సిన దుర్గతిని కామారెడ్డి పట్టణ ప్రజలకు మున్సిపల్ అధికారులు పట్టించారని అన్నారు. కాలనీలో కూడా వీధిలైట్లు సమస్యతో దొంగల బాధ పెరిగిందని అట్లాగే పాములు విష జంతువులు తిరుగుతున్నాయని ప్రజలు వాటి బారిన పడుతున్నారని అన్నారు. వెంటనే కాంట్రాక్టర్ మార్చి సెంట్రల్ లైటింగ్ సిస్టం ను సరిచేయాలని లేకుంటే మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తో పాటు మోహన్ పటేల్ దశరథ్ సత్యం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్స్ సత్ప్రవర్తనతో మెలగాలి

## నేర ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు

**హుజురాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్**



**శంకరపట్నం నవంబర్ 10 (జనంసాక్షి) :** శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్‌కు హుజురాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్ కేశవపట్నం పోలీస్ స్టేషన్ లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. వారి జీవన విధానంతో పాటు, ప్రస్తుత వారి కుటుంబం స్థితిగతులను గురించి అడిగి తెలుసుకుని, గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వారు నేర ప్రవృత్తిని వీడి మంచి ప్రవర్తనతో జీవించాలన్నారు. శాంతి భద్రతలకు, ప్రజల స్వేచ్ఛ, హక్కులకు భంగం కలిగిస్తూ, వారిపై దాడులకు పాల్పడితే సహించేది లేదని, తీరు మారకపోతే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లపై పిడి యాక్ట్ పెట్టేందుకు సైతం వెనకాడమన్నారు. ప్రతి 6 నెలలకు ఒక్కసారి చెడు ప్రవర్తన కలిగిన వారిని బైన్డోవర్ చేయడం వలన వారిపై పోలీస్ నిఘా ఉంటుంది కాబట్టి వారి కదలికలు, ప్రవర్తన గురించిన విషయాలు తెలుసుకొవడం జరుగుతుందని, బైండొవర్ కాలంలో మారో నేరంకు పాల్పడితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా పడడం జరుగుతుంది వారికి సూచించారు. ప్రతి ఒక్కరు సత్ప్రవర్తనతో మెలగాలని, చట్టవిరుద్ధంగా పని చేసే వారి పట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తామని, సమాజానికి హాని కలిగించే విధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు చేపడతమని ఉద్బోదించారు. ఈ కార్యక్రమములో కేశవపట్నం ఎస్సై శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# సీడ్ కంపెనీ ఎదుట రైతుల వంటావార్పు

## సీడ్ కంపెనీ ఎదుట బైఠాయించిన రైతులు

**తమకు రావాల్సిన డబ్బులు చెల్లించేంత వరకు ఆందోళన విరమించబోమని డిమాండ్**



**శంకరపట్నం నవంబర్ 10 (జనంసాక్షి) :** వరి ధాన్యం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శంకరపట్నం మండలం కేశవపట్నంలోని పాటూరి సీడ్ కంపెనీ ఎదుట పలు గ్రామాలా రైతులు సోమవారం వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. వివిధ మండలాల రైతులు భారీగా తరలివచ్చిన సీడ్ కంపెనీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కంపెనీ ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరీంనగర్ జనగామ, పెద్దపల్లి, జిల్లాల్లోని 80 మందికి పైగా రైతులు కంపెనీని నమ్ముకుని గత రబీ సీజన్లో 300 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు తెలిపారు. ధాన్యాన్ని తీసుకున్న సదరు యాజమాన్యం డబ్బులు ఇవ్వడంలో జాప్యం చేస్తుందని ఆరోపించారు. దాదాపు 70 లక్షల రూపాయలు రైతులకు రావాల్సి ఉందని, యాజమాన్యం గత ఎనిమిది నెలలుగా బుకాయిస్తూ రైతులను మోసం చేస్తుందని ఆరోపించారు వీరితోపాటు వీరికి సీడ్ పంపిని చేసిన సీడ్ ఆర్గనైజర్ మహిపాల్ రెడ్డి రైతులతో పాటు బయటాయించి రైతులకు కంపెనీ నుంచి రావాల్సిన మిగతా మొత్తం చెల్లించేంత వరకు అక్కడి నుంచి కదిలేదే లేదని కంపెనీ యాజమాన్యానికి చరవాణి ద్వారా తెలియజేశారు. ఇలా రైతులను మోసం చేసే సీడ్ కంపెనీల నుంచి రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రజా సంఘాల నాయకులు సూచించారు.

*15వ తేదీ వరకు జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ టి.కిరణ్‌కుమార్ అన్నారు. పంతాలు, పట్టింపులకు పోకుండా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అవసరం కొద్దో ఆవేశం కొద్దో పెట్టుకున్న కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోవచ్చని తెలిపారు.*

# అందెశ్రీ మరణం తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు : ఏజిపి పసుల కృష్ణ



**ఎల్లారెడ్డిపేట, నవంబర్ 10, (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమంలో ప్రజలను ఏక దాటికి తీసుకురావడానికి సాహిత్య ఉద్యమం ఎంతో ఉపయోగపడిందని, జయ జయహే జయహే తెలంగాణ అనే పాట విశేషమైన గుర్తింపు తీసుకొచ్చిందని ఏజిపి పసుల కృష్ణ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద సోమవారం సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏజిపి పసుల కృష్ణ మాట్లాడుతూ విప్లవ గాయకుడు గద్దర్, గోరటి వెంకన్న, ప్రొఫెసర్ జయశంకర్ తరువాత అందెశ్రీ పాత్ర తెలంగాణ ఉద్యమంలో ముఖ్యపాత్ర ఉందన్నారు.అందెశ్రీ వరంగల్ జిల్లా మద్దూరు మండలం, లేబర్తి గ్రామంలో జన్మించారన్నారు. మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు అనే పాటతో ప్రజలందరి హృదయాలను దోచుకున్నాడన్నారు. అదేవిధంగా జయ జయమే తెలంగాణ జనని జయకేతనం గీత రచయిత అందెశ్రీ పరమపదించడం పట్ల తెలంగాణ వివేక రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ వాసరవేణి పర్శరాములు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీతో తనకు అనుబంధం ఉందని, ఒక ఆత్మీయుడిని కోల్పోయామని, తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ తనను సాహిత్య రచనలు చేయాలని ప్రోత్సహించారనీ, బాల సాహిత్యం రాయడం అతి కష్టమైన పని అని బాలసాహిత్యంలో ముందుకు సాగిపోవాలని అనేకసార్లు చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ఏలూరి రాజయ్య, బండారి బాల్‌రెడ్డి, రొడ్డ రాంచంద్రం, కదిరే శ్రీనివాస్ గౌడ్, మీసం రాజం, సయ్యద్ లాల్ మహ్మద్, దుంపెన రమేష్, గుండాడి వెంకట్‌రెడ్డి, గుడ్ల శ్రీనివాస్, ఉప్పుల రవి, రమేష్ యాదవ్, సిరిపురం మహేందర్, చకినాల కృష్ణలు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

- కొనుగోలు కేంద్రం, పాఠశాల, ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 10, (జనంసాక్షి) : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాగట్లపల్లిలో సోమవారం ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంతవరకు ఎంత ధాన్యం వచ్చింది ఎంత కొనుగోలు చేశారు అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇంచార్జీ కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్, నీటి, విద్యుత్ సరఫరా వసతి కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చర్యలు చూసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సరైన తేమ వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. అనంతరం మండలంలోని రాగట్లపలి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి బోర్డుపై పేర్లు రాయించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని, విద్యార్థులతో నిత్యం చదివించడం, రాయించాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ద పెట్టాలని




పేర్కొన్నారు. మండలంలోని సింగారం గ్రామంలో నిర్మాణం అవుతున్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ పరిశీలించారు. ఇంటి నిర్మాణం, ప్రభుత్వ ఆర్థిక సహాయంపై తెలుసుకున్నారు. లబ్దిదారులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు అయిన లబ్దిదారులు త్వరితగతిన పనులు పూర్తి చేసుకోవాలని, ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇండ్ల నిర్మాణంపై అధికారులు అవగాహనా కల్పించి, పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, డిప్యూటి తహాశీల్దార్ మురళి, ఎంపిఓ రాజులు ఉన్నారు.

# రైస్ మిల్లర్ల దోపిడీని వెంటనే అరికట్టాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి**

జమ్మికుంట, నవంబర్ 10 (జనం సాక్షి): జమ్మికుంట మండల పరిధిలోని రైస్ మిల్లర్లు అన్నదాతలను నిలువునా దోపిడీ చేస్తున్నారని వారి దోపిడీని వెంటనే అరికట్టాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం రోజున సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు సెంటర్లను సందర్శించి కొనుగోళ్ల తీరును పరిశీలించారు.ఒక్కో సంచికి అదనంగా రెండు నుండి మూడు కిలోలు కాంటా వేస్తూ క్వింటాల్కు ఐదు నుండి 8 కిలోలను అదనంగా రైస్ మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారని ఇదేమని రైతులు ప్రశ్నిస్తే మీ దిక్కున్న చోట చెప్పుకొండని మీ ధాన్యం మాకొద్దని ఎగతాళి చేస్తున్నారని రైతులు వాపోతున్నారన్నారు.

సెంటర్ నిర్వాహకులను సైతం ఇబ్బందులు పెడుతున్న రైస్ మిల్లర్లపై జిల్లా విజిలెన్స్ శాఖ వెంటనే తనిఖీలు నిర్వహించి అవినీతికి పాల్పడుతున్న రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సెంటర్ కు సంబంధం లేకుండా నేరుగా తక్కువ ధరకు రైతుల నుండి కొనుగోలు చేస్తున్న రైస్ మిల్లర్లపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గన్నీ సంచులు తిరిగి ఇవ్వకుండా కోట్లలో సొమ్ము చేసుకుంటున్న రైస్ మిల్లర్లపై జిల్లా కలెక్టర్ స్పందించి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.ఐకెపి కొనుగోలు సెంటర్లలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తార్పాలిన్లు, మంచినీరు, దారం, గన్ని సంచులు, రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. తేమశాతంతో నిమిత్తం



లేకుండా వరిధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. గత రబీ సీజన్ సన్నధాన్యం బోనస్ నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఆరు నెలలు గడిచిన బోనస్ గురించి ఊసే లేదన్నారు.ఈ సీజన్ లో సన్న వడ్లు అమ్ముకుంటున్న రైతులకు బోనస్ రూపాయలు క్వింటాల్కు 500 నేరుగా రైతుల అకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.ఇలాంటి సమయంలో రైతులకు అందించాల్సిన ఏ సహకారాన్నీ ఆపకూడదనీ ఆలస్యం చేయకూడదన్నారు. అన్నదాతలను నిలువునా దోపిడీ చేస్తున్న రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.రైస్ మిల్లర్ల దోపిడీపై జిల్లా కలెక్టర్, మరియు అదనపు కలెక్టర్లకు ఫిర్యాదులు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శీలం అశోక్, మండల కమిటీ సభ్యులు వడ్లూరి కిషోర్, జక్కుల రమేష్ యాదవ్,దండిగారి సతీష్,సంపత్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# 42% బిసి రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

- బిఎల్‌పి ఆధ్వర్యంలో కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం ముందు దర్నా.. జెసికి వినతిపత్రం.

**కామారెడ్డి జిల్లా ప్రతినిది నవంబర్ 10 (జనం సాక్షి) :**
బిసిలకు 42% విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు సోమవారం బిఎల్ పి కామారెడ్డి జిల్లా కమిటి,ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు దర్నా చేసి కలెక్టర్ లేనందున జెసికి వినతి పత్రం అందజేసినారు,ఈ విషయం కేంద్ర ప్రభుత్వానికి వినతి పత్రాన్ని పంపించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యస్, సిద్ధిరాములు, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు, నాగారపు యెల్లయ్య, జిల్లా కార్యదర్శి, వడ్ల సాయి కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మార్చ్ 2025లో బిసి కులాల ప్రజలకు విద్య,ఉద్యోగ, స్థానిక సంస్థల్లో42% రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర అసెంబ్లీలో బిల్లులను ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర గవర్నర్‌లకు పంపి 7 నెలల అవుతున్న కేంద్ర ప్రభుత్వం వద్ద గత 7 నెలలుగా పెండింగ్‌లోనే ఉన్నదన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బిసి బిల్లులను 9వ షెడ్యూల్ లో చేర్చుందకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని,కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ,బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్ పి రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ లకు ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ఈ కింద పేర్కొన్న విధంగా డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని




పంపాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం వద్ద 7 నెలలుగా పెండింగ్ లో 42% బిసి కులాల ప్రజలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల బిల్లులను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చి పార్లమెంట్ లో చట్టం చేయాలి 42% బిసి కులాల రిజర్వేషన్లలో ఏ.బి.సి.డి,ఈ వర్గీకరణతో చట్టం చేయాలి కామారెడ్డి బిసి డిక్లరేషన్ ప్రకారం సంవత్సరానికి రూ 20 వేల కోట్ల బిసి కులాల ప్రజల విద్య ఉద్యోగ ఉపాధి కోసం రెండు సంవత్సరాలకుగానూ వెంటనే 40,000 వేల కోట్ల రూపాయలు విడుదల చేయాలి రాష్ట్రంలోని నిర్మాణ రంగం తోపాటు అన్ని రకాల ప్రభుత్వ కాంట్రాక్టులలో బిసి కులాల ప్రజలకు వర్గీకరణతో కూడిన 42% రిజర్వేషన్లు అమలు చేయాలి రాష్ట్రంలోని అన్ని నామినేటెడ్ పదవుల్లో 90% బిసి,ఎస్సీ, ఎస్టీల తోనే భర్తీ చేయాలని దండి వెంకట్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ జిల్లా నాయకులు ,స్వామి, గంగాధర్, గంగమణీ, స్వప్న, లక్ష్మి, చిన్న లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారం ఎప్పుడో..

**గంభీరావుపేట నవంబర్ 10 (జనం సాక్షి):**
భూ సమస్యలను పరిష్కరిస్తామంటూ ధరణి స్థానంలో భూ భారతిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చింది. భూభారతి లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ క్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంతో పాటు వివిధ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు,కొత్త చట్టంతో తమ భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని పలువురు భూభారతి లో భాగంగా చేపట్టిన కార్యక్రమంలో దరఖాస్తులు అందజేశారు,

### కేవలం ప్రచారం కోసమేనా..?

భూభారతిలోస్వీకరించిన దరఖాస్తులను పరిష్కారం చేసి అది సక్సెస్ అయిందని భావించిన తర్వాతనే ఇతర ప్రాంతాల్లో సదస్సులను నిర్వహించాలని చెబుతున్నారు. అదేం లేకుండానే ప్రభుత్వం ఆదేశం ఇచ్చింది కదా.. సదస్సులను ప్రోటోకాల్ ప్రకారం నిర్వహించేసి ఫొటోలు, వీడియోలు తీసుకొని ఉన్నత అధికారులకు పంపించుకుని మామ అనిపించుకునే



విధంగా అధికారుల తీరు ఉండబోతుందని పలువురు విమర్శిస్తున్నారు. కేవలం ప్రచారం కోసం మాత్రమే సదస్సులను నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై నిర్వహించే రెవెన్యూ సదస్సులలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేసే దరఖాస్తులను పరిశీలించి సమస్యను తీర్చాలని కోరుతున్నారు

# కంపెనీ మనుగడకు పనిసంస్కృతి మెరుగుపరచండి

- 39వ నిర్మాణాత్మక సమావేశంలో సీఎండీ ఎన్.బలరామ్
- సింగరేణి సుస్థిర భవిష్యత్‌కు సంపూర్ణ సహకారం అందిస్తాం
- సింగరేణిని విశ్వవ్యాప్తం చేస్తున్న సీఎండీకి ధన్యవాదాలు
- గుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**గోదావరిఖని, జనంసాక్షి :**
రాష్ట్ర ప్రభుత్వ దిశా నిర్దేశంలో అంతర్జాతీయ సంస్థగా ఎదుగుతున్న సింగరేణికి సుస్థిర భవిష్యత్ అందించడానికి ప్రతీ ఉద్యోగి భాగస్వామి కావాలని, ముఖ్యంగా పని సంస్కృతిని మెరుగు పరుస్తూ ప్రతీఒక్క ఉద్యోగి తనకు కేటాయించిన షిఫ్ట్‌లో 8 గంటల పూర్తి సమయాన్ని కంపెనీ కోసం పనిచేసేందుకు యాజమాన్యం తీసుకుంటున్న చర్యలకు గుర్తింపు కార్మిక సంఘం సహకారం అందించాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ కోరారు.సోమవారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో గుర్తింపు కార్మిక సంఘం అయిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌తో జరిగిన 39వ నిర్మాణాత్మక సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు రంగంలో పోటీని తట్టుకునేందుకు బొగ్గు ధరలను తగ్గించామని,ఈ నేపథ్యంలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం అనివార్యమని, అప్పుడే సంక్షేమ కార్యక్రమాలను కూడా కొనసాగించడానికి, ఉపాధి కల్పనకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించాలంటే ఉద్యోగులు పూర్తి పని గంటలు సద్వినియోగం చేస్తూ యంత్రాలను పూర్తిగా వినియోగించాలన్నారు.విధులకు గైర్హాజరు అవుతున్న కార్మికులు విధులకు హాజరయ్యేలా అవగాహన కల్పించాలని, తద్వారా క్రమశిక్షణను పెంచడం సాధ్యమవుతుంద న్నారు. రక్షణ, నాణ్యత పెంపుదలకు మరింత కృషి జరగాలన్నారు. సింగరేణి సంస్థ రానున్న రోజుల్లో దేశంలోని 10 రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహించేలా విస్తరణ ప్రణాళికలు రూపొందించు కుని ముందుకు సాగుతున్నట్లు సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. బొగ్గు రంగానికే పరిమితమైన సంస్థను 5వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి చేసేలా తీర్చిదిద్దేందుకు వీలుగా సింగరేణి గ్రీన్ ఎనర్జీ,అలాగే విశ్వవ్యాప్తంగా కీలక ఖనిజ అన్వేషణ, మైనింగ్కు సింగరేణి గ్లోబల్ లిమిటెడ్ కంపెనీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సింగరేణిలో ఉన్న 40 వేల మంది ఉద్యోగులు, సంస్థపై ఆధారపడిన 30 వేల మంది కాంట్రాక్టు కార్మికుల భవిష్యత్ దృష్ట్యా కొత్త బొగ్గు గనులను వేలంలో దక్కించుకోవడానికి కృషి చేస్తున్నామని, తద్వారా సింగరేణికి మరో వందేళ్ల భవిష్యత్ ఉంటుందన్నారు.

### రూ.300 కోట్ల వ్యయంతో వెయ్యి క్వార్టర్ల నిర్మాణం..

సింగరేణి ఉద్యోగులకు దేశంలోనే ఏ కంపెనీలో లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని,వీటిని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు.ఉద్యోగులకు విశాలమైన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణం కోసం 300 కోట్లకు పైగా వెచ్చించి గోదావరిఖని, శ్రీరాంపూర్, మణుగూరు, కొత్తగూడెం,భూపాలపల్లి తదితర ప్రాంతాల్లో వెయ్యి క్వార్టర్ల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.అలాగే అత్యాధునిక వైద్య సేవలు అందించడానికి గోదావరిఖనిలో వచ్చే రెండు నెలల్లో క్యాథ్ ల్యాబ్ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు కోసం చర్యలు తీసుకున్నట్లు వివరించారు.ఉద్యోగుల పిల్లలకు జాతీయ స్థాయి విద్యా బోధనను అందించేందుకు ఇప్పటికే రామగుండం-2 ఏరియాలో సీబీఎస్ఈ స్కూల్ను ప్రారంభించామని,ఇతర ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఉద్యోగుల సంక్షేమం తమబాధ్యత అని,కానీ కంపెనీ మనుగడ విషయంలో పని సంస్కృతిని మెరుగుపరిచే బాధ్యతను పంచుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో పాల్గొన్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సింగరేణిని అంతర్జాతీయ కంపెనీగా తీర్చిదిద్దడానికి సీఎండీ ఎన్.బలరామ్ తీసుకుంటున్న చొరవను ప్రత్యేకంగా అభినందించారు.సింగరేణిని కాపాడటానికి తమ యూనియన్ తరఫున ఎన్నో త్యాగాలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని రూపొందించాలని, కొత్తగూడెంలో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. విశ్రాంత కార్మికులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలన్నారు.కొత్తగూడెం భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని అక్కడ సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ పవర్ ప్లాంటును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.సింగరేణి పుట్టినిల్లు అయిన ఇల్లందు భవిష్యత్ కోసం కొత్త ప్రాజెక్టును త్వరగా ప్రారంభించాల్సిందిగా కోరారు. సింగరేణిలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికుల కోసం ఈఎస్ఐ సేవలు అందించేందుకు యాజమాన్యం తీసుకున్న చొరవను అభినందించారు.అలాగే కొత్తగూడెం బస్టాండ్ ఆధునికీకరణ కోసం సామాజిక బాధ్యత నిధులను కేటాయించిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు.సంస్థ ఛైర్మన్ ఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ గుర్తింపు కార్మిక సంఘం ద్వారా వివరించిన సమస్యలపై నిబంధనల మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని,ఆర్థిక పరమైన సమస్యలపై కమిటీలు వేసి చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమానికి డైరెక్టర్(పర్సనల్) గౌతమ్ పొట్రు స్వాగత ఉపన్యాసం చేశారు.డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (పి అండ్ పి),ఎం.తిరుమల రావు (ఈ అండ్ ఎం), జీఎం(కో-ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, జీఎం (పర్సనల్) ఐఆర్, పీఎం కవితానాయుడు,ఇతర జీఎంలు పాల్గొన్నారు. గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ రాజ్‌కుమార్, వివిధ ఏరియాల నుండి హాజరైన గుర్తింపు కార్మిక సంఘం ప్రతినిధులు అనేక సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు.ఈ సమావేశంలో పాల్గొన్న కార్మిక నాయకులు కొందరు మాట్లాడుతూ సంస్థ ఛైర్మన్ ఎన్.బలరామ్ ఎంతో సాదాసీదాగా కార్మికులతో కలిసిపోయి వారి సమస్యలు తెలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.ఒక ఛైర్మన్‌గా కంటే ప్రజల మనిషిగా కార్మికుల్లో ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు.



# సైబర్ జాగృత్ భారత్-2025పై సమీక్షా

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి జీఎం కార్యాలయ సమావేశమందిరంలో సైబర్ సెక్యూరిటీ.. సైబర్ జాగృత్ భారత్- 2025 నేరాలపై అధికారులు..ఆర్జీ-1 ఏరియా సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు.ఈ సందర్బంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు.సమావేశానికి ముఖ్య అతిధిగా జీఎం డి.లలిత్‌కుమార్ హాజరయ్యారు.జీఎం మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ..సైబర్ జాగృత్ నేరాల గురించి ప్రస్తుతం ప్రతిఒక్కరి జీవితంలో తెలుసుకోవలసిన ముఖ్య విషయమని తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 6000 వేలకుపైగా కంప్యూటర్లను వాడుతున్నామని, సుమార్ 350 కిలో మీటర్లదూరం కమ్యునికేషన్ నెట్‌వర్క్ విస్తరించి ఉందన్నారు.ఇంతటి విస్రుత కమ్యునికేషన్ నెట్‌వర్క్ వ్యవస్థ ఉన్నప్పటికీ ఎక్కడ కూడా ఎలాంటి సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన సమస్య తలెత్తకుండా ఐటి డిపార్ట్‌మెంట్ ఎప్పటికప్పుడు పనిచేస్తుందని అన్నారు.ప్రస్తుతం పెరుగుతున్న టెక్నాలజీకితోడు సైబర్ నేరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయన్నారు.ప్రతిరోజు సైబర్ నేరస్తుల చేతిలో అమాయక ప్రజలు మోసానికి గురవుతున్నారని దీనికి కారణం వారికి సరైన అవహగన లేకపోవటం అని, ప్రతి ఒక్కరు కూడా కంపెని విలువైన విషయాలుగాని లేదా వారి నగదు సంబంధించి పర్సనల్ డేటాను అత్యంత గోప్యంగా ఉంచాలని సూచించారు.

డిజీఎం (ఐ.టి) కార్పోరేట్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ సైబర్ హైజిన్‌కు సంబందించి ప్రతి ఒక్కరు కూడా తప్పని సరిగా వ్యక్తిగత వివరాలను అత్యంగా గోప్యంగా ఉంచాలని, కంప్యుటర్‌లలో కాని స్మార్ట్‌ఫోన్‌లలో తప్పని సరిగా యాంటి వైరస్ ద్వారా ప్రొటెక్ట్ చేసుకోవాలని, అపరిచిత కాల్స్, లింక్‌లు, మెసేజ్‌లకు ఎటువంటి సమాదానం ఇవ్వవద్దని సూచించారు.వ్యక్తిగత శుభ్రత ఎంత ముఖ్యమో, సైబర్ పరిశుభ్రత కూడా చాల ముఖ్యమని, సైబర్ అటాక్‌లు జరుగకుండా ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ రీజియన్ క్వాలిటి జియం సుజోయా ముజుందార్, ఎఐటియుసి,బ్రాంచ్ సెక్రటరి అరెల్లి పోషం,యస్ఓటు జియం చంద్రశేఖర్, డిజిఎం (ఐ.టి) కార్పోరేట్.యన్.శ్రీనివాస్, ఐ.టి. మేనేజర్ నానపెర్నాన్‌వీస్, ఏజంట్స్ యల్.రమేష్, పివో రమేష్‌బాబు, ఎసియంవో డాక్టర్ అంబిక, ఏరియా ఇంజనీర్ రామ్‌మోహన్‌రావు, డిజియం (ఫైనాన్స్) ధనలక్ష్మిభాయి, లా అధికారి అఫ్రిన్‌సుల్తాన, ఐటి మేనేజర్ రాజేష్,సీనియర్ పిఒ శ్రావణ్‌కుమార్, ఇతర అధికారులు, జీఎం ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
11 నవంబర్ 2025

# సిటీ ట్రైనింగ్ సెంటర్‌కు శంకుస్థాపన

- భరోసా,కమాండ్ కంట్రోల్ సెంటర్‌లను ప్రారంభోత్సవం చేసిన డీజీపీ



**హైదరాబాద్: నవంబర్ 10 (జనంసాక్షి) :** డీజీపీ బి.శివధర్ రెడ్డి రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లిలో నిర్మించనున్న సిటీ ట్రైనింగ్ సెంటర్ (సిటిసి) కు సోమవారం నాడు శంఖుస్థాపన చేశారు. అదేవిధంగా కమిషనరేట్ పరిధిలోని సరూర్ నగర్‌లో భరోసా, కమాండ్ కంట్రోల్ సెంటర్ నూతన భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. రాచకొండ పోలీస్ కమిషనర్ శ్రీ జి. సుధీర్ బాబు, కమిషనరేట్ పోలీస్ పరిధిలోని డిసిపిలు ఇతర పోలీసు అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా మేడిపల్లిలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులతో సిటీ ట్రైనింగ్ సెంటర్ ను నిర్మించడానికి ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీంతోపాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి పోలీసు సిబ్బంది పిల్లల కోసం మంజూరు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణానికి సిఎస్ఆర్ పథకం ద్వారా సహాయం చేస్తామని హామీ ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్లో పోలీస్ సిబ్బంది పిల్లలతో పాటు ఇతరులకు కూడా 50% సీట్లను కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించినట్లు డిజిపి తెలిపారు. సిటీ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణంతో పోలీస్ సిబ్బంది కోసం వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలను నిర్వహించే అవకాశం ఉందని అన్నారు. నేరస్తులు సాంకేతికతో కూడిన వివిధ రకాల నేరాలకు పాల్పడుతున్నందున పోలీసు సిబ్బందికి తదనుగుణంగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. దీనికోసం, జిల్లాలోనూ శిక్షణ కేంద్రాలను నిర్మిస్తున్నామన్నారు. సైబర్ క్రైమ్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోను బలోపేతం చేసి ,వారికి అవసరమైన సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. 'అరైవ్, అలైవ్' పేరుతో వచ్చే డిసెంబర్ లో వాహనదారులకు, డ్రైవర్లకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నామని, దాని కోసం అన్ని వర్గాలవారు ముందుకు రావాలని డిజిపి కోరారు. రాచకొండ పోలీస్ కమిషనం సుధీర్ బాబు మాట్లాడుతూ మేడిపల్లి లో సిటీ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణానికి దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్ ఎం.డి. డాక్టర్ డివి మురళి కృష్ణ ప్రసాద్ ముందుకు రావడం పట్ల ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. మంచి వాతావరణం లో పోలీస్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను అందించేందుకు సిటిసి ఉపయోగపడుతుందని అన్నారు. దివీస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డి.మధుబాబు, సంస్థ జీయం సుబ్బారావు, రాచకొండ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధి గగన్ దీప్ రాచకొండ కమిషనర్ పరిధిలోని డిసిపిలు, అడిషనల్ డిసిపిలు తదితర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళల భద్రత కోసం భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర డిజిపి శ్రీ బి.శివధర్ రెడ్డి తెలిపారు. రాచకొండ పరిధిలోని సరూర్ నగర్ ప్రాంతంలో నిర్మించిన భరోసా కేంద్రాన్ని సోమవారం నాడు డిజిపి ప్రారంభించారు.

### అందెశ్రీ కి నివాళి అర్పించిన డిజిపి

డీజీపీ బి.శివధర్ రెడ్డి ప్రముఖ కవి అందెశ్రీ భౌతికకాయాన్ని లాలాగూడ ప్రాంతంలోని జిహెచ్ఎంసి మైదానంలో సోమవారం రాత్రి సందర్శించి నివాళి అర్పించారు. వారి కుటుంబానికి సానుభూతిని తెలిపారు. అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ జననీ జయకేతనం.. గేయం తెలంగాణ పాడుకొనే జాతి గీతంగా అందరి హృదయాలలో నిలిచిపోయిందని గుర్తు చేశారు.

# బీహార్ నాడి ఎవరికి అనుకూలం?

- తేజస్వీ పాచిక పారేనా
- ప్రశాంత్ కిశోర్ ప్రభావం చూపేనా
- నేటి పోలింగ్‌తో తీర్పు ఇవ్వనున్న బీహార్ జనతా



**పాట్నా,నవంబర్ 10 (జనంసాక్షి) :** మూడున్నర దశాబ్దాల క్రితం మండల్ ఉద్యమంతో ప్రభవించిన నాయకద్వయం లాలూప్రసాద్ యాదవ్, నితీశ్‌కుమార్ ల హవా దగ్గర పడుతోంది. బీహార్‌లోనూ రాజకీయాలు మారుతున్నాయి. లాలూ తనయుడు తేజ్వీ యాదవ్ సైతం రాజకీయాలను ప్రభావితం చేసే దశకు చేరుకున్నారు. ఒకప్పుడు లాలే, నితీశ్‌లు 'బ్రదర్స్ బిహారీ'గా సుప్రసిద్ధమయ్యారు. అయితే పరస్పరం పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వం, భిన్నమైన రాజకీయ ఆలోచనలు వారిలో ఉండేవి. తొలి జనప్రియ నాయకుడుగా అధికార అందలాలు ఎక్కిన లాలూప్రసాద్ యాదవ్ అన్నిరకాల గడ్డి కరిచారు. దీంతో భార్య రబ్రీదేవీని గద్దెపై కూచోబెట్టారు. అద్వానీని అరెస్ట్ చేసి ప్రచారంలోకి వచ్చారు. అయితే గడ్డిదాణా కేసుతో పాటు, అనేక కేసుల్లో జైలుజీవితం గడిపి ప్రస్తుతం వయసుమీద పడడంతో ఇంటికే పరిమితం అయ్యారు. దీంతో ఇప్పుడు శారీరకంగా బలహీనుడయ్యారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేక పోయారు. పార్టీ బాధ్యతలను పూర్తిగా కుమారుడు తేజస్వి యాదవ్‌కు అప్పగించారు. తేజస్వి నవతరం నాయకుడుగా యువతో మంచి ఫాలోయింగ్ దక్కించుకున్నారు. అయితే తండ్రిలో ఉన్న జన సమ్మోహన శక్తి ఈ యువనేతలో కానరాదు. అనేక ఉచిత పథకాలకు తోడు కాంగ్రెస్ కూటమిలో ఉంటూ అధికార పగ్గాలు అందుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. 1970 దశకంలో జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో జరిగిన విద్యార్థి యువజన ఉద్యమం నుంచి పుట్టుకు వచ్చిన నాయకుడు నితీశ్‌కుమార్. ఆయనా ఇప్పుడు వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ ఇద్దరూ ఒకప్పుడు కలసి రాజకీయాలు చేశారు. తరవాత విడివడి ఎవరి దారి వారు చూసుకున్నారు. ఇకపోతే బిహార్ ప్రజలను ఆకట్టుకోగల సమర్థ నాయకత్వం బిహార్‌లో బీజేపీకి లేదు. దీంతో ఇక్కడ బిజెపి ఒంటరిగా అధికారం దక్కించుకునే పరిస్థితి లేదు. దీంతో నితీశ్ నీడ ఎదుగుతూ వస్తోంది. భారత జాతీయ కాంగ్రెస్ బీహార్‌లో పూర్తిగా తుడిచి పెట్టుకుపోయిందనే చెప్పాలి. ఇప్పుడు ఈ పార్టీ దాదాపు అచేతన స్థితిలో ఉన్నది. ఇక యువ నాయకుడు ప్రశాంత్ కిశోర్ బిహారీలను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. జన్ సురాజ్ పార్టీతో ఈ వ్యూహకర్త ఎలాంటి అలజడి సష్టిస్తారా అన్నది చూడాలి. అయితే కులమే నిర్ణయాత్మక అంశంగా ఉన్న బిహార్ రాజకీయాలలో ఈ యువనేత జయపతాక ఎగురవేయగలడా? సంప్రదాయ అధికార నిర్మాణాలు, సామాజిక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఈ కొత్త నేత బిహార్ సమాజంలో మౌలిక మార్పులు తీసుకువస్తానని వాగ్దానం చేస్తున్నారు.ప్రజా జీవితంలో నైతిక విలువలకు నిబద్ధమైన నేతగా పేరుపొందిన నితీశ్‌కుమార్ ఇప్పుడు తన రాజకీయ మనుగడను కాపాడుకోవడంపైనే దృష్టి పెట్టారు. సైద్ధాంతిక విశ్వాసాల స్థానంలో అవకాశవాద రాజకీయాలు ప్రబలిపోయాయి. బిహార్‌లో సుదీర్ఘకాలంగా ముఖ్యమంత్రిగా ఉన్న నితీశ్ జోలికి ఏ విధంగానూ పోయేందుకు బీజేపీ సాహసించడంలేదు. బహిరంగంగాను, అంతర్గతంగాను సీనియర్ నాయకుడుగా ఆయన్ని గౌరవిస్తోంది. బిహార్‌లోని బీజేపీ శ్రేణుల్లో పాతకాలం నాటి అగ్రకులాల ఆధిపత్యం ఇప్పటికీ బలీయంగా ఉన్నది. 2015లో బీజేపీ బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో సొంతంగా అన్ని స్థానాలకూ పోటీ చేసింది. మోదీ హవా ఉధృతంగా ఉన్న ఆ కాలంలో కూడా బీజేపీ చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించలేకపోయింది. 2024 సార్వత్రిక ఎన్నికలలో సొంతంగా మెజారిటీ సాధించలేకపోవడంతో నితీశ్‌కుమార్‌ను బీజేపీ ఏమీ చేయలేకపోతోంది. సంకీర్ణ రాజకీయ ధర్మాన్ని అనుసరిస్తోంది. తనకు మద్దతు నిచ్చిన ప్రతి పార్టీ పట్ల సానుకూల వైఖరితో వ్యవహరించడాన్ని బీజేపీ అలవరచుకున్నది. 2029 సార్వత్రిక ఎన్నికలకు ఇంకా వ్యవధి ఉన్నప్పటికీ ప్రస్తుత దశలో నితీశ్‌ను తొలగించడం శ్రేయస్కరం కాదని బీజేపీ భావిస్తోంది. మొత్తంగా ఇప్పుడు త్రిముఖ పోటీ జరుగుతోంది. మంగళవారం తుదిదశ ఎన్నికలు జరుగున్నాయి. ప్రజలు ఎవరిని ఆదరిస్తారో..ఎవరిని తిరస్కరిస్తారో 14న తేలనుంది.

# కర్నాటక సిఎం మార్పుపై ఊహాగానాలు

- మీడియాకు మొహం చాటేసిన సిద్ధరామయ్య



**మైసూరు, నవంబర్10 (జనంసాక్షి) :** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎప్పుడు తన స్వస్థలం మైసూరు వచ్చినా విమానాశ్రయం వద్ద మీడియాతో ముచ్చటించడం ఆనవాయితీ. అయితే తొలిసారి ఆయన సోమవారంనాడు మైసూరు విమానశ్రయం వద్ద మీడియాను కలవకుండానే వెళ్లిపోయారు. కర్ణాటకలో సీఎం మార్పు జరుగనుందనే ఊహాగానాల నేపథ్యంలో సీఎం తొలిసారి మీడియాకు ముఖం చాటేయడం ఆసక్తికరంగా మారింది. సిద్ధరామయ్య మొదటి సారి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఎప్పుడు మైసూరులో అడుగుపెట్టినా విమానాశ్రయం వద్ద మీడియాతో సంభాషించడం పరిపాటి. సీఎం తాజా షెడ్యూల్ ప్రకారం మైసూరులో ఆయన రెండ్రోజుల పర్యటన జరపనున్నారు. మైసూరులోనే రాత్రి బస చేసి మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి బెంగళూరు బయలుదేరుతారు. మీడియాకు ఈ విషయం తెలియజేసిన సమాచార, ప్రజాసంబంధాల శాఖ వారికోసం ఉదయం 9.30 గంటలకు ఒక వాహనం కూడా ఏర్పాటు చేసింది. సీఎం 10.25 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే మీడియాతో మాట్లాడకుండానే ఆయన ముందుకు వెళ్లిపోయారు. కర్ణాటకలో సీఎం మార్పు, క్యాబినెట్ పునర్వవస్థీకరణ జరగనుందంటూ కొద్దికాలం వినిపిస్తున్న ఊహాగానాల మధ్య సీఎం చర్య మరోసారి చర్చనీయాంశమైంది. ముందుగా ఇచ్చిన హామీకి అనుగుణంగా పార్టీ ఏ క్షణంలోనైనా తనకు సీఎంగా అవకాశం కల్పిస్తుందని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ఆయన సోమవారంనాడు ఢిల్లీలోనే ఉన్నారు. నవంబర్ 14న బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే కర్ణాటక కాంగ్రెస్‌లోనూ, రాష్ట్ర ప్రభుత్వంలోనూ కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయనే ప్రచారం కూడా బలంగానే ఉంది. కర్ణాటకలో అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా కొనసాగిన రికార్డు దివంగత మాజీ ముఖ్యమంత్రి డి దేవరాజ అర్స్ కు ఉంది. ఆయన సుమారు 7.6 సంవత్సరాలు అంటే 2,792 రోజులు ముఖ్యమంత్రిగా ఉన్నారు. 2026 జనవరి 6వ తేదీ నాటికి సిద్ధరామయ్య ఆ రికార్డును సమం చేసే వీలుంది. సెకెండ్ టర్మ్‌లోనూ ఐదేళ్ల పాటు పూర్తికాలం సీఎంగా కొనసాగాలని సిద్ధరామయ్య పట్టుదలతో ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేతలు చెబుతున్నారు.

# మరోమారు పెరిగిన బంగారం ధరలు

- 24 క్యారెట్ల బంగారం ధర 1, 23, 220కి చేరిక

**హైదరాబాద్, నవంబర్10 (జనంసాక్షి) :** ఇటీవలి కాలంలో వరుసగా తగ్గుతూ వస్తున్న బంగారం ధర సోమవారం మళ్లీ పెరిగింది. తీసుకుంది. 10వతేదీ ఉదయం 9 గంటల తర్వాత బంగారం ధర భారీగా పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 23, 220కి చేరింది. గతంతో పోల్చుకుంటే దాదాపు రూ.1200 పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 11, 950కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే దాదాపు రూ.1100 పెరిగింది.ఇటీవల ధర బాగా తగ్గడంతో కొనుగోళ్లు పెరగడమే ఈ పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఇక, ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 23, 370కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 13, 100కి చేరుకుంది.ఇక వెండి ధరల్లో కూడా భారీ పెరుగుదల నమోదైంది. కేజీకి 2,500 రూపాయల మేర వెండి ధర పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ. 1, 67, 000గా ఉంది. ఇక, ఢిల్లీలో కిలో వెండి ధర రూ.1, 55, 000గా ఉంది. పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడూ మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు సమీక్షించుకోవాల్సి ఉంటుంది.

# ఓటర్ జాబితా స్పెషల్ రివిజన్ సూపర్ ఎమర్జెన్సీ లాంటిదే

- మరోమారు మండిపడ్డ మమతా బెనర్జీ



**కోల్‌కతా, నవంబర్10 (జనంసాక్షి) :** ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి విరుచుకుపడ్డారు. కేంద్రం, ఎన్నికల కమిషన్‌పై విమర్శలు గుప్పించారు. డీమోనిటైజేషన్, ఎస్ఐఆర్ డ్రైవ్‌ను ఒకేగాట కడుతూ మొదటిది 'నోట్‌బందీ' అయితే, రెండవది 'ఓట్‌బందీ' అని అన్నారు. సిలిగురిలో సోమవారంనాడు మీడియాతో మాట్లాడుతూ సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు కొద్దిరోజుల ముందు ఎస్ఐఆర్ డ్రైవ్ చేపట్టాల్సిన అవసరం ఏముందని మమతా బెనర్జీ ప్రశ్నించారు. ఈ చర్యను సూపర్ ఎమర్జెన్సీతో ఆమె పోల్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఉపసంహరించుకోవాల్సిందిగా ఈసీని కోరారు. ఎస్ఐఆర్‌ను విమర్శించినందుకు బీజేపీ తనను జైలుకు పంపినా, గొంతు కోసినా ప్రజల ఓటు హక్కులను మాత్రం ఊడలాక్కోలేరని అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ప్రజలను బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం వేధిస్తోంది. నోట్లరద్దు ఎలాటిందో ఓట్‌బందీ కూడా అలాంటిదే. ఎన్నికలకు ముందు ఇంత హడావిడిగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎందుకో నాకు అర్థం కావడం లేదు. ఈసీ తక్షణం ఈ ప్రక్రియను ఆపేయాలి. ఓటర్ల జాబితా రివిజన్ అనేది రెండు మూడు నెలల్లో పూర్తయ్యేది కాదు, బలవంతంగా దీన్ని నిర్వహిస్తున్నారు' అని మమత ఆక్షేపణ తెలిపారు. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో గత వారంలో ఎస్ఐఆర్ డ్రైవ్ మొదలైంది. డిసెంబర్ 9 నాటికి ముసాయిదా ఎన్నికల జాబితాను విడుదల చేస్తామని, ఫిబ్రవరి 7న తుది జాబితాను పబ్లిష్ చేస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. రెండో విడత ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహిస్తున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అండమాన్ నికోబార్ ఐలాండ్స్, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ ఉన్నాయి. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమబెంగాల్‌లో 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. అదే ఏడాది ఎన్నికలు జరగాల్సిన రాష్ట్రాల్లో అసోం కూడా ఉంది.

# కేరళలో కూలిన వాటర్ ట్యాంకర్

- ఆయా ప్రాంతాల్లో పలు ఇళ్లలోకి చేరిన నీరు
- హఠాత్ పరిణామంతో భయాందోళనలో ప్రజలు



**కొచ్చి, నవంబర్ 10 (జనంసాక్షి) :** కేరళ వాటర్ అథారిటీ ఫీడర్ ట్యాంక్ సోమవారం తెల్లవారుజామున ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో ఆయా ప్రాంతాల్లో పలు ఇళ్లలోకి నీరు చేరింది. నీటి తాకిడికి పలు ఇళ్లు కూలిపోయాయి. దీంతో అనేక ఇళ్లు వరదలో చిక్కుకున్నాయి. ఈ హఠాత్ పరిణామంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నీరు ఉధృతంగా రావడంతో పలు ఇళ్ల పైభాగాలు కూలిపోయాయని.. అనేక వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయని అధికారులు పేర్కొన్నారు. కేరళలోని తమ్మనం అనే ప్రాంతంలో ఉన్న కేడబ్ల్యూఏ నీటి ట్యాంక్ కూలడంతో 1.38 కోట్ల లీటర్ల నీరు ఒక్కసారిగా జనావాసాలపై గుమ్మరించి నట్లు పడిపోయింది. తెల్లవారుజామున 2 గంటలకు కేడబ్ల్యూఏ ఫీడర్ పంప్ హౌస్‌లోని వాటర్ ట్యాంక్‌లో కొంత భాగం కూలిపోవడం తో ఈ సంఘటన జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న ఇళ్లల్లోకి భారీగా నీరు చేరడంతో అనేక ఎలక్ట్రిక్ పరికరాలు, ఫర్నిచర్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. సమీపంలోని ఆరోగ్య కేంద్రంలోకి నీరు చేరడంతో పెద్ద మొత్తంలో మందులు, వైద్య పరికరాలు పాడైనట్లు అధికారులు తెలిపారు. ఈ ట్యాంక్‌ను 50 ఏళ్ల క్రితం నిర్మించారని.. దీనినుంచి కొచ్చి, త్రిపునితుర ప్రాంతాలకు నీరు సరఫరా అవుతుందని ఎర్నాకుళం ఎమ్మెల్యే వినోద్ వెల్లడించారు. వరద వల్ల ప్రభావితమైన ప్రజలకు నష్టపరిహారం చెల్లించాలని కేడబ్ల్యూఏను కోరారు. కొచ్చి, ఇతర ప్రాంతాలకు నీటి సరఫరా కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు కేడబ్ల్యూఏ అధికారులు తెలిపారు.

# కేపీసీ ప్రాజెక్టు సంస్థలో జీఎస్టీ అధికారుల సోదాలు




**హైదరాబాద్, నవంబర్10 (జనంసాక్షి) :** నగరంలోని పంజాగుట్ట, బేగంపేటలో ఉన్న కేపీసీ ప్రాజెక్టు సంస్థకు చెందిన కార్యాలయాల్లో సోమవారం మధ్యాహ్నం నుంచి జీఎస్టీ అధికారుల సోదాలు కొనసాగాయి. ఏడు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేస్తున్నారు. ఈ సంస్థ వ్యాపార లావాదేవీలు, జీఎస్టీ చెల్లింపులకు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో వాణిజ్య పన్నుల కమిషనర్ రఘునందన్‌రావు ఆదేశాలతో అధికారులు సోదాలు చేపట్టారు. అర్ధరాత్రి వరకు తనిఖీలు కొనసాగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

# యూపీ స్కూళ్లలో వందేమాతరం తప్పనిసరి

- పిల్లలకు దేశభక్తి అలవాటు చేయాలి : యోగి



**లక్నో, నవంబర్10 (జనంసాక్షి) :** ఉత్తర్ ప్రదేశ్‌లో యోగి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో ఇకమీదట వందేమాతరం గేయాన్ని తప్పనిసరిగా ఆలపించాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ సోమవారం తెలిపారు. ఈ మేరకు గోరఖ్‌పుర్‌లో 'ఏక్తా యాత్ర పేరిట నిర్వహించిన సామూహిక వందేమాతరం కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు. ఇలా ప్రతీ పాఠశాలలో జాతీయ గేయాన్ని పాడటం ద్వారా.. పిల్లలకు చిన్ననాటి నుంచే దేశభక్తితో పాటు జాతీయ గేయంపై గౌరవభావం వంటివి అలవడతాయన్నారు. వందేమాతరంను వ్యతిరేకించే వారు దేశ ఐక్యత, సమగ్రతను అవమానించినట్టేనని ఈ సందర్భంగా యోగి అన్నారు. దేశంలో నివసించే ప్రతి పౌరుడూ విధేయతగా, ఐక్యత కోసం పనిచేయాలని కాంక్షిస్తున్నట్టు ఆయన చెప్పారు. కులం, ప్రాంతం, భాషల పేరుతో సమాజాన్ని విభజించే వంటి అంశాలను గుర్తించి ఎప్పటికప్పుడు వాటిని వ్యతిరేకించాలని యోగి సూచించారు. ఇలాంటి విభజనలు కొత్త జిన్నాలను సృష్టించే కుట్రలో భాగమని అని ఆయన చెప్పుకొచ్చారు. దేశంలో నూతన జిన్నాలకు తెరలేపకుండా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. భారత స్వాతంత్య ఉద్యమ సమయంలో ఎందరికో స్ఫూర్తి రగిలించిన 'వందేమాతరం' గేయాన్ని 1875 నవంబర్ 7న బంకిం చంద్ర ఛటర్జీ రచించారు. ఇది తొలిసారిగా 'ఆనంద్‌మఠ్' నవలలో ప్రచురితమైంది. ఈ గేయానికి 2025 నవంబర్ 7 నాటికి 150 వసంతాలు పూర్తయ్యాయి. దీనిని ఏడాది పాటు దేశవ్యాప్తంగా ఓ ప్రత్యేక కార్యక్రమంగా నిర్వహించాలని ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పీఎం నరేంద్రమోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. 'వందేమాతరం' అనే పదం ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడం సహా.. నూతన భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుందని మోదీ పేర్కొన్నారు.

# పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ సమర్పణలో జాగ్రత్తలు పాటించాలి

- సైబర్ మోసాల గురించి హెచ్చరిక

**హైదరాబాద్, నవంబర్10 (జనంసాక్షి) :** పింఛనుదారులు తమ వార్షిక డిజిటల్ జీవన ప్రమాణ పత్రం లైఫ్ సర్టిఫికెట్ సమర్పణలో జాగ్రత్తలు పాటించాలని కేంద్ర ప్రభుత్వ పింఛను, పింఛనర్ల సంక్షేమ విభాగం సూచించింది. నవంబర్ 1 నుంచి 30 వరకు జరుగుతున్న 'డీఎల్‌సీ క్యాంపెయిన్ 4.0'లో భాగంగా లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణ కొనసాగుతోంది. ఈ ప్రక్రియలో సైబర్ మోసాలకు గురయ్యే అవకాశం ఉందని ప్రభుత్వం తెలిపింది. ఇటీవల హైదరాబాద్‌లోని బర్కత్‌పురలో నివసించే విశ్రాంత ఉద్యోగి ఇలానే సైబర్ మోసానికి గురయ్యారు. లైఫ్ సర్టిఫికెట్ కోసం 'ఏపీకే' ఫైల్ పంపించి, ఇన్‌స్టాల్ చేయించిన సైబర్ నేరగాడు బాధితుడి ఖాతా నుంచి రూ.12.99 లక్షలు కొట్టేశాడు. ఈ నేపథ్యంలో పింఛన్‌దారులు తప్పనిసరిగా పాటించాల్సిన భద్రతా సూచనలను కేంద్రం విడుదల చేసింది. జీవన్ ప్రమాణ్ పత్రాన్ని అధికారిక వెబ్‌సైట్, పోస్టాఫీస్ యాప్ లేదా ఆధార్ ఫేస్ ఆర్‌డీ యాప్ ద్వారా మాత్రమే సమర్పించాలి. గుర్తు తెలియని ఏజెంట్లు లేదా అనధికారిక యాప్‌ల ద్వారా వ్యక్తిగత వివరాలు ఇవ్వకూడదు. ఆధార్ నంబర్, ఓటీపీ, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పీపీఓ నంబర్, మొబైల్ నంబర్‌ను ఎప్పుడూ అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించింది. ప్రభుత్వ సంస్థలు ఎప్పుడూ ఫోన్ లేదా ఇ-మెయిల్ ద్వారా పాస్‌వర్డ్, ఓటీపీ, బ్యాంక్ పిన్ వంటి వివరాలు అడగవు. ప్రభుత్వం పేరిట వచ్చే ఈమెయిళ్లు, మెసేజ్‌లను తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370